
'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 144

సోమవారం 14-8-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరీస్ సమర్పయామి..

చివరి టి20లో భారత్ ఓటమి.. 3-2తో సిరీస్ నెగ్గిన వెస్టిండీస్ -12లో



ఖరీదైనా.. రెండు గజాలు..!

నచ్చిన ప్రాపర్టీ తక్కువ ధరకే.. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌కు ఆదరణ -13లో



యాంటీబయోటిక్స్ కూడా..

వాయు కాలుష్యంతో యాంటీబయోటిక్స్ పని చేయడం లేదని, ఈ కేసుల సంఖ్య పెరిగిపోతోందని తాజా అధ్యయనం తెలిపింది.

వివరాలు 6లో ▸



సరిహద్దుల్లో హెరాన్ మార్క్ 2

చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో అత్యంత శక్తిమంతమైన హెరాన్ మార్క్–2 సాయుధ డ్రోన్లను భారత్ మోహరించింది.

వివరాలు 6లో ▸



మహారాష్ట్ర ఆసుపత్రిలో ఘోరం

థానే జిల్లా కాల్వా పట్టణంలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ ఆసుపత్రిలో 24 గంటల వ్యవధిలో 18 మంది రోగులు మృతిచెందారు.

వివరాలు 6లో ▸



ఆ బిల్లులపై చర్చ జరగాలి

వలసపాలన నాటి నేర చట్టాల స్థానంలో కేంద్రం ప్రతిపాదించిన 3 బిల్లులపై విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

వివరాలు 6లో ▸

4 నెలల ముందే నగారా!

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజకీయ పార్టీల్లో హడావుడి

- ఎత్తుకు పైఎత్తులు.. మాటల ఈటెలు.. ఓటర్లకు తాయిలాలు
- అన్ని రకాల అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ
- రేసులో ముందున్న బీఆర్ఎస్.. అన్ని వర్గాలను ఆకట్టుకునే దిశలో సీఎం కేసీఆర్ నిర్ణయాలు
- ప్రతిపక్షాలకు ఊపిరి ఆడనీయకుండా వరుసగా ప్రకటనలు
- బీఆర్ఎస్ సర్కారు పదేళ్ల పాలనపై వ్యతిరేకతను సొమ్ము చేసుకునే యత్నాల్లో ప్రతిపక్షాలు
- భారీస్థాయిలో కార్యాచరణను ప్రకటించిన కాంగ్రెస్.. చేరికలపైనా నజర్
- మొదట్లో చూపిన జోష్‌ను అందుకునేందుకు కాషాయ దళం యత్నాలు
- ప్రజా సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు.. డబుల్ ఇంజన్ సర్కారు నినాదంతో ముందుకు
- ప్రధాన పక్షాల వైపు చిన్న పార్టీల చూపు



(సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాష్ట్రంలో రాజకీయ పార్టీల హడావుడి ఊపందుకుంటోంది. మరో నాలుగు నెలల్లోనే ఎన్నికలు ఉండటంతో కదన రంగంలోకి దూకేందుకు మూడు ప్రధాన పక్షాలు సిద్ధమయ్యాయి. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటికే సై అంటే సై అన్నట్టుగా కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాయి. రేసులో ఎక్కడా తగ్గకుండా.. ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాలను రచిస్తున్నాయి. రెండుసార్లు గెలిచి, రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్‌కు సహజంగానే ప్రజా వ్యతిరేకత ఎదురవుతుందనే విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పథక రచన చేస్తున్నారు. ప్రజల్లో ఎంతో కొంత ఉండే మిగతా 2వ పేజీలో ▶

ఈ రెండూ ఒకటే.. ఆ రెండూ ఒకటే!

రాష్ట్రంలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీలు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలు ఆసక్తి కరంగా మారాయి. బీఆర్ఎస్–బీజేపీ ఒకటేనని, వాటి మధ్య లోపాయికారీ పొత్తు ఉందని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒకటేనని, కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించినా వెళ్లేది బీఆర్ఎస్‌లోకేనని అంటూ ఆరోపణలు చేస్తోంది. ఇదే సమయంలో రెండు ప్రతిపక్షాలు కూడా అధికార బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. మరోవైపు ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ– ఇన్నాళ్లూ పాలించిన కాంగ్రెస్ రెండూ తెలంగాణకు నష్టం చేశాయని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఆ రెండు పార్టీలను నమ్మితే మోసపోతామని ప్రచారం చేస్తోంది. ఇలా ఎన్నికలకు మరో నాలుగు నెలలు ఉండగానే.. రాష్ట్ర రాజకీయ క్షేత్రం రణరంగాన్ని తలపిస్తోంది.

నవంబర్ 2, 3 తేదీల్లో గ్రూప్–2 పరీక్షలు

షెడ్యూల్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ

పరీక్ష తేదీలకు వారం ముందు నుంచి హాల్ టికెట్లు

సాక్షి, హైదరాబాద్: అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు గ్రూప్–2 పరీక్షలను రీషెడ్యూల్ చేస్తున్నట్టు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం ప్రకటించింది. ఈ ఏడాది నవంబర్ 2, 3 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపింది. నవంబర్ 2న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్–2 పరీక్ష ఉంటాయని వెల్లడించింది. నవంబర్ 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్–3, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పేపర్–4 పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. అభ్యర్థులు పరీక్ష తేదీకి వారం రోజుల ముందు నుంచీ కమిషన్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించింది. వాస్తవానికి గ్రూప్–2 పరీక్షలు ఈ నెల 29, 30వ తేదీల్లోనే జరగాల్సి ఉంది. కానీ ఇతర పోటీ పరీక్షలు ఉండటంతోపాటు వీటికి సన్నద్ధం కావడానికి మరింత సమయం అవసరమని అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పరీక్షలను కొంతకాలం వాయిదా వేయాలని కమిషన్‌కు సూచించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ రీషెడ్యూల్ చేసింది.

కాంగ్రెస్‌లోకి చంద్రశేఖర్!



మాజీమంత్రి ఎ. చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. బీజేపీలో ఉన్న ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆదివారం చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. 18న ఖర్గే సమక్షంలో ఆయన పార్టీలో చేరే అవకాశం ఉంది. -2లో

న్యూస్‌రీల్

'బి'గ్యాంగ్ బేరాల జోరు



ఇంజనీరింగ్ సీట్ల భర్తీ వ్యవహారం క్లైమాక్స్‌కు చేరుకుంది. మూడో దశలో కన్వీనర్ కోటాలో చేరే గడువు ఆదివారంతో ముగిసింది. ఇప్పుడు బి కేటగిరీ, ఎన్ఆర్ఐ కోటా సీట్లతో కాసుల పంట పండించుకునేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి.

- వివరాలు 3లో▶

'ఔట్ సోర్సింగ్'ను రద్దు చేయాలి



ఎంతో మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బలి తీసుకున్న కాంట్రాక్టు ఏజెన్సీల విధానాన్ని రద్దు చేసి, తక్షణమే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

- వివరాలు 5లో▶

'వైద్యం'లో తెలంగాణ నంబర్ వన్



వైద్యం, వైద్య విద్యలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఏపీలో నిజాం, బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులే ఉండేవని గుర్తుచేశారు.

- వివరాలు 10లో▶

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్డీ సస్పెన్షన్



లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హరికృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హరికృష్ణ స్థానంలో ఇన్‌చార్జ్ ఓఎస్డీగా సుధాకర్‌రావును నియమించారు.

- వివరాలు 3లో▶



ఇలానే నడిపిద్దాం సార్! ప్రధాని పదవి ఎవరికీ అచ్చిరావడం లేదు.. అందరూ జైలుకే వెళ్తున్నారు!



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లో సచివాలయాన్ని మువ్వన్నెల విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం

సామాన్యులే అతిథులు

ఎర్రకోటలో పంద్రాగస్టు అతిథులుగా రైతులు, కార్మికులు, టీచర్లు, నర్సులు, సర్పంచ్‌లు

1,800 మందికి ఆహ్వానం

స్వాతంత్య్ర దిన వేడుకలకు కేంద్రం భారీగా ఏర్పాట్లు

భారత 77వ స్వాతంత్య్ర దిన వేడుకలకు కేంద్ర ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. 2047 స్వాతంత్య్ర దిన శతాబ్ది ఉత్సవాల నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ఆజాదీ కా అమృతోత్సవ్‌లో భాగంగానే స్వాతంత్య్ర దిన వేడుకల్ని జరుపుతోంది. పంద్రాగస్టున ఢిల్లీలోని ఎర్రకోటలో అంబరాన్నంటే సంబరాల్లో సామాన్యుడికి పెద్ద పీట వేసింది. మొత్తమ్మీద ప్రత్యేకంగా 1,800 మంది అతిథుల్నిఆహ్వానించారు.

ఇంటింటా జెండా ఎగరాలి

సామాజిక మాధ్యమాల్లో డీపీ మార్చండి ప్రధానమంత్రి మోదీ పిలుపు



- వివరాలు 6లో▶

దుబాయ్ టు సిటీ.. గోల్డ్ స్మగ్లింగ్

13 కేసులు

15.79 కేజీలు

14లో

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కిలోల కొద్దీ బంగారం పట్టివేత
- వ్యవస్థీకృతంగా సాగుతున్న అక్రమ రవాణా
- స్మగ్లింగ్‌కు సూత్రధారులుగా రియల్టర్లు, బడా వ్యాపారులు
- ప్రత్యేకంగా క్యారియర్లను ఏర్పాటు చేసుకుని దందా



వందకు వందే భారత్



ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా వందేభారత్ రైళ్లను ఒకేసారి పెద్దసంఖ్యలో ప్రారంభించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్లు 30లోపు మాత్రమే నడుస్తున్నాయి. ఈ సంఖ్యను వీలైనంత తొందరలో వందకు చేర్చాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రస్తుతానికి నాలుగు రైళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా వాటిని వాయిదా వేశారు. - 5లో



తిరుమల కాలినడక.. ఘాట్ మార్గాల్లో ఆంక్షలు

సాయంత్రం 6 గంటలకు నడక దారి మూసివేత

- ఘాట్ రోడ్డులో సాయంత్రం నుంచి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదు
- మధ్యాహ్నం 2 తరువాత చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు అనుమతి నిరాకరణ.. చిన్నారిపై చిరుత దాడి నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయాలు

తిరుమల: ఆరేళ్ల చిన్నారి లక్షితపై చిరుత దాడి నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాలినడక.. ఘాట్ మార్గాల్లో ఆంక్షలు విధించింది. సాయంత్రం 6 గంటల నుంచి నడక దారిలో భక్తులను అనుమతించకూడదని నిర్ణయించింది. అదేవిధంగా ఘాట్ రోడ్డులో సాయంత్రం నుంచి ద్విచక్ర వాహనాలను అనుమతించరు. మధ్యాహ్నం 2 గంటల తరువాత చిన్న పిల్లలతో వచ్చే తల్లిదండ్రులను నడక దారిలో అనుమతించరు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కాలినడక మార్గాలు, ఘాట్ రోడ్డులో యాత్రికుల భద్రత దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలిపిరి మార్గంలో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 15 సంవత్సరాలలోపు చిన్నారులను తల్లిదండ్రులు, బంధువులతో అనుమతిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పెద్దలకు మాత్రమే అలిపిరి మిగతా 10వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ సంస్థలు అప్పులపాలు

ఈటల రాజేందర్



హనుమకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. ఆదివారం హనుమకొండలో జరిగిన తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను సీఎం కేసీఆర్ అప్పులపాలు చేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్ల సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అవలంబిస్తున్న నాన్చివేత ధోరణి అవలంబిస్తున్నాయని అన్నారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర నూతన కమిటీని ప్రతినిధులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.రవీందర్ ఎన్నికయ్యారు.

పార్లమెంటరీ వ్యవస్థపై రేవంత్‌కు నమ్మకం లేదా?

దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ప్రజా స్వామ్య వ్యవస్థపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి నమ్మకం పోయిందా అని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. అందుకే ప్రజాకోర్టు పేరుతో ఓ అట్టర్‌ఫ్లాప్ షో నడిపించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. తెలంగాణభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ప్రజాకోర్టు అంటూ రేవంత్‌రెడ్డి బాహుబలి సెట్టింగ్ వేసి, పులకేశి సినిమా చూపించారని ఎద్దేవా చేశారు. తిరగబడటం, తరిమికొట్టడం అనేది ప్రజాస్వామిక సిద్ధాంతమా? లేక తెలంగాణ నయా నయీమ్ రేవంత్ తీవ్రవాదమా? అని ప్రశ్నించారు.

ట్యాంక్ బండ్‌పై గద్దర్ విగ్రహం పెట్టాలి

గద్దర్ సమాధి వద్ద వైఎస్ షర్మిల నివాళి



సాక్షి, హైదరాబాద్: ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అల్వాల్ భూదేవి నగర్‌లోని గద్దర్ నివాసానికి వెళ్లిన ఆమె ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, సమాధి వద్ద నివాళులర్పించారు. గద్దర్ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెల్పిన షర్మిల... ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ముద్రించాల్సిన అవసరం ఉందని, గద్దర్ సొంత ఊరు తూప్రాన్‌లో ఆయన పేరిట స్మారక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. గద్దర్ చేత కంటతడి పెట్టించిన కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పాలన్నారు. 9 ఏళ్లలో ఒక్కసారి కూడా గద్దర్‌కి కేసీఆర్ అపాయింట్మెంట్ ఇవ్వలేదని.. ఆయన విషయంలో కేసీఆర్ ఒక నియంతలా వ్యవహరించారన్నారు. ప్రగతి భవన్ దగ్గర రోజంతా ఎదురు చూసినా లోపలకు పిలవకపోవడంతో.. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది అని గద్దర్ కన్నీళ్లు పెట్టుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైఎస్సార్ అంటే గద్దర్‌కి చాలా ప్రేమ అని, నాతో చాలాసార్లు వైఎస్సార్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారన్నారు.

జానా, పొన్నాల భేటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేతలు, రాష్ట్ర మాజీ మంత్రులు కె.జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని జానారెడ్డి నివాసానికి వెళ్లిన పొన్నాల దాదాపు నాలుగు గంటలసేపు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సోమవారం గాంధీ భవన్‌లో ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం జరగనున్న నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

జనగామ నుంచి పోటీ చేయాలనుకుంటున్నా..

సీఎంగా గెలిపిస్తే నెలలో లక్ష ఉద్యోగాలు: కేఏ పాల్



జనగామ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం నుంచి పోటీచేయాలనే ఆలోచన చేస్తున్నట్లు ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి.. కెమిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే, సీఎంగా బాధ్యతలు తీసుకున్న నెల రోజుల్లో లక్ష ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వైఎస్ షర్మిల తన పార్టీలోకి వస్తే పాలేరు టికెట్ ఇవ్వడంతో పాటు గెలిపించుకునే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేసీఆర్, తాను ఇద్దరం ఆంధ్రా నుంచి వచ్చిన వారమే అన్నారు.

4 నెలల ముందే నగారా!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకత నుంచి గట్టెక్కి... మూడోసారి గెలుపుతో హ్యాట్రిక్ సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అన్ని వర్గాలను ఆకట్టుకునేలా పథకాలు, ప్రకటనలు చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రంపై పట్టు సాధించే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాయి. బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ హామీలను నెరవేర్చలేదంటూ, రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందంటూ ప్రచారం చేస్తున్నాయి. దీంతోపాటు తాము అధికారంలోకి వస్తే ఏమేం చేస్తామో చెప్తూ.. ప్రజలను ఆకట్టుకునేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఇక వామపక్షాలు, బీఎస్పీ, వైఎస్సార్‌టీపీ, టీజేఎస్ పార్టీలు ఈసారి ఎంతో కొంత ప్రభావం చూపించే దిశగా అడుగులు వేస్తున్నాయి.

కర్ణాటక ఎఫెక్ట్.. అంతర్గత విభేదాలతో..

పొరుగున ఉన్న కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాలపై ప్రభావం చూపించాయి. గత మూడేళ్లలో దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల గెలుపు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించడంతో బీజేపీలో జోష్ కనిపించింది. ఆ పార్టీలోకి వరుసగా నేతల చేరికలు జరిగాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టి బీజేపీ ప్రధాన ప్రతిపక్ష స్థానంలోకి వచ్చినట్టు కనిపించింది. ఒకదశలో కమలదళం చేపట్టిన ఆందోళనలు, నిరసనలు, వివిధ కార్యక్రమాలతో అధికార బీఆర్ఎస్‌ను హడలెత్తించింది. అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్.. అధికార పార్టీని, సీఎం కేసీఆర్, వారి కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించడం, రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించడం ద్వారా కార్యకర్తల్లో జోష్ నింపారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనే అభిప్రాయం కల్పించారు. అయితే కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఓడిపోవడంతో ఇక్కడ ఆ పార్టీలో నిరాశ కమ్ముకుంది. అదే సమయంలో అంతర్గత విభేదాలు, నేతల చేరికలు నిలిచిపోవడం, బండి సంజయ్‌ను తప్పించి, కిషన్ రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం వంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో ఆందోళనతో కొంత కాలం స్తబ్దుగా మారింది. తాజాగా పార్లమెంట్ సమావేశాలు ముగియగానే బీజేపీ మళ్లీ దూకుడుగా కార్యాచరణను ప్రారంభించింది. జాతీయ నాయకుల పర్యటనలు, ప్రజాసమస్యలపై పోరాటాలతో జవసత్వాలు కూడదీసుకునే ప్రయత్నాలు చేస్తోంది.

దూకుడుగా బీఆర్ఎస్..

అధికార బీఆర్ఎస్ ఎన్నికల రేసులో ముందంజలో దూసుకెళ్తున్నట్టు కనిపిస్తోంది. కేసీఆర్ వ్యూహ రచన, కేటీఆర్ దూకుడు, పార్టీ ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో ఉండేలా కార్యక్రమాలతో ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే దిశలో కేసీఆర్ వరుసగా తాయిలాలను ప్రకటిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ, వీఆర్ఏ, పంచాయతీ కార్యదర్శులు, దివ్యాంగులు, రైతులకు వరాలు ప్రకటించిన సీఎం ఉద్యోగులకు రెండో పీఆర్సీ, మధ్యంతర భృతి(ఐఆర్)ని కూడా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ, స్థలం ఉన్నవారికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయంతోపాటు మహిళా ఓటర్ల కోసం ప్రత్యేకంగా మరో పథకాన్ని ప్రకటిస్తారనే చర్చ జరుగుతోంది. ఈసారి కూడా పార్టీ అభ్యర్థులను ముందే ప్రకటించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈనెల మూడో వారంలోనే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటిస్తారనే అంచనాలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి సీఎం కేసీఆర్ కసరత్తు పూర్తి చేశారని చర్చ జరుగుతోంది.

గెలుపుతో ఊపు.. 'ఐక్యత'వైపు చూపు

కొన్నేళ్లుగా రాష్ట్రంలో ప్రాభవం కోల్పోతున్నట్టుగా కనిపించిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి.. కర్ణాటకలో బీజేపీని కాంగ్రెస్ కంగుతినిపించి అధికారం దక్కించుకోవడంతో కొత్త ఉత్సాహం వచ్చింది. దీనికి తోడు పార్టీ అధిష్టానం తెలంగాణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టడం, నేతలంతా విభేదాలు వీడి ఐక్యంగా ఉంటే కర్ణాటక తరహాలో గెలుపు సాధించవచ్చని ఉద్బోధించడం కూడా ప్రభావం చూపింది. దూకుడుగా ఆందోళనలు, నిరసనలు చేపట్టడం, ఇతర పార్టీల నేతలను చేర్చుకోవడం ద్వారా ముందుకు దూసుకెళుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు బలమైన నేతలతోపాటు జిల్లాల్లో కొంత మంది నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేర్చుకుని.. ఎన్నికల కోసం వేగంగా సిద్ధమవుతోంది. అమెరికాలో తానా సభలో ఉచిత విద్యుత్‌పై పార్టీ రాష్ట్ర చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కొంత నష్టం కలిగించినా.. కాంగ్రెస్ వెంటనే దిద్దుబాట పట్టింది. ''తిరగబడదాం.. తరిమికొడదాం' అంటూ ఎన్నికల పోరుకు కార్యాచరణను ప్రకటించింది. ఇప్పటికే రైతు, యూత్ డిక్లరేషన్లను ప్రకటించగా.. రుణమాఫీ, భారీగా ఉద్యోగాల భర్తీ వంటి హామీలతో ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఇప్పటికీ రాష్ట్ర కాంగ్రెస్‌లో అంతర్గత పోరు ఓ కొలిక్కి రాకపోవడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది.

చిన్న పార్టీల పరిస్థితి ఏమిటి?

జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టుగానే.. రాష్ట్రంలోనూ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగానే వైఎస్సార్‌టీపీని విలీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలోని టీజేఎస్‌తోనూ సయోధ్య కుదుర్చుకునేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు వామపక్షాలు మాత్రం బీఆర్ఎస్‌తో కలసి వెళ్లడానికి మొగ్గు చూపిస్తున్నాయి. ఈ పొత్తుకు బీఆర్ఎస్ సానుకూలంగానే ఉన్నా.. అసెంబ్లీ సీట్లు కేటాయించడానికి సిద్ధపడకపోవడం గందరగోళానికి కారణమవుతోంది. ఈ పొత్తు అంశం ఏమవుతుందన్న దానిపై చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి చంద్రశేఖర్!

బీజేపీకి రాజీనామా.. 18న ఖర్గే సమక్షంలో పార్టీలోకి..

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి ఏ.చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. బీజేపీలో ఉన్న ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని చంద్రశేఖర్ నివాసానికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ మంత్రి చంద్రశేఖర్ తనవంతు పాత్ర పోషించారన్నారు. తర్వాత టీఆర్ఎస్‌లో అన్యాయం జరగడంతో బీజేపీ మాటలు నమ్మిన చంద్రశేఖర్ ఆ పార్టీలోకి వెళ్లారని, ఆ రెండు పార్టీలు ఒకటేనని తెలుసుకొని ఇప్పుడు బీజేపీకి రాజీనామా చేశారని చెప్పారు. కేసీఆర్ వ్యతిరేక రాజకీయ పునరేకీకరణలో భాగంగా చంద్రశేఖర్‌ను కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించేందుకు వచ్చామని చెప్పారు. తమ ఆహ్వానానికి చంద్రశేఖర్ సూత్రప్రాయంగా అంగీకరించారని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధమని, ఈ రాష్ట్రానికి పట్టిన చీడపీడలను వదిలించేందుకు అందరూ కాంగ్రెస్ పార్టీతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 18న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్రానికి వస్తున్నారని, ఆయన సమక్షంలో నిర్వహించే బహిరంగసభలో రాష్ట్రంలోని పేదలకు మేలు జరిగే డిక్లరేషన్ చేస్తామని చెప్పారు. జహీరాబాద్‌లో జరిగే సభలోనే చంద్రశేఖర్ పార్టీలో చేరుతానని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. రేవంత్ వెంట ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.



చంద్రశేఖర్‌ను ఆలింగనం చేసుకుంటున్న రేవంత్ రెడ్డి

డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ

కొల్లాపూర్, మహేశ్వరం నేతల చేరిక కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ రేవంత్

సాక్షి, హైదరాబాద్: రైతులెవ్వరూ బ్యాంకులకు ఒక్క రూపాయి కట్టవద్దని, ఈ ఏడాది డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం తెలంగాణలో ఏర్పడే ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో కొల్లాపూర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ, పార్లమెంటులో నోరు తెరవకపోయినా కేసీఆర్‌ను పాలమూరు జిల్లా భుజాలపై మోసిందని, అయినా పాలమూరు ప్రజలను కేసీఆర్ వంచించారని విమర్శించారు. పాలమూరు ప్రజానీకం ఈసారి జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించే బాధ్యత తీసుకోవాలని, పాలమూరులో 14కు 14 స్థానాలు గెలిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 100 స్థానాలు ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామగ్రామాన తిరిగి ప్రతి తలుపు తట్టాలని, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని, ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, రూ.500కే మహిళలకు వంటగ్యాస్ సిలెండర్ అందిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు.

కొత్త ఓటర్ల వద్దకు యూత్ కాంగ్రెస్ బండి

కళాశాలలు, బస్టాండ్లు, మాల్స్ వద్ద 'తొలి ఓటర్ల'కు అవగాహన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఫస్ట్ ఓట్'కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువత వద్దకు వెళ్లేందుకు వాహనాలను ఆదివారం గాంధీ భవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఫస్ట్ ఓట్ పోస్టర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే విడుదల చేశారు. ఆ తర్వాత శివసేనారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, తొలిసారి ఓటుహక్కు వినియోగించుకునే వారికి అవగాహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ ఈ కార్యక్రమం చేపట్టిందని, ఓటర్లుగా నమోదు చేసుకోవడం, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని చెప్పారు. తెలంగాణ యూత్ కాంగ్రెస్ వాహనాలు రాష్ట్రంలో యువ ఓటర్లు ఎక్కువగా ఉండే కళాశాలలు, ట్యూషన్ హబ్‌లు, బస్టాండ్లు, మాల్స్ తదితర ప్రదేశాలకు వెళ్లి వారికి అవగాహన కల్పిస్తాయని చెప్పారు. అదే విధంగా 'శక్తి- సూపర్ షీ'కార్యక్రమాన్ని కూడా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో చేపట్టి మహిళల హక్కులను కాపాడేందుకు ప్రయత్నిస్తామని, శివసేనారెడ్డి వెల్లడించారు.

చట్టసభల్లో నియోగి బ్రాహ్మణులు ఉండాలి

నియోగి బ్రాహ్మణ ఆత్మగౌరవసభలో ఎమ్మెల్యే జగ్గారెడ్డి



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

యాదగిరిగుట్ట: దేశాన్ని పరిపాలించిన మహ్మదీయుల దగ్గరైనా, హిందూ రాజుల వద్ద అయినా రాజకీయ నిర్ణయాలు తీసుకోవడంలో బ్రాహ్మణులే కీలకపాత్ర పోషించారని, ఇది చరిత్ర చెప్పిన నిజమని సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ''మేమెంతో.. మాకంత'' అనే నినాదంతో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో తెలంగాణ నియోగిబ్రాహ్మణ ఆత్మగౌరవసభ జరిగింది. సభలో జగ్గారెడ్డి మాట్లాడుతూ నియోగి బ్రాహ్మణులు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారి ప్రాతినిధ్యం చట్టసభల్లో ఉండాలని అన్నారు. తమలాగే బ్రాహ్మణులు కూడా ఎక్కువమంది చట్ట సభల్లోకి వచ్చేలా చూడాలని దేవుడిని మొక్కుతానని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న సమయంలో తన కంటే బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు బెటర్ అని, అతడికే ఇవ్వాలని అధిష్టానాన్ని కోరానని వెల్లడించారు. ఎక్కడ, ఎలాంటి అవకాశం వచ్చినా నియోగి బ్రాహ్మణుల కోసం గళం వినిపిస్తానన్నారు. జగ్గారెడ్డి గెలుపోటములకు బానిస కాదని, గెలిస్తే పొంగిపోనని, ఓడిపోతే నిరాశ చెంది ఇంట్లో ఉండనని పేర్కొన్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలో 'దళితబంధు' కోసం రోడ్డెక్కిన దళితులు

సీఎం దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో దళితులు రోడెక్కారు. దళితబంధును అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం దళితులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దళితబంధు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తిగుల్, నిర్మల్‌నగర్, బస్వాపూర్, అలిరాజీపేట గ్రామాల దళితులు ఆందోళన చేశారు. జగదేవ్‌పూర్ -భువనగిరి ప్రధాన రహదారిపై గంటసేపు నిర్మల్ నగర్ దళితులు రాస్తారోకో చేపట్టారు. ధర్నా కారణంగా రహదారిపై కిలోమీటర్ల మేర అటుఇటు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ చంద్రమోహన్ దళితులతో మాట్లాడి సముదాయించి ధర్నాను విరవింపజేశారు. అనంతరం గ్రామపంచాయతీ ఎదుట సర్పంచ్‌కు వ్యతిరేకంగా దళితులు నిరసన చేపట్టారు. తిగుల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో దళితులు బైఠాయించి సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. బస్వాపూర్‌లోనూ దళితులు నిరసన తెలిపారు. అలిరాజీపేటలో దళితులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల దళితులు మాట్లాడుతూ దళితబంధును అర్హులందరికీ ఇవ్వాలని, లేదంటే ఎవరికీ ఇవ్వకూడదని అన్నారు.

కాంగ్రెస్ గెలుపులో గిరిజనులే కీలకం

- వచ్చే ఎన్నికల్లో ఆదివాసీ గిరిజనులకు తగిన ప్రాధాన్యతనిస్తాం
- ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి



ఆదివారం గాంధీభవన్‌లో ఆదివాసీ గిరిజన సమావేశంలో ఠాక్రే తదితరులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాల్లో ఆదివాసీ గిరిజనుల ఓట్లే కీలకమని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి వ్యాఖ్యానించారు. ఇటీవల కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో ఆదివాసీలు కాంగ్రెస్‌కు ఇచ్చిన మద్దతు చాలా గొప్పదని, అదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లోనూ తెలంగాణ గిరిజన ప్రజలు కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీ, గిరిజనుల హక్కుల పరిరక్షణకు, వారి రాజకీయ ప్రాధాన్యతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు. టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలోని గిరిజనులను మోసం చేస్తున్నాడని, మాయమాటలు చెప్పి వారి ఓట్లను దండుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. సంక్షేమ పథకాల అమలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరీలో బీఆర్ఎస్ గిరిజనులకు తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ భరత్ చౌహాన్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో పాటు కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్, అన్ని జిల్లాల ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు టీపీసీసీ నేతలు అద్దంకి దయాకర్, శివసేనారెడ్డి, గోమాస శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి 'గృహలక్ష్మి' చేయూత

- మంత్రి కేటీఆర్ ఆదేశాలతో రాష్ట్రంలోనే మొదటి ప్రొసీడింగ్ అందజేత
- పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న చుక్క పావని దంపతులు

భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం కనుముకుల గ్రామానికి చెందిన దివ్యాంగుడైన చుక్క నరేశ్, పావని దంపతులు గృహలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోనే మొదటి ప్రొసీడింగ్‌ను అందుకున్నారు. ఆదివారం భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి.. నరేశ్ ఇంటికి వెళ్లి రూ.3 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. శనివారం పోచంపల్లి పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్.. కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా అక్కడ మగ్గం పనిచేస్తున్న చుక్క పావని, నరేశ్ కుటుంబం దీన స్థితిని తెలుసుకొన్నారు. వారికి సొంత ఇల్లు లేదని తెలుసుకొని వెంటనే స్పందించిన మంత్రి.. గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల ప్రొసీడింగ్‌ను అందజేయాలని అక్కడే ఉన్న కలెక్టర్‌ను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఆదివారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలసి నరేశ్ ఇంటికి వెళ్లి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు తమ సొంతింటి కల నెరవేరనుండటంతో ఆ దంపతులు హర్షం వ్యక్తం చేశారు. కేటీఆర్, ఎమ్మెల్యే, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మిశ్రీనివాస్, సర్పంచ్ కోట అంజిరెడ్డి, ఎంపీటీసీ బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

సర్దార్ పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగిస్తాం

- పాపన్నగౌడ్ జయంతి సభలో మంత్రి శ్రీనివాస్ గౌడ్
- పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎంపీ భరత్‌గౌడ్



పాపన్నగౌడ్ బయోపిక్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగిస్తామని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం రవీంద్రభారతిలో సర్దార్ పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ, జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో తొలి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయ్ పాపన్న గౌడ్ మహారాజ్ 373వ జయంతి జాతీయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గౌడ కులస్తుల అనేక సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. పాపన్న చరిత్ర తెలుసుకుంటే జాతిపట్ల అప్పట్లో ఎంత వివక్షత ఉందో తెలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహాన్ని పెట్టేందుకు జీవో జారీ చేశామని హెచ్ఎండీఏ అధికారులు స్థలాన్ని అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కర్ణాటక ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ మాట్లాడుతూ, బహుజనులంతా ఐక్యంగా ఉన్నప్పుడే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు భరత్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. 75 సంవత్సరాల రాజమండ్రి పార్లమెంటు చరిత్రలో మొట్టమొదటిసారి ఒక బీసీ వ్యక్తి పార్లమెంటుకు ఎంపిక కావడమే అందుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ బయోపిక్‌పై రూపొందించిన సినిమా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కీగౌడ్, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ పల్లే రవికుమార్‌గౌడ్, జై గౌడ్ ఉద్యమం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వి.రామారావుగౌడ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యం కావాలి

కలిసికట్టుగా ముందుకు సాగుదాం.. పద్మశాలీ ఆత్మగౌరవ సభలో వక్తలు



జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన పద్మశాలీ ఆత్మగౌరవ సభకు హాజరైన జనం

కోరుట్ల: రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పద్మశాలీ ఆత్మగౌరవ సభలో వక్తలు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో ఆదివారం జరిగిన పద్మశాలీ ఆత్మగౌరవ యుద్ధభేరి సభకు ప్రముఖ కవి గుంటుక నరసయ్య పంతులు ప్రాంగణంగా నామకరణం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది కులబాంధవులు తరలివచ్చారు. తొలుత ముఖ్య అతిథిగా హాజరైన మధ్యప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి (చీఫ్ సెక్రటరీ) పరికిపండ్ల నరహరి మాట్లాడుతూ, పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగితే సాధించలేనిదేదీ లేదని, చట్టసభల్లో ప్రాతినిధ్యం సాధించడంపై దృష్టి పెట్టాలని కోరారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి సంఘం ఐక్యతకు కృషి చేయాలన్నారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజకీయాల్లో ప్రాధాన్యత సాధించేవరకూ పద్మశాలీలు విశ్రమించవద్దని కోరారు. అందరూ ఏకమై 'మనఓటు మనకే' నినాదంతో ముందుకు రావాలని కోరారు. కర్నూలు ఎంపీ సంజయ్ మాట్లాడుతూ, పద్మశాలీలు ఎక్కడున్నా జన్యుపరమైన సంబంధం కలుపుతుందన్నారు. ఏపీలో పద్మశాలీలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. ఎంపీగా పార్లమెంట్‌లో పద్మశాలీలకు చెందిన రెండు వీవర్స్ బిల్లులు ప్రవేశపెట్టడానికి కృషి చేశానని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్ మాట్లాడుతూ, పద్మశాలీ కులశక్తి విచ్ఛిన్నం కాకుండా పోరాటం చేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ, రాజకీయ పార్టీ ఏదైనా పద్మశాలీలు ఐక్యంగా ఉండాలని సూచించారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ, రాజకీయ అస్థిత్వాన్ని సాధించే దిశగా ఏర్పాటు చేసిన ఈ సభకు వేలాదిగా పద్మశాలీలు తరలిరావడం అభినందనీయమన్నారు. ఆత్మగౌరవ యుద్ధభేరి సభ కమిటీ రాష్ట్ర చైర్మన్ బసవ లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ, చట్టసభల్లో ప్రాతినిధ్యం ఉంటేనే పద్మశాలీల సమస్యలకు పరిష్కారం దక్కుతుందన్నారు. బీసీల్లో అతిపెద్ద సామాజికవర్గంగా ఉన్నా.. చట్టసభల్లో ఆశించిన రీతిలో ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదన చెందారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, జగిత్యాల జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకులు గజ్జెల శ్రీనివాస్, జక్కుల ప్రసాద్ పాల్గొన్నారు.



సభలో అభివాదం చేస్తున్న ఎల్.రమణ, గుండు సుధారాణి, రాపోలు ఆనందభాస్కర్ తదితరులు

క్లుప్తంగా...

పంద్రాగస్టున వృద్ధులకు సగం చార్జి

15న ఆర్టీసీ రాయితీ

సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే 60 ఏళ్లు మించిన వృద్ధులకు టికెట్ చార్జీలో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. హైదరాబాద్ నగరంలో 24 గంటల పాటు అపరిమిత ప్రయాణానికి సంబంధించిన రూ.125 విలువైన టి–24 టికెట్‌ను రూ.75కే ఇవ్వనున్నట్టు తెలిపింది. పిల్లలకు టి–24 టికెట్ ను రూ.50కే అందజేయనున్నట్టు పేర్కొంది. ఈ వెసులుబాటు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం ఒక్కరోజు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేస్తుంది.

ఏఈఓలకు ఏవోలుగా పదోన్నతులు

ఉద్యోగులకు మంత్రి నిరంజన్‌రెడ్డి హామీ

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవో)కు వ్యవసాయ అధికారులు(ఏవో)గా పదోన్నతులు కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు మెట్ట వ్యవసాయ పట్టభద్రుల సంఘం జాతీయ అధ్యక్షుడు కల్లేపల్లి పరశురాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంత్రి నిరంజన్‌రెడ్డిని తమ ప్రతినిధి బృందం కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. డ్రైలాండ్ అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసినవారికి ఏఈవో నుంచి ఏవోగా పదోన్నతి కల్పించే జీవో 95 ఉందని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు వెంకట్‌రెడ్డి, జానీ బాబా, మోహినుద్దీన్, రవి నాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.

సిండికేట్‌లపై దృష్టి పెట్టండి

మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైన్‌షాపుల నిర్వహణ కోసం లైసెన్సులు మంజూరు చేసేందుకు ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తుల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎక్కడా సిండికేట్‌లు ఏర్పడకుండా నిఘా పెట్టాలని, ఎక్కడైనా ఎవరైనా దరఖాస్తులు సమర్పించేందుకు ఆసక్తి ఉన్న వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 4న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష జరిపారు. సమీక్షలో భాగంగా మంత్రి మాట్లాడుతూ, సిండికేట్‌లు ఏర్పడకుండా ఉండేందుకు జిల్లాలతో పాటు రాష్ట్ర స్థాయిలో ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో కూడా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దీన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నాలు చేసే వారిపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం తక్కువ దరఖాస్తులు వస్తున్న జిల్లాలకు ప్రత్యేక అధికారులను పంపుతామని చెప్పారు. దరఖాస్తు చేసుకునే విషయంలో ఎలాంటి సమస్య ఉన్నా, ఎలాంటి సమాచారం కావాలన్నా తెలుసుకునేందుకు స్థానిక ఎక్సైజ్ అధికారులను సంప్రదించాలని, టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 2523 ను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేపట్నుంచి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సమ్మె

సాక్షి,హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు, ఇతర అన్ని రకాల ఏఎన్‌ఎంలను యథావిధిగా క్రమబద్ధీకరించాలని డిమాండ్‌తో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం రోజునుంచి సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయూఎంఏహెచ్‌ఈయూ) రాష్ట్ర కమిటీ నిర్ణయించినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.


నిలబెట్టిన సం'క్షేమం'!



- రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన పేదరికం
- సర్కారు సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు ఊతం
- ఉపాధి, ఉద్యోగ అవకాశాలతో మారుతున్న సామాజిక ముఖ చిత్రం
- నీతి ఆయోగ్ విడుదల చేసిన 'బహుముఖ పేదరిక సూచిక 2019–21'లో వెల్లడి
- కుమురం భీం, గద్వాల జిల్లాల్లో మాత్రం ఇంకా వెనుకబాటు
- ఆయా చోట్ల ప్రత్యేక ప్రణాళికలు, పథకాలు అవసరమంటున్న నిపుణులు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఉచిత విద్యుత్, పంటల సాగుకు పెట్టుబడి సాయం, ఇంకా గొర్రెలు, చేపపిల్లల పంపిణీ, రేషన్ పెంపు, ఆసరా పింఛన్లు, మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు వంటివి తెలంగాణ ఆర్థిక, సామాజిక చిత్రాన్ని మార్చుతున్నాయి. పౌష్టికాహారం, అక్షరాస్యత, లింగ సమానత్వం, ఉపాధి హామీ తదితర అంశాల్లో పురోగతితోపాటు పేదరికం తగ్గిపోతోంది. ఈ మేరకు తాజాగా నీతి ఆయోగ్ విడుదల చేసిన 'బహుముఖ పేదరిక సూచిక 2019–21'లో తెలంగాణ జాతీయ సగటును మించి సత్ఫలితాలు సాధించినట్టు తెలిపింది. పేదలకు పౌష్టికాహారం మొదలుకుని బ్యాంకు ఖాతాల వరకు మొత్తం పన్నెండు అంశాలను పరిశీలించిన నీతి ఆయోగ్.. తెలంగాణలో నిరుపేదల సంఖ్య 5.88శాతానికి తగ్గినట్టు తేల్చింది.



ఉచితాలు అనుచితం అభివృద్ధి నిరోధమంటూ సంక్షేమ పథకాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. సంక్షేమ పథకాలే ప్రజలు పేదరికం నుంచి బయటపడటానికి తోడ్పడుతున్నాయని జాతీయ కుటుంబ సర్వే ఆధారంగా నీతి ఆయోగ్ వెలువరించిన పేదరిక సూచిక తేల్చింది. సంక్షేమ పథకాలు అమలవుతున్న రాష్ట్రాల్లో దారి

సంక్షేమ పథకాలే ఔషధంగా..

ద్ర్య రేఖను అధిగమిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు గుర్తించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలో 2015–2016లో 13.18శాతంగా ఉన్న నిరుపేదల సంఖ్య.. మూడేళ్లలోనే 5.88 శాతానికి తగ్గింది. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ 2015–16లో 11.77శాతంగా ఉన్న పేదరికం 6.06 శాతానికి తగ్గింది. పట్టణాల కంటే గ్రామాల్లో పేదల సంఖ్య వేగంగా తగ్గుతోందని నివేదిక తేల్చింది. తెలంగాణలో ప్రస్తుతం గ్రామాల్లో 7.51 శాతం, పట్టణాలు–నగరాల్లో 2.73శాతం పేదలు ఉన్నట్టు పేర్కొంది.

పోషకాహారమే సమస్య

దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ పోషకాహారమే పెద్ద సమస్యగా ఉందని నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. దీనివల్ల రక్తహీనత, తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం వంటివి కొనసాగుతున్నాయని వెల్లడించింది. తెలంగాణలో 2015–16లో 9.78 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడగా.. 2019–21 నాటికి ఇది 4.91 శాతానికి తగ్గింది. ఇళ్లులేని వారిశాతం 2015–16లో 8.07 శాతంగా ఉండగా.. 2019–21 నాటికి 3.17 శాతానికి తగ్గింది.

కుమురంభీం, గద్వాలలో ఎక్కువ పేదరికం

రాష్ట్రంలో జాతీయ సగటును మించి కుమురం భీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో పేదరిక శాతం ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాలు ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితిలో ఉన్నాయని.. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాల్లో పేదరిక నిర్మూలన సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి ఉందని సామాజిక పరిశీలకులు అంటున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాల ని.. పలు ప్రత్యేక పథకాల అమలు తక్షణ అవసరమని సామాజిక విశ్లేషకుడు ప్రొఫెసర్ వి.సత్తిరెడ్డి అభిప్రాయపడ్డారు.

సంక్షేమం.. ఉత్పాదక శక్తికి ఊతం



తెలంగాణలో సంక్షేమ పథకాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. మంచినీరు, విద్యుత్, పక్కా గృహాల విషయంలో చాలా మార్పు వచ్చింది. సంక్షేమ పథకాలు ఉత్పాదక శక్తికి ఊతం ఇస్తున్నాయి. నిరుపేదలు తమ కాళ్లపై తాము నిలబడే వరకు సంక్షేమ పథకాలు అమలు చేయటం, వాటిని అదే స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే సామాజిక మార్పు సాధ్యం.

– డాక్టర్ రేవతి, సెస్ సంస్థ డైరెక్టర్

సామాజిక మార్పునకు కారణమవే..



అనేక వైరుధ్యాలున్న తెలంగాణ సమాజంలో ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలతో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సంపద వివిధ రూపంలో ప్రజలకు చేరుతోంది. దాంతో నిరుపేదలు సైతం సంపద సృష్టించే స్థాయికి చేరుతుండటం శుభ పరిణామం.

– డాక్టర్ వక్లై వెంకటేశ్వర్లు, మాజీ ప్రధాన సమాచార కమిషనర్

రాష్ట్రంలో పేదరికం ఎక్కువగా ఉన్న జిల్లాలు	జిల్లా	పేదరిక శాతం
	కుమురం భీం	16.59
	గద్వాల	15.37
	ఆదిలాబాద్	14.24
	వికారాబాద్	12.50
	కామారెడ్డి	11.90
	మహబూబ్‌నగర్	10.27

రాష్ట్రంలో పేదరికం తక్కువగా ఉన్న జిల్లాలు	జిల్లా	పేదరిక శాతం
	పెద్దపల్లి	2.17
	వరంగల్ అర్బన్	2.41
	కరీంనగర్	2.50
	హైదరాబాద్	2.52
	జనగాం	2.91

దేశంలో పేదరికం తగ్గిందిలా.. 2015-16: 24.85% 2019-21: 14.96%

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డీ సస్పెన్షన్

- లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో విచారణకు ఆదేశించిన మంత్రి
- ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు



ఓఎస్‌డీ హరికృష్ణ

సాక్షి, హైదరాబాద్, శామీర్‌పేట: లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) హరికృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హరికృష్ణ స్థానంలో ఇన్‌చార్జ్ ఓఎస్‌డీగా సుధాకర్ రావును నియమించారు. లైంగిక వేధింపుల ఆరోపణలపై నివేదిక సమర్పించాలని ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని మంత్రి ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంత్రి తన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ (స్పోర్ట్స్) శైలజా రామయ్యర్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) వైస్‌చైర్మన్, ఎండీ, క్రీడా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కమిటీ సభ్యు లు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్పోర్ట్స్ స్కూల్‌లోని బాలికలు, సిబ్బందిని వేర్వేరుగా విచారించారు. పాఠశాలతోపాటు బాలికల హాస్టల్‌లోని సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. విచారణ ముగిశాక ఈ కమిటీ నివేదికను జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు అందించనుంది. కమిటీ నివేదిక ప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. కాగా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో బాలికలపై లైంగిక వేధింపుల ఆరోపణలపై ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ కవిత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ట్వీట్ చేశారు.



తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లోకి వెళుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులు

ఓఎస్‌డీని వెళ్లొద్దంటూ కారుకు అడ్డుగా నిలిచిన బాలికలు

సస్పెండ్ అయిన హరికృష్ణను స్పోర్ట్స్ స్కూల్ నుంచి వెళ్లొద్దంటూ కొందరు బాలికలు కారుకు అడ్డుగా నిలిచారు. మీరు లేకుంటే స్కూల్ అభివృద్ధి జరగదని, మీరు ఎలాంటి తప్పు చేయలేదని క్యాంపస్‌లోనే ఉండాలంటూ వారు భావోద్వేగానికి లోనయ్యారు.

తెలంగాణ దేశానికి అన్నపూర్ణ

- రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న కేసీఆర్
- ప్రకటన విడుదల చేసిన పీఆర్ ప్రత్యేక కమిషనర్

సాక్షి, హైదరాబాద్: పుట్లకొద్దీ వడ్లు పండిస్తూ తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా నిలిచిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు పౌరసంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తొమ్మిదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.59 లక్షల కోట్లు వ్యయం చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు కాలంలో పూర్తి చేసిందని వెల్లడించింది.

- మిషన్ కాకతీయ కింద రూ.5,249 కోట్లు ఖర్చు చేసి కాకతీయులకాలం నాటి గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించింది.
- 2014 నాటికి సాగువిస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు .2022–23 నాటికి అది 2.20 కోట్ల ఎకరాలకు పెరిగింది. 2014–15లో ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్ను లుండగా, 2022–23 నాటికి 2.70 కోట్ల టన్ను లకు చేరింది.
- రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు రూ.1.33 లక్షల కోట్లు భరించి 722.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది.
- రాష్ట్ర తలసరి ఆదాయం 2014–15లో రూ.1,12,162 ఉంటే, 2022–23 రూ.3,17,115కు పెరిగింది.

'బి' గ్యాంగ్ బేరాల జోరు

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఆఖరి దశలో హడావుడి
- కన్వీనర్ కోటాలో మిగిలిన వాటికి బేరసారాలు
- బి కేటగిరీ సీట్లు అమ్ముకునేందుకు ప్రయత్నాలు
- ఏజెంట్లు, కన్సల్టెన్సీలను రంగంలోకి దించిన ప్రైవేటు యాజమాన్యాలు
- కంప్యూటర్ సీట్లకు కృత్రిమ కొరత సృష్టించి తల్లిదండ్రులపై ఒత్తిడి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ సీట్ల భర్తీ వ్యవహారం క్లైమాక్స్‌కు చేరుకుంది. మూడో దశలో కన్వీనర్ కోటాలో చేరే గడువు ఆదివారంతో ముగిసింది. ఈ నెల 17 నుంచి ప్రత్యేక కౌన్సెలింగ్ ఉంటుంది. కన్వీనర్ కోటా కింద రాష్ట్రవ్యాప్తంగా 83,766 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. ఇందులో ఇప్పటివరకూ 70,627 కేటాయించారు. ఇంకా 13,139 సీట్లు ఉన్నాయి. మూడో దశ కౌన్సెలింగ్ తర్వాత కూడా సీట్లు మిగిలితే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. కౌన్సెలింగ్‌లో మిగిలిపోయే సీట్లను ప్రైవేటు కాలేజీలు స్పాట్ అడ్మిషన్లుగా భర్తీ చేయడం సర్వసాధారణం. వాస్తవానికి వీటిని ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఎఫ్‌ఆర్‌సీ) నిర్ణయించిన ఫీజులతోనే భర్తీ చేయాలి. కానీ కౌన్సెలింగ్‌లో సీటు రాని విద్యార్థులకు ఎక్కువ మొత్తం తీసుకుంటూ సీట్లు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పాటు యాజమాన్య కోటా సీట్లు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 33 వేల వరకూ ఉంటాయి. ఇందులో సగం బి కేటగిరీ కింద, మిగతా సగం ఎన్‌ఆర్‌ఐ కోటా కింద ఉంటాయి. వీటితో కాసుల పంట పండించుకునేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయి.

రంగంలోకి ఏజెంట్లు, కన్సల్టెన్సీలు

ప్రధాన ప్రైవేటు కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్లు దాదాపు భర్తీ అయ్యాయి. అయితే టాప్ టెన్ కాలేజీలను మినహాయిస్తే మిగతా కాలేజీల్లో సీట్లు మిగిలిపోతుంటాయి. వీటిని ఈ నెలాఖరు వరకూ భర్తీ చేయాల్సి ఉంటుంది. దీంతో కాలేజీలు ఏజెంట్లను, కన్సల్టెన్సీలను భారీగా కమీషన్ల ఆశచూపి రంగంలోకి దించుతున్నాయి. ఏజెంట్లు, కన్సల్టెన్సీల ప్రతినిధులు ఎంసెట్ అర్హుల జాబితా ఆధారంగా వారి ఫోన్ నంబర్లు సంపాదించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. ఏదో రకంగా నమ్మబలుకుతూ తమకు అనుకూలమైన కాలేజీల్లో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు ఏజెంట్లు తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి సీట్లు అయిపోతున్నాయని, త్వరగా అప్రమత్తం కావాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కసారి కాలేజీ యాజమాన్యం వద్దకు వచ్చి మాట్లాడాలని చెబుతున్నారు.



కంప్యూటర్ కోర్సుకు గిరాకీ

రాష్ట్రంలో కన్వీనర్ కోటా కింద 56,811 కంప్యూటర్ సైన్స్ సీట్లున్నాయి. మేనేజ్‌మెంట్ కోటాలో 19 వేల వరకు సీట్లున్నాయి. కన్వీనర్ కోటాలో 53,034 సీట్లు భర్తీ చేశారు. ఇంకా 3,777 సీట్లు మిగిలిపోయాయి. ఇవన్నీ టాప్‌టెన్ కాని కాలేజీల్లోనే ఉన్నాయి. ఇతర బ్రాంచీల్లో సీట్లు వచ్చిన వాళ్ళు, కోరుకున్న కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీట్లు రాని వారు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల కోసం ప్రయత్నిస్తున్నారు. సీఎస్‌సీ కోసం పెద్ద ఎత్తున డిమాండ్ ఉందంటూ కాలేజీల యాజమాన్యాలు, ఏజెన్సీలు, కన్సల్టెన్సీలు కృత్రిమ డిమాండ్ సృష్టిస్తున్నాయి. ఒక్కో సీటు రూ.12 నుంచి రూ.16 లక్షలకు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇందులో రూ.2 లక్షల వరకూ కన్సల్టెన్సీలకు కమీషన్లుగా ఇస్తున్నట్టు తెలుస్తోంది. నిజానికి బి కేటగిరీ సీట్లను ఎఫ్‌ఆర్‌సీ నిర్ణయించిన ఫీజుకు, మెరిట్ ప్రకారమే ఇవ్వాలి. ఈ నిబంధన ఎక్కడా పాటించడం లేదని తెలుస్తోంది. ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లు ఉన్నా ఫీజు ఎక్కువగా ఉండటంతో అవి మిగిలిపోతున్నాయి. వీటిని కూడా భారీగా డబ్బులు తీసుకుని ఎన్‌ఆర్‌ఐ కోటా మాదిరి పత్రాలు సృష్టించి అమ్మేస్తున్నారని, యాజమాన్య కోటా సీట్ల దందా ఆపాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



చందమామపై యాక్సిడెంట్..

మీరేం తీసుకెళ్తారు?

- భవిష్యత్తులో చంద్రుడిపై మనుషుల కాలనీలు
- తరచూ అంతరిక్ష ప్రయోగాలు.. రాకపోకలు..
- మరి స్పేస్‌షిప్ దూరంగా కూలిపోతే ఎలా?
- కొత్త తరహా పరీక్షను సిద్ధం చేసిన నాసా.. సోషల్ మీడియాలో వైరల్

మన ఇస్రో మొన్న చందమామపైకి రోవర్‌ను పంపింది. నిన్న రష్యా కూడా పంపింది. ఇంకొన్నేళ్లు ఆగితే మనుషులూ వెళతారు. అక్కడక్కడా కాలనీలు కట్టుకుంటారు. అప్పుడప్పుడూ జనం భూమ్మీదికి, చంద్రుడిపైకి వచ్చిపోతూ ఉంటారు. ఇంతవరకు సరేగానీ.. ఒకవేళ మీరు చంద్రుడిపైకి వెళ్లిన అంతరిక్ష నౌకలో సమస్య వచ్చి, మనుషుల కాలనీకి దూరంగా పడిపోతే ఎలా? అంతరిక్ష నౌకలో దెబ్బతినగా మిగిలిన వస్తువులను ఎలా వాడుతారు? అన్న ఓ కొత్త సవాల్ తెరపైకి వచ్చింది. అదేమిటో తెలుసుకుందామా?

– సాక్షి సెంట్రల్ డెస్క్

ఆలోచనకు పరీక్ష.. మెదడుకు మేత..

అంతరిక్షంలో విహరించాలన్నది చాలా మంది కల. ఇప్పటికే చంద్రుడిపై అడుగుపెట్టాం. ఇటీవల మరిన్ని ప్రయోగాలు చేపట్టాం. భవిష్యత్తులో చంద్రుడిపై కాలనీలనూ కట్టేసుకోనున్నాం. 2025లో మనుషులను చంద్రుడిపైకి పంపేందుకు అమెరికా ఆర్టిమిస్ మిషన్‌ను కూడా చేపట్టింది. ఈ క్రమంలో చంద్రుడిపైకి రాకపోకలు మొదలై, ఏదైనా సమస్య వస్తే ఎలాగన్న ప్రశ్న ఓ వైపు.. అంతరిక్షంపై ఆసక్తి ఉన్నవారికి మేధోశక్తికి పరీక్ష పెట్టడం, కొత్త ఆలోచనలు కల్పించే లక్ష్యం మరోవైపు.. అమెరికాకు చెందిన టెక్సాస్ యూనివర్సిటీ 'ది నాసా మూన్ సర్వైవల్ టెస్ట్'ను రూపొందించింది.

ఏ వస్తువుకు.. ఎంత ప్రాధాన్యత అంటూ..

మీరు చంద్రుడిపైకి కొంత మందితో కలిసి వెళ్లిన స్పేస్‌షిప్.. మనుషులు ఉండే కాలనీకి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో కూలిపోయింది. కమ్యూనికేషన్ పరికరాలు పాడయ్యాయి. స్పేస్‌షిప్‌లో పాడైనవి పోగా మిగిలిన 15 వస్తువుల సాయంతో.. అక్కడి నుంచి నడుస్తూ కాలనీకి వెళ్లాలి. గ్రావిటీ తక్కువగా ఉంటుంది కాబట్టి ఎగురుతూ, నడుస్తూ వెళ్లాల్సి వస్తుంది. అక్కడ అందుబాటులో ఉన్న సామగ్రి, పరికరాల లిస్టు ఇది.. వీటిలో దేనికి మొదటి ప్రాధాన్యత, తర్వాత దేనికి.. ఇలా అన్నింటికి నంబర్లు వేయాలి.

ఉన్నవి ఇవీ.. ప్రాధాన్యతలు ఏవి?



- అగ్గిపెట్టె
- పోషకాలన్నీ దట్టించిన ప్రత్యేక ఆహారం
- 50 అడుగుల నైలాన్ తాడు
- పారాచూట్ సిల్క్ (వస్త్రం)
- పోర్టబుల్ హీటింగ్ యూనిట్ (వేడిని ఇచ్చే పరికరం)
- రెండు కాలిబర్ పిస్టళ్లు
- ఒక బాక్స్ నిండా పాల సీసాలు
- ఒక్కోటీ 45కిలోల బరువున్న రెండు ఆక్సిజన్ సిలిండర్లు
- అంతరిక్షంలో చుక్కల స్థానాన్ని బట్టి మన స్థానం తెలుసుకునే మ్యాప్
- లైఫ్ రాఫ్ట్ (అత్యవసర సమయాల్లో ఒక్కసారిగా గాలి నిండి పడవలా మారే బెలూన్)
- దిక్కులను చూపించే మాగ్నెటిక్ కంపాస్
- 20 లీటర్ల నీళ్ల క్యాన్
- సిగ్నల్ ఫ్లేర్స్ (బాణాసంచా రాకెట్‌లా గాల్లోకి పంపి మన స్థానం తెలిపే పరికరం)
- వివిధ రకాల విటమిన్లు, అత్యవసర మందుల సిరంజీలు ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్
- సోలార్ పవర్‌తో పనిచేస్తూ.. ఎఫ్‌ఎం రేడియో సిగ్నళ్లు పంపే, అందుకునే పరికరం

(చందమామపై కాలనీకి దూరంగా చిక్కుకుపోయిన మీరు వీటిలో ఏయే పరికరాలకు ఎంత ప్రాధాన్యత క్రమం ఇస్తారో ఇవ్వండి. తర్వాత కింద నాసా నిపుణులు ఇచ్చిన ఫలితాలు చూడండి)

ఇదీ ప్రాధాన్యత.. దేనికి? ఎందుకు?

1. **ఆక్సిజన్ ట్యాంకులు:** అంతరిక్షంలో మనం జీవించడానికి ఆక్సిజన్ అత్యంత కీలకం. ఆహారం లేకుండా కొన్నిరోజులు ఉండొచ్చు. స్పేస్‌సూట్ శరీరంలోని నీటిని రీసైకిల్ చేయడం ద్వారా ఇంకొన్ని రోజులు బతకొచ్చు. కానీ ఆక్సిజన్ లేకుంటే నిమిషం కూడా బతకలేం. అందుకే దీనికి ఫస్ట్ ప్రయారిటీ. చంద్రుడిపై గ్రావిటీ తక్కువ కాబట్టి ఆక్సిజన్ ట్యాంకుల బరువు కూడా పెద్ద విషయమేం కాదు. భూమ్మీదితో పోలిస్తే.. ఒక్కో ట్యాంకు ఏడెనిమిది కిలోలే ఉంటుందట.
2. **మంచి నీళ్లు:** ఆక్సిజన్ తర్వాత అత్యంత ముఖ్యమైనవి మంచి నీళ్లే. తగిన స్థాయిలో నీళ్లు ఉంటే డీహైడ్రేషన్ బారినపడకుండా ఉండొచ్చు. కాలనీకి చేరుకోవచ్చు.
3. **అంతరిక్ష మ్యాప్:** చంద్రుడిపై కూడా దాదాపు భూమి నుంచి చూసినట్టే.. గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీలు కనిపిస్తాయి. అందువల్ల ముందే కాలనీలు మార్క్ చేసి ఉన్న మ్యాప్ ఉంటే.. ఆ వైపుగా ప్రయాణం చేయవచ్చు.
4. **ప్రత్యేక ఆహారం:** చిక్కుకున్న చోటి నుంచి కాలనీకి వెళ్లాలన్నా, రెస్క్యూ బృందం వచ్చేదాకా బతకాలన్నా ఆహారం కావాల్సిందే.
5. **ఎఫ్‌ఎం పరికరం:** ఎఫ్‌ఎం ట్రాన్స్‌మిటర్/రిసీవర్ పరికరాలు కొన్ని కిలోమీటర్ల వరకే సిగ్నళ్లను పంపడం, అందుకోవడం చేయగలుగుతాయి. అయినా అత్యవసర పరిస్థితుల్లో రెస్క్యూకు, సమీపంలోని ఇతర బృందాలకు సమాచారం ఇవ్వడానికి పనికివస్తాయి.
6. **నైలాన్ తాడు:** చంద్రుడిపై నైలాన్ తాడు ఎందుకు అనిపించొచ్చు. అక్కడ గ్రావిటీ తక్కువగా ఉంటుంది కాబట్టి ఒకరికొకరు తాడుతో పట్టుకుని ఉండొచ్చు. చిన్నపాటి కొండల్లాంటివి ఉంటే ఎక్కడానికి వినియోగించుకోవచ్చు. మన సామగ్రిని ఒక్కదగ్గర కట్టి ఉంచుకోవచ్చు.
7. **ఫస్ట్ ఎయిడ్ కిట్:** స్పేస్ షిప్ కూలిపోయినప్పుడు గాయపడినా, ప్రయాణంలో సమస్య తలెత్తినా, ఏదైనా అకస్మాత్తు అనారోగ్యానికి గురైనా ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో లాభం ఉంటుంది. అందులోని విటమిన్ ఇంజెక్షన్లు.. మన శరీరం సంతులనంగా ఉండటానికి తోడ్పడుతాయి.
8. **పారాచూట్ వస్త్రం:** చంద్రుడిపై వాతావరణం ఉండదు. కాబట్టి సూర్యుడి అతినీలలోహిత (యూవీ) కిరణాలు నేరుగా పడతాయి. దీనితో స్పేస్ సూట్, సామగ్రితోపాటు మన కళ్లకూ నష్టం. అలా జరగకుండా పారాచూట్ వస్త్రం కప్పుకోవచ్చు.



9. **లైఫ్ రాఫ్ట్:** అత్యవసర పరిస్థితుల్లో వాడే లైఫ్‌రాఫ్ట్‌లో వేగంగా వాయువు నిండటానికి కార్బన్ డయాక్సైడ్‌ను బాగా ఒత్తిడితో నింపిన బాటిళ్లు ఉంటాయి. చంద్రుడిపై గ్రావిటీ తక్కువగా ఉంటుంది కాబట్టి.. బాటిళ్లను స్పేస్‌సూట్‌కు కట్టుకుని, కార్బన్ డయాక్సైడ్‌ను మెల్లగా వదులుతూ ఉంటే.. రాకెట్‌లా ముందుకెళ్లిపోవచ్చు.
10. **సిగ్నల్ ఫ్లేర్స్:** కాలనీలకు దూరంగా ఎక్కడో స్పేస్‌షిప్ కూలిపోతే.. సిగ్నల్ ఫ్లేర్స్‌తో ప్రయోజనం లేనట్టే. అయితే రెస్క్యూ బృందాలు వచ్చినప్పుడు మాత్రం వాటితో మనమున్న స్థానాన్ని గుర్తించేలా చేయవచ్చు.
11. **కాలిబర్ పిస్టళ్లు:** చందమామపై పిస్టళ్లు దేనికి అనే అనుమానం రావొచ్చు. అయితే లైఫ్ రాఫ్ట్‌లలోని కార్బన్ డయాక్సైడ్ క్యాన్ల తరహాలో.. మనం వేగంగా ముందుకు దూసుకెళ్లేందుకు రాకెట్లలాగా పిస్టల్ కాల్పులు ఉపయోగపడతాయట.
12. **పాల క్యాన్‌లు:** పోషకాలతో కూడిన ప్రత్యేక ఆహారం ఎలాగూ ఉంది. ఇంకా ఈ పాల క్యాన్‌లు అదనపు బరువు. ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వస్తే మాత్రం వీటితో ప్రయోజనం
13. **హీటింగ్ యూనిట్:** చంద్రుడిపై వెలుతురు భాగంలో వేడికి కొదవ లేదు. ఒకవేళ చీకటి భాగంలోకి వెళితే మాత్రం హీటింగ్ యూనిట్ అవసరం. లేకుంటే ఉత్తదే.
14. **మ్యాగ్నెటిక్ కంపాస్:** చంద్రుడిపై అయస్కాంత క్షేత్రం సరిగా లేదు. అందువల్ల అక్కడ మ్యాగ్నెటిక్ కంపాస్‌కు పనిలేదు.
15. **అగ్గిపెట్టె:** దీన్ని ఎంచుకోవడం అన్నింటికన్నా వృథా. ఎందుకంటే చంద్రుడిపై ఆక్సిజన్ ఉండదు కాబటి అగ్గిపుల్ల వెలగదు, మంట అంటుకోదు. మనం సర్వైవ్ కావడానికి ఏమాత్రం పనికిరాదు.

బీసీలకు పూర్తిస్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

సీఎం కేసీఆర్‌కు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోస్టు మెట్రిక్ కోర్సులు చదువుతున్న బీసీ విద్యార్థులకు ర్యాంకుతో నిమిత్తం లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ , జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. ఈమేరకు కృష్ణయ్య లేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు రాయితీలను ఇస్తున్న ప్రభుత్వం.. బీసీ విద్యార్థుల పట్ల పక్షపాత వైఖరితో అరకొరగానే ఫీజులు ఇవ్వడం అన్యాయమని వాపోయారు. దీంతో మెజార్టీ బీసీ విద్యార్థులు ఉన్నత చదువులను మధ్యలోనే ఆపివేసే పరిస్థితి వస్తోందని, మరికొందరు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.



సూర్యుడు మురికిగుంటల్లో కూడా ప్రకాశిస్తాడు.
అయినా కలుషితం కాడు.
– డైయోజినీజ్

సాక్షి
సోమవారం, 14 ఆగస్టు 2023

అరచేతిలో స్వతంత్రం

ఒక్కోసారి చేతిలో ఖాళీ ఉంటుంది. కానీ ఆ ఖాళీకి సార్థకత తెచ్చేలా చేయగలిగిందేమీ తోచదు. అప్పుడు ఆడుకోవడానికి ఆన్‌లైన్ అనేది మంచి గేమ్. అందరినీ వ్యసనపరులను చేసే ఆన్‌లైన్ గేమ్స్ గురించి కాదు; ఆన్‌లైన్‌తోనే ఆడుకోవడం! దీనికి గూగుల్, వికీపీడియా, యూట్యూబ్, ట్విట్టర్ లాంటివన్నీ పనిముట్లు. ఒకదాన్లోంచి ఇంకోదాన్లోకి గెంతుతూ, కొత్త విషయాలకు ద్వారాలు తెరుచుకుంటూ వెళ్లడం సరదాగా ఉంటుంది. మామూలుగా అయితే ఇలాంటి విషయాలను తెలుసుకోవడానికి గ్రంథాలయాలను చుట్టేయాలి. అంత శ్రమ లేకుండా మన అరచేతిలోనే ఆ భాండాగారం ఉంది.

ఎక్కడినుంచి మొదలు పెట్టాలనే సమస్య అయితే ఉంటుంది. ఇది వ్యక్తిగత ఎంపిక. ఉదాహరణకు ప్రపంచ సినిమాను ఇష్టపడే ఏ స్నేహితుడో ఈ పేరును డ్రాప్ చేసివుంటాడని అనుకుందాం: 'హిరోషిమా మాన్ అమౌర్'. ఈ ఒక్క హింటు మీదే ఎన్నో విషయాలు పోగేయవచ్చు. హిరోషిమా అంటే అర్థమౌతోంది; తర్వాతి పదాలు? గూగుల్ ఎందుకుంది? మాన్ అంటే ఫ్రెంచ్‌లో 'నా'. అమౌర్ అంటే ప్రేమ. రెండో ప్రపంచ యుద్ధపు బీభత్సాన్ని చిత్రించిన సినిమా ఇది. కానీ ఆ బీభత్సం కథాకాలానికి సుదూర గతం. యుద్ధం మనుషుల మనసుల్లో ఎంత లోతైన గాయాలను చేసిందో జ్ఞాపకాల తలపోత ద్వారా చెప్పిన సినిమా. దీర్ఘ కవిత లాంటి సినిమా. పేరు లేని అతడు, ఆమె జరిపే ఏకాంత సంభాషణ. ఇదంతా సినిమా చూస్తే అర్థమౌతుంది. సినిమాకు బయటి సంగతులు?

ప్రపంచ సినిమా గతిని మార్చిన 'న్యూ ఫ్రెంచ్ వేవ్'కు ఈ సినిమా ఒక శక్తిమంతమైన చేర్పు. 1959లో వచ్చింది. ఈ వేవ్‌లో శిఖరంగా చెప్పే 'బ్రెత్‌లెస్' కంటే ఏడాది ముందే విడుదలైందని తెలియడం అదనపు విశేషం. ఇదొక ఫ్రెంచ్–జపనీస్ ఉమ్మడి నిర్మాణం. తగినట్టుగానే 'ఆమె' ఫ్రెంచ్ నటి, 'అతడు' జపనీస్ నటుడు. ఎమాన్యుయెల్ రివా, ఎయిజీ ఒకాడా. వీళ్ల విశేషాలేమిటి? రివా సరిగ్గా తొంభై ఏళ్లు బతికి 2017లో చనిపోయింది. ఆమె కవయిత్రి, ఫొటోగ్రాఫర్. ఇంకా చాంటెయూజ్. అంటే బార్ లేదా స్టేజ్ మీద పాడే నైట్‌క్లబ్ సింగర్. వీటన్నింటికంటే ఆకట్టుకునే విశేషం, ఆమె మరో సుప్రసిద్ధ సినిమా– 'అమౌర్'. రెండిట్లోనూ ప్రేమ ఉంది చూశారా? అది విదేశీ భాషా చిత్రం విభాగంలో 2012లో ఆస్కార్ గెలుచుకున్న ఫ్రెంచ్ సినిమా. ఈమెను ఇక్కడ వదిలేసి 'అతడి' దగ్గరికి వెళ్తే– ఓహో! ఈ ఎయిజీ ఒకాడా 1964లో వచ్చిన జపనీస్ కల్ట్ సినిమా 'వుమన్ ఇన్ ద డ్యూన్స్'లో హీరోనట! అందుకేనా ఆ రెండింట్లోనూ ఒకే రకమైన మగటిమి నవ్వు ఉంటుంది! ఇలాంటి నవ్వు బహుశా యూకియో మిషిమా ఇష్టపడతాడు. ఈయనెందుకు వచ్చాడు మధ్యలో? అదే 1960ల్లో ఆయన్ని సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరిస్తుందనుకున్నారు. కండలు తీరి మంచి దేహదారుఢ్యంతో ఉండే మిషిమా వేషధారణ, జీవనశైలి ఒక యోధుడిని తలపించేది. జపనీస్ సాహిత్యం 'సుకుమార హృదయ' సంబంధి అనీ, దాన్ని తాను 'మగటిమి' దిశగా లాక్కెళ్తున్నాననీ అనేవాడు.

ఇంతకీ మనం దర్శకుడి గురించి వాకబు చేయనేలేదు. ఆయన పేరును ఫ్రెంచ్ ఉచ్చారణలో అలె రెనీ అనాలట. ఈ రెనీకి సంబంధించిన విశేషాలేమిటి? 1922లో జన్మించాడు. అంటే పోయి నేడాదే శతజయంతి ఉత్సవాలు ముగిశాయి. దీనికంటే ముఖ్యమైనది, ప్రపంచ మేటి డాక్యుమెంటరీల్లో ఒకటిగా చెప్పే 'నైట్ అండ్ ఫాగ్'కు దర్శకత్వం వహించడం! 1956లో వచ్చిన ఈ డాక్యుమెంటరీ నాజీ కాన్సంట్రేషన్ క్యాంపుల్లో శవాల గుట్టలుగా మిగిలిన యూదుల దయనీయ గాథను కడుపులో తిప్పేంత దగ్గరగా చూపుతుంది. ఏ హేతువుకూ అందని దుర్మార్గం దాని పరాకాష్ఠకు చేరినప్పుడు మనిషనేవాడు కేవలం శవాల గుట్టల్లో కొన్ని గుర్తుపట్టని ఎముకలుగా మాత్రమే మిగిలిపోయే అత్యున్నత విషాదాన్ని చిత్రిస్తుంది. దర్శకుడిని వదిలేసి, ఆ సినిమాకు రచయితగా ఎవరు చేశారో చూద్దాం. మార్గ్యురైట్ డురాస్. ఈమె ఫ్రెంచ్ రచయిత్రి.

'ఫిడెలిటీ'(పాతివ్రత్య) భావాల పట్ల భిన్నాభిప్రాయాలు ఉన్నావిడ అని తెలియడం ఈమెకు సంబంధించి కొట్టొచ్చినట్టు కనబడే విశేషం. ఈమె కొన్ని సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు. ఆ జాబితాలో ఏమైనా ఉండనీ, 'ఇండియన్ సాంగ్' అనే పేరున్న సినిమాకు దర్శకత్వం వహించారని తెలియడం భారతీయ మెదడును ఆకర్షిస్తుంది. ఆమె భావాలకు తగినట్టే భారత్‌లో ఫ్రెంచ్ రాయబారి భార్య తాలూకు వ్యక్తిగత సంబంధాల నేపథ్యంలో సాగుతుంది. గొప్ప సినిమా ఏం కాదని విమర్శకులు చెబుతున్నారు, కానీ దీనికి సీక్వెల్ కూడా వచ్చింది.

ఎటూ ఆటను హిరోషిమాతో మొదలుపెట్టాం కాబట్టి, మళ్లీ అక్కడికే వద్దాం. ఆ మహా విషాదాన్ని గుర్తుచేస్తూ ఇటీవలే 'ఒపెన్‌హైమర్' సినిమా వచ్చింది. అణుబాంబు పితగా అపఖ్యాతి పొందిన రాబర్ట్ ఒపెన్‌హైమర్ నేతృత్వంలో తయారుచేసిన బాంబులనే హిరోషిమా, నాగసాకి నగరాల మీద వరుసగా 1945 ఆగస్ట్ 6, 9 తేదీల్లో వదిలింది అమెరికా. మరింత ఘోర చేదు వాస్తవం ఏమిటంటే, జపాన్‌ను లొంగదీసుకోవడం కోసం అమెరికా ఈ బాంబులు వేయలేదు; అప్పటికే జపాన్ ఓటమి అంచున ఉంది. కేవలం తన అణుపాటవ శక్తిని ప్రపంచానికి చాటడం కోసం ఈ బాంబుల్ని జారవిడిచింది. దీనివల్ల సుమారు మూడున్నర లక్షల మంది క్షణాల్లో బూడిదయ్యారు. లక్షల మంది ఏళ్లకేళ్లు దాని పర్యవసానాలు అనుభవించారు.

మూలమూలల్లోని సమాచారం ఎవరికైనా ఎప్పుడైనా అందుబాటులో ఉండటమే ఈ ఆధునిక కాలంలో నిజమైన స్వతంత్రం. ఆ ఉన్న సమాచారంతో ఏం చేస్తామనేది మన వివేకం!

రాజపుత్రుల చిత్ర విచిత్రాలు

కామెంట్



కరణ్ థాపర్

రాజకోట రహస్యాలు ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. పూర్వపు చక్రవర్తుల విపరీత మనస్తత్వాలు, విచారకర గుణాలు, దోషాలు, చిన్నపాటి పాపాలు, మహాపరాధాలు, చిలిపి చేష్టలు, సిగ్గుపడవలసిన ప్రవర్తనలు, వారి అపకీర్తుల గురించి ఎప్పుడో దివాన్ జర్మనీ దాస్ ఆసక్తికరంగా రాశారు. అందులో ఉన్నవన్నీ, ఒకవేళ అవి నిజమే అయినా, నమ్మశక్యంగా లేనివి! అయితే భారత రాజపుత్రుల లాగానే పాకిస్తాన్ రాజపుత్రులు కూడా ఉండేవారా? వారికీ వీరికీ ఏమాత్రం తేడా లేదని వెల్లడిస్తుంది 'డీథ్రోన్డ్' పుస్తకం. భారత చరిత్ర మీద పరిశోధించిన ఆస్ట్రేలియా రచయిత జాన్ జుబ్రిచికీ రాసిన ఈ పుస్తకం ఎన్నో వింత సంగతులను వెల్లడిస్తుంది.

రాజకోట రహస్యాలు నన్ను అమితంగా సమ్మోహన పరుస్తాయి. పూర్వపు చక్రవర్తుల విపరీత మనస్తత్వాలు, విచారకర గుణాలు, దోషాలు, చిన్నపాటి పాపాలు, మహాపరాధాలు, చిలిపి చేష్టలు, సిగ్గుపడవలసిన ప్రవర్తనలు, వారి అపకీర్తుల పట్ల నాలో ఆసక్తి జనించడానికి కారణమైన వారు మహారాజా దివాన్ జర్మనీ దాస్. నేను కౌమార ప్రాయంలో ఉండగా తొలిసారి ఆయన పుస్తకం చదువుతూ వదల్లేకపోయాను. అందులో ఉన్నవన్నీ, ఒకవేళ అవి నిజమే అయినా, నమ్మశక్యంగా లేనివి! ఉదాహరణకు పటియాలా మహారాజులలో ఒకరు తమ రాచ రీవికి చిహ్నంగా స్తంభించిన తమ పురుషాంగాన్ని పురవీధులలో ప్రదర్శించుకుంటూ ఊరేగింపుగా ముందుకు సాగిపోయేవారట. ఉక్కపోతల వేసవి రాత్రులలో ఆయన మహారాణులు, ఉంపుడుగత్తెలు అంతఃపుర కొలనులో తేలియాడే భారీ మంచు దిబ్బలపై శృంగార నాట్య విన్యాసాలతో విహరించేవారట. పాకిస్తాన్ వైపున ఉన్న రాజ కుటుంబీకులు కూడా ఇలానే ఉండేవారా, లేకుంటే ఇందుకు భిన్నంగానా అని అప్పుడు నాకొక ఆశ్చర్యంతో కూడిన సందేహం కలిగేది.

అర్ధ శతాబ్దం తర్వాత ఇప్పుడు, ఆనాటి నా ఆశ్చర్యంతో కూడిన సందేహం జాన్ జుబ్రిచికీ పుస్తకం 'డీథ్రోన్డ్'తో నివృత్తి జరిగింది. వారికీ వీరికీ ఏమాత్రం తేడా లేదు. కాబట్టి వారి చిత్ర విచిత్రాలతో ఈ ఉదయం నన్ను మీకు వేడుకను చేయనివ్వండి.

నాల్గవ సాదిఖ్ ముహమ్మద్ ఖాన్... బహావల్‌పూర్ నవాబు. ఆయన తన మూలాలు ముహమ్మద్ ప్రవక్త సంతతిలో ఉన్నాయని చెప్పు కొంటారు. అయితే ఆయన బూట్లు, ప్యాంట్లు, సుతిమెత్తని నూలు గుడ్డతో నేసిన మందపాటి చొక్కాలు ధరించి రాజప్రాసాద క్రికెట్ మైదానంలో కనిపిస్తూ తనకు గల ఆ ప్రత్యేక ఐరోపా క్రీడా వస్త్రధారణ అభిరుచుల పట్ల గర్వభాయిష్టంగా ఉండేవారని జుబ్రిచికీ రాశారు.

''మహా ధన సంపన్నుడై, తెల్లజాతి మగువల పట్ల అమిత మక్కువను కలిగిన ఈ నవాబు (ఆయన భార్యలలో ముగ్గురు యూరోపియన్‌లు) 1882లో అత్యంత గోప్యంగా పర్షియాలో ప్రసిద్ధి చెందిన 'లా మేజన్ క్రిస్టోఫ్లా' గృహ సామగ్రి సంస్థ నుంచి ఖరీదైన కలప మంచాన్ని 290 కిలోల నాణ్యమైన వెండి అలంకరణలతో తన అభీష్టానికి అనుగుణంగా తయారు చేయించుకున్నారు. మంచానికి నలువైపులా మంచంకోళ్ల స్థానంలో సహజమైన జుట్టు; కదలిక కలిగిన కళ్లూ, చేతులూ; ఆ చేతులతో విసనకర్రలు, గుర్రపు తోకలు పట్టుకుని ఉన్న నగ్న స్త్రీల జీవమెత్తు కాంస్య విగ్రహాలు ఉండేవి. ఆ నలుగురు నగ్న స్త్రీలు ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, గ్రీసు దేశాలకు ప్రాతినిధ్యం వహించేవారు. యంత్ర శక్తి కలిగిన ఆ మంచం ... నవాబు ఆదేశాలను అనుసరించి ఆ నగ్న దేహాలలో చలనం తెప్పించేది. ఫ్రెంచి సంగీతకారుడు గునోద్ సృష్టించిన ప్రఖ్యాత సంగీత రూపకం 'ఫౌస్ట్' తన ముప్పై నిముషాల నిడివిని పూర్తి చేస్తుండగా మాగన్నుగా పడుతున్న నిద్రలో నవాబు సరసంగా కన్ను గీటగానే ఆ నగ్న యువతుల హస్తాలలోని విసన కర్రలు మెల్లగా వీచడం మొదలయ్యేది. అందుకు తగిన సాంకేతికత ఆ చెక్క మంచం లోపల ఉండేది'' అని జుబ్రిచికీ వర్ణించారు.



మీర్ అలీ నవాజ్ ఖాన్



జాన్ జుబ్రిచికీ

సింధ్‌లోని ఖైర్‌పూర్‌లో ఇద్దరు పాలకులు కూడా జుబ్రిచికీ దృష్టిని ఆకర్షించారు. వారిలో ఒకరు విపరీతమైన ఊబకాయం కలిగిన మీర్ అలీ నవాజ్ ఖాన్. ''అమెరికన్ జర్నలిస్ట్ వెబ్ మిల్లర్ 1930లో సిమ్లాలోని సిసిల్ హోటల్‌లో మీర్ అలీని కలిశారు. మీర్ అలీ భోజనం చేస్తున్న సమయంలో ఆయన నోటికి, చేతికి మధ్య గల ప్రయాణ మార్గంలో పులుసు ఒలికి ఆయన భారీ ఉదరం అంతటా చిందిపడింది'' అని 'డీథ్రోన్డ్'లో మీర్ అలీని గుర్తు చేసుకున్నారు జుబ్రిచికీ.

మీర్ అలీ నవాజ్ ఖాన్ కుమారుడు ఫైజ్ ముహమ్మద్ ఖాన్‌కు స్కిజోఫ్రెనియా గానీ, లేదంటే ఏదైనా చిన్న మనోవైకల్యం గానీ ఉండి ఉండాలి. ''అనుకోకుండా తన తొమ్మిది నెలల కుమారుడిని తుపాకీతో కాల్చినప్పుడు తొలిసారి ఆయన మానసిక స్థితి సందేహాస్పదం అయింది. బులెట్ శిశువు కడుపులోంచి ఊపిరి తిత్తులలోకి దూసుకెళ్లి కుడి భుజం నుంచి బయటికి వచ్చేసింది.'' నమ్మలేని విధంగా బాలుడు బతికి, తండ్రి మరణానంతరం ఆయనకు వారసుడయ్యాడు.

పాకిస్తాన్‌కు వాయవ్య దిశలో ఉంటుంది దిర్. 1947లో ఆ ప్రాంతానికి పాలకుడు నవాబ్ షా జహాన్. రచయిత జుబ్రిచికీ ఆ ప్రాంతాన్ని 'ఒక నిలువనీటి కయ్య' అంటాడు. ''అక్కడ ఆసుపత్రి పడకల కంటే నవాబు వేటకుక్కల కోసం కట్టిన గృహాలే ఎక్కువగా ఉంటాయి. పాఠశాలలను నిర్మించడానికి ఆయన నిరాకరించాడు. చదువు ఎక్కువైతే తన పాలనను అంతం చేస్తుందని ఆయన నమ్మాడు'' అని రాశారు జుబ్రిచికీ.

కలాత్ అనేది పాకిస్తాన్‌లోని ఒక సమస్యాత్మక ప్రాంతం. ఆ ప్రాంతం కథ మన హైదరాబాద్, కశ్మీర్‌లకు పోలిక లేనిదేమీ కాదు. ఆ వివరాలను మీరు గూగుల్‌లో, వికీపీడియాలో వెతికి తెలుసుకోవచ్చు. కలాత్ నవాబు ఖాన్ తన రాష్ట్ర విలీనానికి సంబంధించిన సంప్రతింపుల కోసం పాకిస్తాన్ గవర్నర్ జనరల్ ముహమ్మద్ అలీ జిన్నాను కలిసినప్పుడు ఏం జరిగిందనేది మాత్రం నేను వివరిస్తాను.

కశ్మీర్‌లో మాదిరిగానే 1947 ఆగస్టు తర్వాత కలాత్‌లో స్వాతంత్ర్య సంస్థాపన జరిగింది. ఆశ్చర్యకరంగా, ''కరాచీలో ఒక రాయబారిని నియమించుకోడానికీ, ఆకుపచ్చ రంగు గుడ్డపై ఎరుపు రంగు 'పవిత్ర యుద్ధ' ఖడ్గం ఉన్న బలూచీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేందుకూ కలాత్ ప్రాంతానికి అనుమతి లభించింది.'' కలాత్ విదేశాంగ మంత్రిగా ఐ.సి.ఎస్. అధికారి డగ్లాస్ ఫెల్ నియమితులయ్యారు. ఫెల్ తన జ్ఞాపకాలలో... కలాత్ నవాబు – జిన్నాల మధ్య సమావేశం తిన్నగా సాగకపోవడంపై ఇచ్చిన వివరణను జుబ్రిచికీ పుస్తకంలో చదువుతున్నప్పుడు పొట్ట చెక్కలయ్యేంతగా నేను నవ్వేశాను.

''కలాత్ నవాబు ఖాన్ అనర్గళమైన ఉర్దూలో గంభీరంగా మాట్లాడుతున్నారు. జిన్నా కూడా అంతే అనర్గళంగా, గంభీరంగా ఇంగ్లిషులో మాట్లాడుతున్నారు. జిన్నాను ఒప్పిస్తున్నానని ఖాన్, ఖాన్‌ని ఒప్పిస్తున్నానని జిన్నా అత్యంత ఆత్మవిశ్వాసంతో చర్చల్ని నడిపి స్తున్నారు. అయితే పాకిస్తాన్ విదేశాంగ కార్యదర్శి గమనించినదేమిటంటే ఒకరు మాట్లాడుతున్నది ఒకరికి ఒక్క ముక్కా అర్థం కావడం లేదని...'' అని రాశారు జుబ్రిచికీ. ఆ విదేశాంగ కార్యదర్శి మొహమ్మద్ ఇక్రముల్లా మన మాజీ ఉపరాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి మొహమ్మద్ హిదయతుల్లాకు సోదరుడు. ఇక్రముల్లా జోర్డాన్ యువ రాణి సర్వత్ తండ్రి. నిజమైన రాజవంశీకుడైన ఏకైక పాకిస్తానీ, నాకు ప్రియమైన స్నేహితుడు కూడా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

నో డాక్టర్!



నేనొక వైద్యుడిని. నా వ్యక్తిగత ఆరోగ్య లక్ష్యం ఏమిటంటే, ఏ ఒక్క వైద్యుడి దగ్గరికి కూడా వెళ్లకుండా ఉండటం! మీరు కూడా దాన్నే లక్ష్యంగా చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తాను.

– బ్రాండన్ పెట్కే, వైద్యుడు

వెనక్కి తిప్పుతున్నారు



కరెన్సీ మొత్తంలో 86 శాతపు నోట్ల 'చలామణీ రద్దు' చేయడం వల్ల ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా ఎన్నో ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఇప్పుడు మళ్లీ ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్టుల 'చలామణీ రద్దు' చేయడం వల్ల న్యాయవ్యవస్థ పదేళ్లు వెనక్కి వెళ్తుంది.

– సందీప్ మనుధానే, విద్యావేత్త

కాల మహిమ



కృషితో పనిలేదని చెప్పనుగానీ, విధి మరింత బలమైనది. నేను పార్ట్‌టైమ్ ఎంబీయే చేస్తున్నప్పుడు ఒక్క రూపాయి బస్సు ఛార్జీ మిగల్చడం కోసం ప్రతిరోజూ పది కిలోమీటర్లు ఆకలితో నడిచేవాడిని. ఈమధ్య యూరప్ టూరులో ఒకే రోజు మూడు దేశాల్లో తినేట్టు... బ్రేక్‌ఫాస్ట్ ఇటలీలో, లంచ్ ఆస్ట్రియాలో, డిన్నర్ జర్మనీలో చేసేట్టు షెడ్యూల్ కుదిరింది.

– డి. ముత్తుకృష్ణన్, ఇన్వెస్టర్

భావాలు రుద్దకూడదు



ఆధునిక సమాజాలతో మతాలు సహజీవనం ఎప్పుడు చేయగలుగుతాయంటే – మతాలు పవిత్రమైనవిగా భావించేవాటిని ఎవరైనా అలా చూడకపోతే వారిని భయపెట్టనప్పుడు!

– అలీ మాలిక్, యాక్టివిస్ట్

ఇదే సమయం



న్యాయవ్యవస్థలో వలసవాదాన్ని అంతం చేయడానికి ఇదే సమయం. బ్రిటిష్ చట్టాలను అనుసరించడం, న్యాయసంబంధ ప్రేరణ కోసం హార్వర్డ్ వైపు చూడటం వలసవాద ఆలోచనా ధోరణికి తార్కాణం.

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యుడు

శ్రమతోనే జయం



గెలవడానికి కఠిన శ్రమ మాత్రమే మార్గమని ప్రతి ఒక్కరూ అంగీకరించే చిట్టచివరి అంశాల్లో క్రీడలు ఒకటి. సమాజంలో అథ్లెట్లు అతి ముఖ్య భాగం అనడానికి ఉన్న ఎన్నో కారణాల్లో ఇదీ ఒకటి.

– మైక్ స్పీజర్, వెంచర్ క్యాపిటలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గోరుముద్దలు తినిపించవా!

బారెడు పొద్దెక్కింది / లే, ముఖం కడుక్కో, పాలుత్రాగు
నీళ్ళోసుకుని చదువుకో / మంగళ గీతికలా వినబడేది
పొద్దున్నే అమ్మగొంతు!
ఇప్పుడు పొద్దు పొడుస్తుందంటేనే భయం
వార్డెన్ తిట్లే తిట్లని / వీపు ఛెళ్ళుమనే శబ్దాలకి
సుప్రభాతాలు దుర్భర ప్రభాతాలౌతున్నాయి
చలికి కాదు, దెబ్బలకి వణుకుతూ / పరుగులు పెడితే, అక్కడంతా
పాచిముఖాల జాతర / చాలీచాలని నీళ్ళతో బాత్రూమ్‌ల యాతన
తరగతి గదిలో తీరు ఇంకో రకం
అర్థంకాని పాఠాలతో తలనెప్పి ఒక ప్రక్క
ఏ పెచ్చు ఎప్పుడు ఊడి / నెత్తిన పడుతుందోనని భయం మరో ప్రక్క
అర్థం అయ్యేలా పాఠం చెప్పలేని సారు
తన చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు
బెత్తాన్ని ప్రయోగిస్తుంటాడు
అందుకే ఆదివారం కోసం / అంతగా ఎదురుచూస్తాను
అరగంటైనా చాలు / నీ ఒడిలో ఆదమరచి నిద్రపోతాను
తలకి ఇంత నూనె వ్రాసి / తల దువ్వి జడ వేసినప్పుడు
వెంట తెచ్చినవేవో / మురిపెంగా నువ్వు తినిపిస్తున్నప్పుడు
నేను కొత్తగా పుట్టినట్లుంటుందమ్మా!

అమ్మా! ఓ ఆశల విత్తనాన్ని
నువ్వు నాటింది వసతి వాసంలో కాదు
ఇనుపగోడలతో కట్టిన రాక్షస గృహంలో
నా ఆక్రోశాన్ని వెళ్ళబోసుకుంటే
నీకు గుండె కోతను మిగిల్చినదాననౌతాను
అందుకే చెప్పకోలేని / ఈ ఊసులన్నీ నీకడకొంగుకు ముడివేస్తున్నాను
ఇంటికెళ్ళి ఒక్కసారి ముడివిప్పి విను
ఈ పంజరం నుంచి నన్ను విడుదల చేసి చూడు
రివ్వున ఆకాశానికి ఎగురుతాను
మేఘాల పలకపైన నీ ఆశలను అక్షరీకరిస్తాను!
అమ్మా! నీ కలకు
నేను సాకార రూపమై నిలుస్తాను!

– మద్దాళి రఘురామ్ | 9866057777

(ఓ హాస్టల్ బాలిక ఆవేదన. 31 జూలై నాటి 'సాక్షి' సంపాదకీయం స్ఫూర్తితో)

సారాంశం

సరికొండ చలపతి

నడిసంద్రంలో 'నౌక'రీ..!

ఫ్లయింగ్ కిస్

ఇది మనం మాట్లాడుకునే అంశానికి సంబంధించింది కాదు... అయినా ఓసారి! మన సమాజంలో యాభై దాటితే వృద్ధులు, అరవై దాటాక రిటైర్ కావల్సిన వారు అని అంటారు కానీ రాజకీయాలకు మాత్రం ఇదే అనువైన వయస్సు. **యాభైకి దగ్గరవుతున్న యువనేతలు ఫ్లయింగ్ కిస్‌లు కూడా విసరొచ్చు. దానికి తగ్గ హుషారు వయస్సే అది.**

వైన్ గ్లాస్... మిడిల్ ఏజ్ బ్లూస్!

ఇది కూడా మన టాపిక్‌కు కాసింత దూరమే అయినా మిడిల్ ఏజ్ కదా సరదాగా! ఓ 80 ఏళ్ల వృద్ధుడు జనరల్ చెకప్ కోసం డాక్టర్ దగ్గరకు వెళ్లాడు. అతని ఆరోగ్యమూ, సరదా చూసి డాక్టర్ ఆశ్చర్యపోయాడు

ఆ డాక్టర్ నడివయస్సులో ఉన్నాడు. కావల్సినంత బీఎమ్ఐ, ఉన్నంతలో మాంచి బీపీతో అప్పడప్పుడే ఆరోగ్యం అలారం మోగిస్తోంది.

'మీ ఆరోగ్య రహస్యం ఏమిటి....?' – వృద్ధుడిని ఆసక్తిగా డాక్టర్ అడిగాడు.

'నేను సూర్యుడు ఉదయించక ముందే లేచి సైకిల్ తొక్కడానికి బయటకు వెళ్లి, తిరిగి వచ్చి రెండు గ్లాసుల వైన్ తాగుతాను!

బహుశా ఇదే నా 'ఆరోగ్య రహస్యం.'

'సరే, అయితే మీ నాన్నగారు చనిపోయే నాటికి ఆయన వయస్సు ఎంత?'

'నాన్న చనిపోయారని మీకు ఎవరు చెప్పారు?'

'మీకే 80 ఏళ్లు, మీ నాన్న ఇంకా బతికే ఉన్నారా ..ఇంతకీ అతని వయసు ఇప్పుడు ఎంత....?

– ఆశ్చర్యంగా, ఆసక్తిగా డాక్టర్.

'అతనికి 102 సంవత్సరాలు, ఈ ఉదయం నాతో సైకిల్ తొక్కాడు, ఆపై రెండు గ్లాసుల వైన్ తీసుకున్నాడు.'

'దీర్ఘాయువు మీ కుటుంబ జన్యువులలో ఉందని దీని అర్థం. ఇంతకీ మీ తాత చనిపోయినప్పుడు ఆయన వయస్సు ఎంత...?'

'అరే ఇప్పుడు తాతయ్యను ఎందుకు చంపుతున్నారు...?'

'మీకు 80 ఏళ్లు, మీ తాత ఇంకా బతికే ఉన్నారా! అతని వయసు ఎంత...?'... డాక్టర్ అయోమయం. 'అతని వయస్సు 123 సంవత్సరాలు.'

'అతను కూడా ఈ ఉదయం మీతో సైకిల్ తొక్కేసి వైన్ కూడా తీసుకుని ఉంటాడని అనుకుంటున్నా.....?' డాక్టర్ అన్నాడు.

లేదు, 'తాత ఈ ఉదయం వెళ్లలేకపోయాడు! ఎందుకంటే అతను ఈ రోజు పెళ్లి చేసుకుంటున్నాడు... రెండేళ్లుగా ప్రేమలో ఉన్నాడు. ఆమె గర్భవతి కూడా!'

అప్పటి నుంచి డాక్టర్ రోజూ సైకిల్ తొక్కుతూ వైన్ తాగుతున్నాడు.

నడివయస్సును జయించే తాపత్రయం.

***

నడి 'సంద్రం'

ఇది మాత్రం అచ్చంగా మన టాపిక్కే! ఈఎమ్ఐలు, బీఎమ్ఐలు పీక్స్ కొచ్చే ఏజ్ ... అదే మిడిల్ ఏజ్. మిడిల్ క్లాస్ వాళ్లకు ఓ పరీక్షా సమయం. చచ్చీ చెడీ ఏ ముప్పై ఏళ్ల బార్డర్ లోనో పెళ్లైతే.. నలభై, యాభై ఏళ్ల మధ్య వయస్సులో పిల్లల చదువులు ఖర్చు భారీగా ఉంటుంది. ఇంటి ఈఎమ్ఐల నుంచి ఇంకా విముక్తి లభించదు. కారుంటే... దాని లోన్ తీరదు. ఓ పక్క పెరిగిన బీఎమ్ఐతో ఆరోగ్యం అలారం మోగిస్తుంటుంది. ఇంకా చదువు పూర్తవ్వని కొడుకు, పెళ్లికి ఎదిగిన కూతురు... కొలువు మెడపై వేలాడుతున్న కత్తి... పింక్ స్లిప్. వెరసి నడి వయస్సు... నడిసంద్రం. దీనికి తోడు కొలువుల పరిస్థితి మారుతోంది చూడండి...



సీనియారిటీ సీన్ మిస్..

అప్పుడే కాలేజీ పూర్తి చేసి వస్తే.. ఫ్రెషర్స్ ఉద్యోగాలు దొరకడం కష్టం. కాస్త అనుభవముంటే ఫుల్లు డిమాండ్. కొంచెం ప్రాధాన్యత.. అదే ఇంకొంత కాలం గడిచి మధ్య వయసుకు వచ్చేసరికి పరిస్థితి తిరగబడుతోంది. మెల్లగా ప్రాధాన్యత తగ్గిపోతోంది. ఇంకొన్నేళ్లు గడిస్తే ఉద్యోగంలో ఉంచడమా, ఏదో కారణంతో పంపించేయడమా అన్నట్టుగా మారిపోతోంది. ఉద్యోగుల వయసుపై వివక్ష కనిపిస్తోంది.

...కొన్నాళ్లుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ట్రెండ్ ఇది. ఎప్పటికప్పుడు వస్తున్న కొత్త సాంకేతికతలను, సరికొత్త పనితీరును పాత ఉద్యోగులు సరిగా అందిపుచ్చుకోలేరనే భావనే దీనికి కారణం. ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

కంపెనీలకు రెవె'న్యూ'

పేస్కేల్ సంస్థ అధ్యయనం ప్రకారం.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో పనిచేస్తున్నవారిలో మిలీనియల్స్ (1980–96 మధ్య పుట్టినవారు) 68% నుంచి 70% వరకు ఉంటే.. జనరేషన్ జెడ్ (1996–2010 మధ్య పుట్టినవారు) 18% నుంచి 20% వరకు ఉన్నారు.

– అగ్రశ్రేణి కంపెనీలైన ఫేస్‌బుక్, లింక్‌డ్ ఇన్, స్పేస్‌ఎక్స్ సంస్థల్లో ఉద్యోగుల సగటు వయసు కేవలం 29 ఏళ్లే. ఐబీఎం, ఒరాకిల్, హెచ్‌పీ వంటి సంస్థల్లోనూ ఇది 33 ఏళ్లే. అంటే కొత్త జనరేషన్‌కు కంపెనీలు ఇస్తున్న ప్రాధాన్యం ఏమిటో అర్థమవుతుంది.

ఓల్డ్... నాట్ గోల్డ్!

ఉద్యోగులపై 'వయసు వివక్ష' మన దేశంలోనూ పెరుగుతోంది. ఏఐఎం సంస్థ అధ్యయనం ప్రకారం.. మన దేశంలోని చాలావరకు ఐటీ కంపెనీల్లో 50 ఏళ్లు పైబడిన ఉద్యోగుల సంఖ్య వేగంగా తగ్గిపోతోంది.

– ఇన్ఫోసిస్, టీసీఎస్ కంపెనీల్లో సగానికిపైగా ఉద్యోగులు 20 నుంచి 35 ఏళ్ల మధ్యవయసు వారే. మరో 40 శాతం మంది 35 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్యవారు. 50 ఏళ్లు దాటినవారి సంఖ్య 10 శాతమే.

– ఐబీఎంలో మాత్రం 20–35 ఏళ్ల మధ్యవారు 45 శాతం, 35–50 ఏళ్ల మధ్యవారు 30 శాతం ఉంటే... 50 ఏళ్లు దాటినవారు 25 శాతం ఉన్నారు.

– ఇక ముందూ ఈ కంపెనీల్లో 'యంగ్' జనరేషన్‌ను పెంచే పని జరుగుతోంది. ఒక అంచనా ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో 1.57 లక్షల మంది ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకునేందుకు కంపెనీలు ఏర్పాట్లు చేసుకున్నాయి.

33 శాతం మందికి వివక్ష

జాబ్‌బజ్ సంస్థ చేసిన సర్వే ప్రకారం... ఇండియాలో 33 శాతం మంది ఉద్యోగులు వయసుకు సంబంధించిన వివక్షను ఎదుర్కొంటున్నారు. మధ్యవయసు దాటినవారిని ఉద్యోగంలోకి తీసుకోకపోవడం, ప్రమోషన్లు, ఇతర ప్రయోజనాలు కల్పించకపోవడం, కొన్నిసార్లు రాజీనామా చేసేలా ఒత్తిడి చేయడం వంటివి జరుగుతున్నాయి. ''కొన్ని దేశాల్లో ఇలాంటి వయసు వివక్షకు వ్యతిరేకంగా కఠినచట్టాలు ఉన్నాయి. మన దేశంలోనూ అలాంటివి రావాల్సి ఉంది..'' ఓ విశ్లేషకుడి మాట.

ఇటీవల ఓ కంపెనీ అమెరికాలో పనిచేస్తున్న 80 మంది ఉద్యోగులను 'వయసు, సీనియర్లు' కారణంతో భారత్‌లోని కార్యాలయాలకు బదిలీ చేయడం 'వయసు వివక్ష' అంశంపై చర్చను రేపింది. 2018 లోనూ ఇదే కంపెనీ 40 ఏళ్లు దాటిన 20 వేల మంది ఉద్యోగులను తొలగించడం వివాదాస్పదమైంది కూడా!

– ప్రతిష్ఠాత్మక గూగుల్ సంస్థ కూడా ఇలాంటి చర్యలకు పాల్పడటంతో 227 మంది కోర్టులో కేసులు వేశారు. 2019లో వారికి సుమారు రూ. 90 కోట్లు పరిహారంగా ఇచ్చి కేసుల నుంచి బయటపడింది.

కంపెనీలు ఖర్చు తగ్గించుకునే క్రమంలో ప్రధానంగా సీనియర్లపైనే వేటు వేస్తున్నాయి. తక్కువ వయసున్న వారు చురుగ్గా, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకుని సమర్థంగా పనిచేస్తారన్న భావనే దీనికి కారణం. దీనితో పాటు సీనియర్లకు ఎక్కువ జీతాలు, అలవెన్సులు ఉండటం, పరిస్థితులకు అనుగుణంగా మారలేరనే ఆలోచన కూడా కారణం.

***

'ఓల్డ్' స్టాక్!

ఇది కూడా మన స్టోరీకీ సంబంధించింది కాదు.. అయినా చదవొచ్చు.

పూర్వకాలంలో సౌత్‌సీ దీవుల్లో వయస్సు మళ్లిన వారిని చెట్టు పైకి ఎక్కించేవారట. వారు ఎక్కినతర్వాత బలమైన యువకులు ఆ చెట్టును ఊపేవారట. ఆ ఊపునకు కింద పడిపోకుండా నిలబడగలిగితే విడిచిపెట్టే వారట. నిలబడక పోయిన వారిని చంపివేసే వారట... అంతే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: బ.త్రయోదశి ఉ.10.11 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: పునర్వసు ప.12.02 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.8.48 నుండి 10.34 వరకు, దుర్ముహూర్తం: ప.12.29 నుండి 1.21 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.53 వరకు, అమృతఘడియలు: ఉ.9.27 నుండి 10.43 వరకు, మాసశివరాత్రి: రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.45, సూర్యాస్తమయం: 6.24.

వందకు వందే భారత్!

- ఒకేసారి ఎక్కువ సంఖ్యలో ప్రారంభించాలని యోచిస్తున్న కేంద్రం
- కాచిగూడ–యశ్వంత్‌పూర్ సర్వీసుకు తాత్కాలిక బ్రేక్

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా వందేభారత్ రైళ్లను ఒకేసారి పెద్దసంఖ్యలో ప్రారంభించాలని కేంద్రం యోచిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్లు 30లోపు మాత్రమే నడుస్తున్నాయి. ఈ సంఖ్యను వీలైనంత తొందరలో వందకు చేర్చాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రస్తుతానికి నాలుగు రైళ్ల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా వాటిని వాయిదా వేశారు. ఇందులో కాచిగూడ- యశ్వంత్‌పూర్(బెంగళూరు) రైలు కూడా ఉంది. వాస్తవానికి ఈ రైలు గత నెల 31నే చెన్నై నుంచి కాచిగూడ స్టేషన్‌కు చేరుకుంది. ఆ తర్వాత మహబూబ్‌నగర్ మీదుగా దీని ట్రయల్‌రన్ కూడా పూర్తి చేశారు. దీనిని ఈనెల ఆరో తేదీన ప్రారంభిస్తున్నట్టు గుంతకల్ స్టేషన్ అధికారులు అప్పట్లోనే ప్రకటించగా, దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారులు ఖండించారు. అది పంద్రాగస్టు రోజు ప్రారంభమయ్యే సూచనలున్నాయంటూ కొందరు అధికారులు అనధికారికంగా ప్రకటించారు. దానికి బలం చేకూరుస్తూ ఈలోపే ట్రయల్‌రన్ పూర్తి చేశారు. కానీ, రైల్వేబోర్డు మాత్రం అధికారికంగా ప్రారంభతేదీని ఇప్పటివరకు ప్రకటించలేదు.



ఎన్నికల వేళ...

ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ, వందేభారత్ రైళ్లను కూడా ప్రధాన ఆకర్షణగా జనం ముందు నిలపాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే రెండేళ్లలో భారత్‌లో వంద వందేభారత్ రైళ్లను పట్టాలెక్కించాలని ముందుగా అనుకున్నా, ఇప్పుడు ఆ సంఖ్యను వీలైనంత తొందరలోనే ప్రయాణికుల సేవలోకి తీసుకురావాలని తాజాగా నిర్ణయించింది. ఇందుకోసం ప్రస్తుతం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొన్నింటిని ఆపి, మరికొన్నింటిని జతచేసి ఒకేసారి ప్రారంభించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పంద్రాగస్టు కానుకగా పట్టాలెక్కాల్సిన కాచిగూడ-యశ్వంతపూర్ వందేభారత్ కూడా తాత్కాలికంగా వాయిదా పడ్డట్టు తెలుస్తోంది.

8 కోచ్‌ల రైళ్లే ఎక్కువ..

ప్రారంభంలో వందేభారత్ రైళ్లను 16 కోచ్‌లతో పట్టాలెక్కించారు. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో మాత్రమే వందేభారత్ రైళ్లు తయారవుతున్నాయి. త్వరలో మరో మూడు కోచ్‌ఫ్యాక్టరీల్లో వాటి ఉత్పాదన ప్రారంభిస్తారు. ఇప్పుడు ఒక్కో రైలు సిద్ధం కావటానికి చాలా సమయం పడుతోంది. ప్రొడక్షన్ వేగం పుంజుకునే వరకు, ఒక రైలుకు వినియోగించే 16 కోచ్‌లను రెండు రైళ్లుగా మార్చి నడపాలని రైల్వేశాఖ భావిస్తున్నట్టు సమాచారం. తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సంఖ్యలో రైళ్లు ప్రారంభించే అవకాశం ఉంటుందనేది ఆలోచన. డిమాండ్ పెరిగే కొద్ది క్రమంగా కోచ్‌ల సంఖ్య పెంచాలని అనుకుంటున్నారు. దక్షిణమధ్య రైల్వేకు కేటాయించిన మొదటి వందేభారత్‌ను సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య 16 కోచ్‌లతో ప్రారంభించారు. సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రారంభమైన రెండో వందేభారత్‌ను మాత్రం 8 కోచ్‌లతో ప్రారంభించి, ఆ సంఖ్యను పెంచుతామని తర్వాత రైల్వే అధికారులు ప్రకటించారు. ఇప్పుడు 8 కోచ్‌ల మినీ వందేభారత్ రైళ్లు ఎక్కువ సంఖ్యలో ప్రారంభించి, ఆ తర్వాత ఉత్పత్తి పెరిగే కొద్దీ వాటికి అదనపు కోచ్‌లను జతచేస్తూ పోవాలని నిర్ణయించారు.

పొలంలో ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి



కొండమల్లేపల్లి: పొలం దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడి ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లాలో చోటు చేసుకుంది. కొండమల్లేపల్లి మండలం దోనియాల గ్రామానికి చెందిన గుండాల సత్తయ్య, కొండమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. తమకున్న పది ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు శ్రీనివాస్(29) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ పూర్తి చేసి, ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం శ్రీనివాస్ ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అది మట్టిలో దిగబడింది. ట్రాక్టర్‌ను బయటికి తీస్తుండగా ఒక్కసారిగా అది తిరగబడి శ్రీనివాస్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ భార్య శివాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో ఆర్మీ జవాన్ ఆత్మహత్య


కార్తీక్

టేకుమట్ల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ కొలుగూరి కార్తీక్ (31) శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లోని మినితాల్ జిల్లా హల్ద్వానీ ఓటివలీలోని తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కార్తీక్ పదో తరగతి వరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివాడు. 2012లో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం వచ్చింది. మేనమామ కూతురు ప్రవళికను కార్తీక్ 2020 మేలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు. నెల రోజుల క్రితమే భార్యా పిల్లలతో కలిసి ఉత్తరాఖండ్‌కు వెళ్లాడు. శనివారం రాత్రి కార్తీక్ ఆత్మహత్య చేసుకున్నాడు.

క్లుప్తంగా...

ఆగస్టు 15న బ్లాక్‌డే గా పాటించండి

చర్ల: 1947 ఆగస్టు 15న అర్ధరాత్రి దేశానికి వచ్చింది స్వాతంత్య్రం కాదని.. రాజదండమని.. ఆ రోజు బ్లాక్‌డేగా పాటించాలని కోరుతూ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ ఆదివారం ఒక లేఖ విడుదల చేశారు. యాభయ్యేళ్లలో దేశంలో నిరంతరం కొనసాగుతున్న వర్గ పోరాటాల్లో 18 వేల మందికి పైగా విప్లవకారులు ప్రాణత్యాగాలు చేశారని పేర్కొన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం కనీస ప్రజాస్వామ్యాన్నయినా అమలు చేసిందని, బీజేపీ అధికారంలోకి వచ్చాక అదీ లేదని విమర్శించారు.

విద్యుత్ షాక్‌తో రైతు కుమారుడు మృతి

- పొలానికి నీరు పెట్టడానికి వెళ్లి దుర్మరణం


కేతావత్ శ్రీకాంత్

పిట్లం (జుక్కల్): కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని సిద్దాపూర్ తండాలో విద్యుత్‌షాక్‌తో ఓ కౌలు రైతు కుమారుడు మృతి చెందాడు. తండాకు చెందిన కేతావత్ జైసింగ్ తండా సమీపంలో కొంత భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఇటీవల జైసింగ్ అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం పాఠశాలలకు సెలవు కావడంతో జైసింగ్ కుమారుడు కేతావత్ శ్రీకాంత్ (14) ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం జైసింగ్ తన కుమారుడిని పొలానికి నీరు పారపెట్టడానికి బోరు స్టార్ట్ చేసి రమ్మని చెప్పాడు. పొలానికి వెళ్లిన శ్రీకాంత్ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడే కింద పడిపోయాడు. పక్క పొలంలో పని చేస్తున్న తండావాసులు గమనించి శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ఆస్పత్రికి పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీకాంత్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి పిట్లం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పశువుల ఎముకలు తరలిస్తున్న వాహనం బోల్తా

- నూనె తయారీకి వీటి వినియోగం



ఖలీల్‌వాడి (డిచ్‌పల్లి): హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు పశువుల ఎముకలు తరలిస్తున్న బొలేరో వాహనం జాతీయరహదారి 44పై డిచ్‌పల్లి మండలంలోని ఏడవ బెటాలియన్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తా పడింది. వాహనం జాయింట్ ఊడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వాహనంలోని ఎముకలు మొత్తం రోడ్డుపై పడి తీవ్ర దుర్వాసన వ్యాపించింది. డ్రైవర్ చాంద్ ఖాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. జిల్లా కేంద్రంలో పశువుల ఎముకల నుంచి నూనె తీసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఎముకల వాహనం ప్రమాదానికి గురైన సందర్భంగా హైదరాబాద్ నుంచి నిజామాబాద్ నగరానికి పశువుల ఎముకలు తరలించి నూనె తయారు చేస్తున్నట్లు నిర్ధారణైంది. వాహనంలో ఉన్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

‘ఔట్ సోర్సింగ్’ను రద్దు చేయాలి



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు


కార్యక్రమానికి హాజరైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

- తక్షణమే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి
- పే స్కేల్, ఇతర ప్రయోజనాలు వర్తింపజేయాలి
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో నేతల విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్/లింగోజిగూడ: రాష్ట్రంలో ఎంతో మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బలి తీసుకున్న కాంట్రాక్టు ఏజెన్సీల విధానాన్ని రద్దు చేసి, తక్షణమే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు చేతివాటం ప్రదర్శిస్తూ, రాష్ట్రంలోని 2.5 లక్షల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పొట్టకొట్టుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. అరకొరగా వచ్చే జీతాలను సైతం మూడు, నాలుగు నెలలకోసారి చెల్లిస్తున్నారని, కొన్ని సార్లు ఆరేడు నెలలైనా జీతాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించలేక అనేక మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని జేఏసీ ఆందోళన వ్యక్తం చేసింది. కర్మన్‌ఘాట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు పులి లక్ష్మయ్య, కె.సంతోష్, వినోద్, అరుణ్‌కుమార్, నారాయణ, బిందు తదితరులు మాట్లాడారు. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పే-స్కేలు, ఇతర ప్రయోజనాలను వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. మూడేళ్ల సర్వీసు పూర్తి కాని ఉద్యోగులకు ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందజేసి ఆదుకోవాలని అన్నారు. అలాగే 2023 ఏప్రిల్ నుంచి కొత్త పీఆర్సీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏజెన్సీలు అన్యాయం చేస్తున్నాయి..

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలనెలా జీతాలు అందించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా, మూడు, నాలుగు నెలలకోసారి ఒకటి, రెండు నెలల జీతాలు చెల్లిస్తున్నారని, మిగిలిన జీతాలను కాంట్రాక్టు ఏజెన్సీలు స్వాహా చేస్తున్నాయని జేఏసీ నేతలు ఆరోపించారు. కొత్త ఏజెన్సీలు వచ్చి అప్పటికే ఏళ్ల తరబడిగా పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తున్నాయని, రూ.లక్షలు వసూలు చేసి కొత్త వారిని నియమించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత వాళ్లు కొనసాగాలంటే మళ్లీ కొత్త ఏజెన్సీలకు భారీ మొత్తంలో లంచాలు ఇవ్వాల్సి వస్తోందన్నారు.

వీఆర్ఏల కోసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు?

వీఆర్ఏల క్రమబద్ధీకరణలో భాగంగా వారిని పెద్ద సంఖ్యలో తమ శాఖకు కేటాయించారని, దాంతో ఇకపై మీరు విధులకు రావాల్సిన అవసరం లేదని.. నాలుగైదు జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ ఆఫీస్ సబార్డినేట్లకు స్థానిక అధికారులు తేల్చి చెప్పారని ఈ సమావేశానికి హాజరైన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లి లత..పులిలా

దొంగను ప్రతిఘటించిన మహిళ




దొంగను ప్రతిఘటిస్తున్న పిల్లి లత

వేములవాడ: ఓ మహిళ దొంగను ప్రతిఘటించడమే కాదు..అతనిపైకి ఎదురుదాడికి దిగింది. ఒంటరిగా ఉన్నా..అదరక బెదరక ఆ దొంగను పరుగులుపెట్టించింది. ఈ ఘటన వేములవాడలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు వేములవాడ భగవంతరావునగర్‌లోని పిల్లి లత ఇంటి ఆవరణలోకి ఓ వ్యక్తి చొరబడ్డాడు. అలికిడితో పెంపుడు కుక్క అరిచింది. మూత్రవిసర్జనకు అరిచిందని భావించిన లత ఇంటి తలుపుతీసి ఆ కుక్కను బయటకు తీసుకొచ్చింది. అదే సమయంలో ఏదో శబ్దం విని పక్కకు చూడగా టోపీ, మాస్క్ ధరించిన దుండగుడు ఇనుపరాడ్డుతో లతపై దాడికి దిగాడు. వెంటనే తేరుకున్న ఆమె దొంగా..దొంగా అంటూ కేకలు వేస్తూనే ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. ఆమెను వెంబడించిన దొంగ దాడి చేస్తుండగా, డోర్ కర్టెన్ సాయంతో పిల్లి లత పులిలా పది నిమిషాలు ఆ దొంగను ప్రతిఘటించింది. ఈక్రమంలో ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కొని పారిపోతుండగా, వెంబడించి ఇంటి ఆవరణలోనే పుస్తెలతాడును తిరిగి ఆమె లాక్కొంది. ఈ క్రమంలో దాదాపు ఏడు గ్రాముల బంగారు చైన్ దొంగకు చిక్కింది. లత అరుపులతో దొంగ అక్కడి నుంచి పరారయ్యాడు. కాలనీవాసులు చేరుకుని కౌన్సిలర్ ముప్పిడి సునంద, ఆమె భర్త శ్రీనివాస్‌లకు కాల్ చేశారు. విషయాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో విచారణ చేపట్టారు. సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నారు. ధైర్య సాహసాలు ప్రదర్శించిన పిల్లి లతను పోలీసులు, కాలనీవాసులు అభినందించారు. టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భర్త గల్ఫ్‌లో...భార్య కిరాణం షాపు

లత కిరాణ దుకాణం నడుపుతుండగా, ఆమె భర్త శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం గల్ఫ్‌కు వెళ్లారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు వివాహం కాగా, చిన్నకూతురు అమెరికాలో ఉన్నత చదువుల కోసం ఇంటర్వ్యూకు వెళ్లింది. లతతోపాటు ఐదేళ్ల పాప మాత్రమే ఇంట్లో ఉన్నారన్న విషయం తెలుసుకొని దొంగ చోరీకి వచ్చాడు.

భూమి ఆక్రమిస్తున్నారని..

- దంపతుల ఆత్మహత్యాయత్నం
- పురుగు మందు తాగుతూ సెల్ఫీ వీడియో
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు


రోదిస్తున్న గురు, సునీత దంపతులు

నర్మెట: తమ పట్టాభూమి ఆక్రమణకు గురవుతోందని మనస్తాపం చెందిన భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దంపతులు పురుగు మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసు కోవడం కలకలం రేపింది. జనగామ జిల్లా నర్మెట మండలం సూర్యబండతండాలో ఆదివారం ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాలో ఇరువర్గాల మధ్య కొంత కాలంగా భూ వివాదం నడుస్తోంది. 257, 258, 259, 263 సర్వే నంబర్లలో అసైన్డ్ భూమి తో పాటు పట్టాభూమి ఉంది. ఇందులో భూక్య ఈర్యా, మేగ్యా, కిష్ట, మోహిలా సోదరులకు 258 సర్వే నంబర్‌లో 12.18 గుంటల పట్టాభూమి ఉంది. వీరికి 12 మంది వారసులు ఉన్నారు. మరోవర్గంలో భూక్యా పాపా వారసులు చంద్రు, లక్ష్మా, సక్కు, రాములు, జయరాంలకు 257 సర్వేనంబర్ లో పట్టా భూమితో పాటు అసైన్డ్ భూమి ఉంది. కాగా, భూక్య జయరాం.. ఇటీవల హిటాచీతో భూమి చదును చేపట్టడంతో మరో వర్గానికి చెందిన మేగ్యా కుమారుడు భూక్య గురు, జయరాంల మధ్య తగాదా ఏర్పడింది. దీంతో వీరు పోలీసులను ఆశ్రయించగా భూమి సర్వేకు సూచించారు. ఈ నేపథ్యంలో ఈనెల 3న సర్వే నిర్వహించిన అధికారులు 257, 258 సర్వేనంబర్లకు హద్దులు గుర్తించి, 14న పత్రాలు అందిస్తామని చెప్పి వెళ్లినట్లు సమాచారం. అనంతరం ఈ భూమిని పరిశీలించిన పోలీసులు సర్వే రిపోర్టులు వచ్చేవరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని చెప్పినా, జయరాం 258 సర్వేనంబర్‌లో హిటాచీతో భూమి చదును చేయించాడు. దీంతో తమకు న్యాయం జరగదని ఆందోళనకు గురైన భూక్య గురు, సునీత దంపతులు పురుగు మందుతాగడంతో అది గమనించిన తండావాసులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు వీరికి ప్రాణాపాయం ఏమీ లేదని తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

ఈవీఎంలు తరలిస్తున్న వాహనానికి ప్రమాదం

- భారీ బందోబస్తు మధ్య మరో వాహనంలో తరలించిన అదనపు కలెక్టర్


ఈవీఎంలతో కూడిన కంటైనర్‌కు సీల్ వేస్తున్న ఎన్నికల కమిషన్ అధికారులు

కొణిజర్ల: హైదరాబాద్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు ఈవీఎంలను తరలిస్తున్న కంటైనర్ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ వాహనాన్ని ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీ కొట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ భారీ భద్రత నడుమ మరో వాహనంలో ఈవీఎలను తరలించారు.

వివాదం రేపిన యువకుడి ఆత్మహత్యాయత్నం!

- సర్పంచ్ కొట్టడం వల్లేనని యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు
- తండ్రి కొట్టడం వల్లేనని ఆత్మహత్యాయత్నం చేసినట్లు విచారణలో తేలిన వైనం
- వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు
- ఇటీవలే ఆత్మహత్యకు పాల్పడిన యువకుడి తమ్ముడు
- తమ్ముడి భార్యకు డబ్బు చెల్లించే విషయమై నడుస్తున్న పంచాయితీ


వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేశ్

గీసుకొండ (వరంగల్ జిల్లా): వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఎలుకుర్తిహవేలి గ్రామంలో మర్రి సురేశ్ అనే యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన వివాదం రేపింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు...గ్రామానికి చెందిన మర్రి దూడయ్యకు సురేశ్, కాజీ ఇద్దరు కుమారులు. అయితే ఇటీవల చిన్న కుమారుడు కాజీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే అతడి భార్యకు డబ్బులు చెల్లించే విషయమై గ్రామంలోని పెద్దమనుషులు పంచాయితీ చేసి, సుమారు రూ.6 లక్షలు ఆమెకు చెల్లించాలని తీర్మానించారు. పలు దఫాలుగా డబ్బు చెల్లించగా ఇంకా రూ.లక్ష చెల్లించాల్సి ఉండగా ఆ మొత్తం చెల్లించేందుకు కొంతసమయం ఇవ్వాలని దూడయ్య పెద్దమనుషులకు విన్నవించగా అందుకు వారు ఒప్పుకోలేదు. ఈ నెల 11న తీర్మానం ప్రతిని సర్పంచ్ జయపాల్‌రెడ్డి మృతుడి భార్య తరఫు పెద్దమనుషులకు ఇచ్చి మీరే తేల్చుకోండని చెప్పారు. అయితే డబ్బు చెల్లించేందుకు గడువిచ్చేదిలేదని చెప్పగా దూడయ్య, సురేశ్‌లిద్దరూ ఇంటికి తిరిగివచ్చేశారు. మరోసారి అడిగిచూద్దామని సురేశ్ సర్పంచ్ జయపాల్‌రెడ్డి వద్దకు వెళ్లగా..వారిద్దరి మధ్యా వాగ్వాదం జరిగింది. దీంతో సర్పంచ్ అతడిని కొట్టగా అవమానంగా భావించి అదేరోజు సాయంత్రం సురేశ్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా..అక్కడ చికిత్స పొందుతున్నాడు.

తండ్రి కొట్టడం వల్లేనని ప్రాథమిక విచారణలో తేలిన వైనం

సర్పంచ్ కొట్టడం వల్లే తన కుమారుడు ఆత్మహత్యకు యత్నించినట్లు శనివారం తండ్రి దూడయ్య గీసుకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా...ఆదివారం ఎస్సై గ్రామానికి వెళ్లి విచారణ జరపగా...సురేశ్‌ను సర్పంచ్ కొట్టలేదని, తండ్రి కొట్టడం వల్లే యువకుడు ఆత్మహత్యకు యత్నించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఎస్సై వివరించారు.

కొరుకుతూ.. రక్కుతూ

- విద్యార్థిని గాయపరిచిన మరో విద్యార్థి
- గురుకుల పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన


గాయపడ్డ విద్యార్థి

శాయంపేట: ఒక విద్యార్థి మరో విద్యార్థిని కొరికి, రక్కి తీవ్రంగా గాయపరిచాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా శాయంపేటలోని మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం విజిటింగ్ ఉండడంతో కుమారుడిని చూసేందుకు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. అయితే కొడుకు ఒంటినిండా గాట్లు, గాయాలు ఉండడంతో ప్రశ్నించగా విషయం బయటకు పొక్కింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నిజాంపల్లికి చెందిన ఓ విద్యార్థి ఈ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. అలర్జీ రాగా, ఇంటికి తీసుకెళ్లి, చికిత్స అనంతరం గత సోమవారం పాఠశాలకు పంపించారు. రెండో ఆదివారం కొడుకు ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకునేందుకు తల్లిదండ్రులు వచ్చారు. మొహంపై గాట్లు, కొరికిన గుర్తులు ఉండడంతో ఉపాధ్యాయుల వద్దకు తీసుకెళ్లి ప్రశ్నించారు. ‘స్కూల్‌లో రోజూ రాత్రి నిద్రపోయే ప్లేస్‌లో పడుకోగా, తోటి విద్యార్థి ఒకరు వచ్చి నీ వల్ల మరో ఇద్దరికి అలర్జీ వచ్చింది. ఇక్కడ పడుకుంటున్నావా.. అంటూనే నా వాచ్ ఎందుకు పాడు చేశావని ప్రశ్నిస్తూ మంగళవారం రాత్రి తనపై దాడి చేసి గాయపరిచాడని’బాధిత విద్యార్థి చెప్పాడు. దీంతో ఆగ్రహం చెందిన తల్లిదండ్రులు ప్రిన్సిపల్ రాజ్‌కుమార్‌ను నిలదీశారు. అక్కడే ఉన్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అసహజ పద్ధతిలో అసభ్యంగా వ్యవహరించి, దాడి చేసి ఉంటారని వారు అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. వారిని తన చాంబర్‌లోకి పిలిపించి ప్రిన్సిపల్ మాట్లాడారు. దాడి కారణమైన విద్యార్థికి టీసీ ఇచ్చి పంపిస్తామని హామీ ఇచ్చారు. గాయపడిన విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి పంపించారు.

నిధులున్నాయ్.. ఎంపిక జాబితాలే ఆలస్యం!

- బీసీ కులవృత్తిదారుల ఆర్థికసాయం పంపిణీలో జాప్యం
- పథకంకోసం రూ.360 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- చాలాచోట్ల లబ్ధిదారుల ఎంపిక ఖరారు కాక నిలిచిన పంపిణీ
- గత నెలలో అత్యంత పరిమిత సంఖ్యలో సాయం అందించిన వైనం
- పంద్రాగస్టున రెండో విడత పంపిణీకి యంత్రాంగం కసరత్తు



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల్లోని కులవృత్తిదారులకు ఆర్థిక సాయం పంపిణీ పథకంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా రెండు నెలల క్రితం తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ దరఖాస్తులు స్వీకరించింది. ఈ క్రమంలో 5.5 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి అర్హులకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను అందించేలా నిర్ణయించింది. ఈ పథకంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద రూ.360 కోట్లు సైతం విడుదల చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ పథకం కింద ఇప్పటివరకు అత్యంత పరిమిత సంఖ్యలోనే ఆర్థిక సాయం పంపిణీ జరిగింది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన.. లబ్ధిదారుల ఖరారు లో జరుగుతున్న జాప్యంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిరంతరం కొనసాగిస్తామంటూ..

బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం పంపిణీ పథకం నిరంతరం కొనసాగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పలు సందర్భాల్లో వెల్లడించారు. క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత వారికి సాయం అందిస్తామన్నారు. ప్రతి నెలా 5వ తేదీ వరకు లబ్ధిదారుల జాబితా రూపొందిస్తే, అనంతరం 15వ తేదీన నియోజకవర్గ స్థాయిలో లబ్ధిదారులకు నేరుగా ఆర్థికసాయాన్ని అందించేలా బీసీ కార్పొరేషన్ ప్రణాళికను తయారు చేసింది. ఇందులో భాగంగా గత నెల 15వ తేదీన పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. కానీ లబ్ధిదారుల జాబితాల రూపకల్పనలో జాప్యం కావడంతో అత్యంత పరిమితంగా చెక్కుల పంపిణీ జరుగుతోంది. దీనిపై బీసీ సంక్షేమ శాఖ కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఆగస్టు 15వ తేదీన పెద్ద సంఖ్యలో లబ్ధిదారులకు సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

తుది జాబితాలే ఆలస్యం..

లబ్ధిదారుల ఎంపిక విషయంలో స్థానిక శాసన సభ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనలో మాత్రం అధికారులే పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత లబ్ధిదారుల ప్రాథమిక జాబితా రూపొందించగా.. వాటిలో ఎమ్మెల్యేలు సూచించిన పేర్లకు ప్రాధాన్యం ఇస్తూ జాబితాలో ముందు వరుసలో చోటు కల్పిస్తున్నారు. ఈ క్రమంలో జాబితాల రూపకల్పనలో ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు పరిశీలన పూర్తి చేసిన తర్వాత తుది జాబితా ఖరారులో జాప్యం జరుగుతుండడంతో పంపిణీ ప్రక్రియ పెండింగ్‌లో పడుతున్నట్లు అధికారవర్గాల సమాచారం. కాగా, ఈ ఆగస్టు 15వ తేదీన రెండో విడతలో పెద్ద ఎత్తున చెక్కులు పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా...



శ్రీదేవి 60వ జయంతి గూగుల్ డూడుల్

ముంబై: ప్రముఖ నటి శ్రీదేవి 60వ జయంతిని పురస్కరించుకుని సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ ఆదివారం తన హోం పేజీలో ప్రత్యేక డూడుల్‌ను పెట్టింది. 1963లో తమిళనాడులో జన్మించిన శ్రీదేవి..నాలుగేళ్ల వయస్సులోనే కంధన్ కరుణై అనే తమిళ సినిమాలో కనిపించారు. 'భారతీయ నటి శ్రీదేవి 60వ జన్మదినాన్ని పురస్కరించుకుని ముంబైకి చెందిన గెస్ట్ ఆర్టిస్ట్ భూమికా ముఖర్జీ ఆమె డూడుల్‌కు రూపకల్పన చేశారు. శ్రీదేవి తన నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 300కుపైగా చిత్రాల్లో నటించారు. పురుషాధిక్య బాలీవుడ్ సినిమా పరిశ్రమలో పలు చిత్రాల్లో ప్రధాన పాత్రధారిగా ఆమె మెప్పించారు' అని డూడుల్‌కిచ్చిన వివరణలో గూగుల్ పేర్కొంది.


సైరన్లు, హారన్ల స్థానంలో మధుర సంగీతం!

పుణే: దేశంలో వీఐపీ సంస్కృతికి చెక్ పెట్టే దిశగా కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. వీఐపీల వాహనాల్లో సైరన్లు, హారన్లతో రోడ్లపై విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడుతోందని, అందుకే వాటి స్థానంలో మృదు మధురమైన సంగీతాన్ని ప్రవేశపెట్టాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. భారతీయ సంగీత వాయిద్య పరికరాల నుంచి సృష్టించిన సంగీతం మరింత బావుంటుందన్నారు. సైరన్లు, హారన్లకు బదులు వేణువు, తబల, శంఖం వంటి వాయిద్యాల మ్యూజిక్‌ను ప్రవేశపెట్టే ఆలోచన ఉందని వివరించారు. వీఐపీల వాహనాలపై ఎర్రబుగ్గలను తొలగించామని గుర్తుచేశారు.

మణిపూర్‌లో హింసను వెంటనే ఆపండి: రాహుల్

కోజికోడ్: మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతుండడం పట్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హింసను అరికట్టానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మణిపూర్‌లో హింసకు విభజన రాజకీయాలు, విద్వేషం, ఆక్రోశమే ప్రత్యక్ష కారణాలని పేర్కొన్నారు. దేశంలోని ప్రజలందరినీ ఒక కుటుంబంగా భావించాలని ప్రభుత్వానికి సూచించారు. రాహుల్ గాంధీ ఆదివారం కేరళలోని కొండెంచెరీలో కమ్యూనిటీ డిజబిలిటీ మేనేజ్‌మెంట్ సెంటర్(సీడీఎంసీ) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.

యాంటీబయోటిక్స్ కూడా పనిచేయవా?



గుండెల నిండా హాయిగా గాలి పీల్చుకోవాలంటే భయం. మాస్కు లేకుండా ఇల్లు కదలాలంటే భయం. భయం శరీరాన్ని, మెదడుని ఆక్రమించిన కలుషిత గాలి ఇప్పుడు వ్యాధుల నుంచి బయటపడేసే సంజీవిని లాంటి యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్‌పై ప్రభావం చూపిస్తోంది. వాయు కాలుష్యంతో యాంటీబయోటిక్స్ పని చేయడం లేదని, ప్రపంచవ్యాప్తంగా ఈ కేసుల సంఖ్య పెరిగిపోతోందని తాజా అధ్యయనం హెచ్చరించింది.

వాయు కాలుష్యంతో మరో ముప్పు
లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీకి చెందిన సమత వయసు 40 సంవత్సరాలు. ఒకరోజు హఠాత్తుగా శ్వాస తీసుకోవడం కష్టమైంది. ఆస్తమా అటాక్ అయింది. ఇంట్లో ఎవరికీ లేని ఆస్తమా ఎందుకొచ్చిందా అని ఆందోళనతో ఉంటే మందులు పని చెయ్యకపోవడంతో కుటుంబ సభ్యులు బెంబేలెత్తిపోయారు. చివరికి ఆస్పత్రిలో చేరితే వైద్యులు అతి కష్టమ్మీద ఆమె ప్రాణాలు కాపాడగలిగారు. దీనికంతటికీ కారణం వాయు కాలుష్యం. వాహనాలు, పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం గాల్లో కలిసిపోయి మనుషుల ఊపిరితిత్తులు, గుండె, మెదడుకి పాకుతోంది. వాయు కాలుష్యంతో శ్వాసకోశ సమస్యలు, గుండె వ్యాధులు, కేన్సర్, చివరికి ఆయుఃప్రమాణాలు క్షీణిస్తాయనే మనకి తెలుసు. ఇలాంటి ప్రాణాంతక వ్యాధులకు సంజీవనిలా ఉపయోగపడే యాంటీబయోటిక్స్ పని చేయకుండా వాయుకాలుష్యం చేస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇది పెరిగిపోతే భవిష్యత్‌లో మనుషుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయన్న ఆందోళనలున్నాయి. కలుషిత గాలితో వచ్చే అనర్థాల్లో తాజాగా యాంటీబయోటిక్ నిరోధకత పెరిగిపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తోందని లాన్సెట్ హెల్త్ జర్నల్ అధ్యయనాన్ని ప్రచురించింది. చైనా, యూకేకు చెందిన శాస్త్రవేత్తలు వాయు కాలుష్యం ప్రభావాలపై వివిధ సంస్థలు సేకరించిన గణాంకాల ఆధారంగా యాంటీబయోటిక్స్ పనిచేయకపోవడం అతి పెద్ద పెనుముప్పుగా మారనుందని హెచ్చరించారు. 2000 నుంచి 2018 మధ్య కాలంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూరోపియన్ ఎన్విరాన్‌మెంట్ ఏజెన్సీ, వరల్డ్ బ్యాంక్ సహా 116 దేశాల డేటాను సేకరించి అధ్యయనం చేశారు.

గాల్లోని సూక్ష్మాతి సూక్ష్మ ధూళి కణాలు పీఎం 2.5 వల్ల యాంటీబయోటిక్ రెసిస్టెన్స్ పెరిగిపోతోంది. గాలిలో కాలుష్యం 10శాతం పెరిగితే యాంటీబయోటిక్‌ను నిరోధించే సామర్థ్యం 1.1% పెరుగుతోంది

ప్రపంచవ్యాప్తంగా 703 కోట్ల మంది ప్రజలు పీఎం 2.5 దుష్ప్రభావాలను ఎదుర్కొంటున్నారు.

గాల్లో పీఎం 2.5 ధూళి కణాలు మనుషుల వెంట్రుక కంటే 30 రెట్లు చిన్న కణాలతో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా యాంటీబయోటిక్ నిరోధకతను ఇవి ఎంత ప్రభావితం చూపిస్తున్నాయన్నది అర్థం చేసుకోవడం దుర్లభంగా మారింది.

యాంటీబయోటిక్స్ పనిచెయ్యకపోవడానికి ప్రధాన కారణం వాటిని మితి మీరి వాడడం అయినప్పటికీ వాయు కాలుష్యమూ మనుషుల శరీరంలో యాంటీబయోటిక్ నిరోధక బ్యాక్టీరియాను పెంచుతోంది.

ఆస్పత్రులు, వ్యవసాయ క్షేత్రాలు, వ్యర్థాల శుద్ధి ప్లాంట్లు వంటి వాటి నుంచి యాంటీబయోటిక్‌లు పని చెయ్యకుండా చేసే కలుషిత గాలి ఎక్కువగా వెలువడుతున్నట్టు అధ్యయనం వివరించింది.

ప్రాణం పోసే యాంటీబయోటిక్ ప్రాణమెలా తీస్తుంది?


యాంటీబయోటిక్స్‌ని మితి మీరి వాడకం వల్ల శరీరంలో సహజసిద్ధమైన రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటోంది. దీనివల్ల సూపర్ బగ్స్ ఏర్పడి మంచి బ్యాక్టీరియాను తినేస్తున్నాయి. ఫలితంగా వ్యాధులు సోకినప్పుడు మందులు వేసుకున్నా పని చేయకుండా పోతున్నాయి. యాంటీబయోటిక్స్ పని చెయ్యకపోవడం వల్ల ప్రస్తుతం ఏడాదికి లక్ష మంది మరణిస్తున్నారు. 2050 నాటికి ఈ కారణంతో ప్రపంచ దేశాల్లో అత్యధికమరణాలు సంభవించే ముప్పు ఉంది.

విమానంలో భయానక అనుభవం..

3 నిమిషాల్లో 15 వేల అడుగుల దిగువకు

వాషింగ్టన్: సాంకేతిక లోపం కారణంగా విమానంలో ఒక్కసారిగా తక్కువ ఎత్తుకు దిగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పీడన సమస్యను అధిగమించేందుకు విమానాన్ని మూడు నిమిషాల్లోనే 15 వేల అడుగుల మేర దించాల్సి వచ్చినట్లు పీడ్మాంట్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఫాక్స్ న్యూస్‌కు తెలిపింది. నార్త్ కరోలినాలోని చార్లొట్టి నుంచి ఫ్లోరిడాలోని గైన్స్‌విల్లెకు వెళ్తున్న పీడ్మాంట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానంలో ఈ నెల 10వ తేదీన ఈ ఘటన చోటుచేసుకుంది. చివరికి గమ్యస్థానానికి చేరుకుని సురక్షితంగా ల్యాండయింది. 'టేకాఫ్ తీసుకున్న 43 నిమిషాల తర్వాత 29 వేల అడుగుల ఎత్తులో ఉండగా విమానంలో సమస్య మొదలైంది. క్యాబిన్‌లో పీడనం అకస్మాత్తుగా తగ్గిపోవడంతో ప్రయాణికులు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఆరు నిమిషాల వ్యవధిలోనే మొత్తం 18,600 అడుగులు కిందికి దిగింది' అని ఫ్లైట్‌అవేర్ డేటా విడుదల చేసింది. ఘటనపై హారిసన్ హోవ్ అనే ప్రయాణికుడు సోషల్ మీడియా ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. 'కాలుతున్న వాసన, పెద్ద శబ్దం, చెవుల్లో హోరు'తో గగుర్పాటు కలిగించిందని పేర్కొన్నారు. కేబిన్‌లో కాలుతున్న వాసన, పెద్ద శబ్దాలు రావడంతో ప్రయాణికులు హాహాకారాలు చేశారు. ఊపిరాడక కొందరు ప్రయాణికులు ఆక్సిజన్ మాస్కులతో గాలి పీల్చుకుంటున్న ఫొటోను హారిసన్ షేర్ చేశారు.

నిజాయితీకి నిలువుటద్దం కలాం


కలాం ఇచ్చిన చెక్కు

న్యూఢిల్లీ: 'ఇతరులు ఇచ్చే కానుకలు, బహుమానాల వెనుక స్వార్థపూరిత కారణం ఉండొచ్చు. మన నుంచి ఏదో ఒకటి ఆశించి ఇలాంటివి ఇస్తుంటారు. అది స్వీకరించే ముందు ఈ విషయం ఆలోచించాలి'.. ప్రఖ్యాత సైంటిస్ట్, భారతరత్న, దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బాల్యంలోనే తన తండ్రి వద్ద నేర్చుకున్న పాఠమిది. ఈ పాఠాన్ని జీవితాంతం ఆయన ఆచరించారు. విలువలకు, నిజాయతీకి మారుపేరైన అబ్దుల్ కలాం ఇతరుల నుంచి ఏనాడూ కానుకలు ఆశించలేదు. ఎవరైనా ఇలాంటివి ఇస్తే దాని ధర ఎంతో తెలుసుకొని చెక్కు లేదా డబ్బులు పంపించేవారు. మిస్సైల్ మ్యాన్ కలాం గొప్పతనాన్ని తెలియజేసే మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. కలాంకు సంబంధించిన ఈ ఉదంతాన్ని ఐఏఎస్ అధికారి ఎం.వి.రావు తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. 2014లో కలాం ఓ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'సౌభాగ్య వెట్ గ్రైండర్' అనే సంస్థ ఆయనకు ఒక గ్రైండర్‌ను బహూకరించింది. దాన్ని స్వీకరించడానికి ఆయన తొలుత అంగీకరించలేదు. చివరకు బలవంతం మీద స్వీకరించారు. ఆ మరుసటి రోజే దాని ధర తెలుసుకొనేందుకు తన సహాయకుడిని మార్కెట్‌కు పంపించారు. తర్వాత తన వ్యక్తిగత బ్యాంకు ఖాతా నుంచి చెక్కును సౌభాగ్య సంస్థకు పంపారు. చెక్కును ఆ సంస్థ నగదుగా మార్చుకోకపోవచ్చన్న అనుమానం ఆయనకు వచ్చింది. తన బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయ్యిందో లేదో కనుక్కున్నారు. కాలేదని తెలిసింది. గడువులోగా నగదుగా మార్చుకోకపోతే గ్రైండర్‌ను వెనక్కి ఇచ్చేస్తానని సౌభాగ్య సంస్థకు కలాం సమాచారం పంపారు. ఇక చేసేది లేక ఆ సంస్థ ఆ చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేసి, డబ్బులు తీసుకుంది. అబ్దుల్ కలాం ఇచ్చిన చెక్కును జిరాక్స్ తీసి, ఫ్రేమ్ కట్టించి భద్రంగా దాచుకుంది. ఎం.వి.రావు షేర్ చేసిన పోస్టుపై నెటిజన్లు సోషల్ మీడియాలో అభినందనల వర్షం కురిపిస్తున్నారు. కలాం వ్యక్తిత్వాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

హెరాన్ మార్క్-2 డ్రోన్లు మోహరింపు

చైనా, పాక్ సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టం



న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్టం చేయడానికి భారత వాయుసేన పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసిన అత్యంత శక్తిమంతమైన హెరాన్ మార్క్-2 సాయుధ డ్రోన్లు నాలుగింటిని ఉత్తర సెక్టార్ సరిహద్దు స్థావరాల్లో మోహరించింది. హెరన్ మార్క్-2 డ్రోన్లు సుదూర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం కలిగిన క్షిపణులు, ఇతర ఆయుధ సంపత్తిని మోసుకుపోగలవని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ డ్రోన్ల మోహరింపుతో సరిహద్దుల్లో నిఘా వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. 'హెరాన్ మార్క్ 2 డ్రోన్లు అత్యంత శక్తిమంతమైనవి. గంటల తరబడి గాల్లో ఎగిరే సామర్థ్యం, సుదూర ప్రాంతాల్లో ఏం జరుగుతోందో పసిగట్టే టెక్నాలజీ ఉండడం వల్ల పాక్, చైనా సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టం కానుంది' అని డ్రోన్ స్క్వాడ్రన్ వింగ్ కమాండర్ పంకజ్ రాణా చెప్పారు.

ప్రత్యేకతలు ఇవీ

- ప్రతికూల వాతావరణ పరిస్థితులున్నప్పటికీ హెరెన్ మార్క్-2 డ్రోన్లు ఏకబిగిన 36 గంటలు ప్రయాణం చేయగలవు. అంటే ఈ డ్రోన్లు ఒకేసారి పాకిస్తాన్, చైనాలను కూడా చుట్టేసి రాగలవు.
- డ్రోన్లలో ఉండే లేజర్ సుదూర ప్రాంతంలో ఉండే శత్రు దేశాల లక్ష్యాలను గుర్తించగలవు. దీంతో మన క్షిపణులు వాటిని ధ్వంసం చేసే అవకాశం ఉంటుంది.
- ఎంత దూరంలోనున్న లక్ష్యాలనైనా గుర్తించడం, సుదీర్ఘంగా గాల్లో ఎగిరే సామర్థ్యం ఉండడం వల్ల ఇవి ఎక్కడికైనా వెళ్లి ఆ ప్రాంతమంతా జల్లెడ పట్టగలవు.
- ఈ డ్రోన్లు ఉపగ్రహంతో అనుసంధానం అయి ఉండడం వల్ల ఎక్కడ నుంచైనా వీటిని ఆపరేట్ చేసే సదుపాయం ఉంది.
- మైనస్ డిగ్రీల వాతావరణ స్థితుల్లోనూ ఈ డ్రోన్లు పేలోడ్ మోసుకుపోగలవు. మైదానాలు, పర్వత ప్రాంతాలు ఇలా ఏ భూభాగంలోనైనా సమర్థంగా పని చేయగలవు.


ఆదివారం అహ్మదాబాద్‌లో తిరంగా యాత్రలో పాల్గొన్న స్థానికులు

సామాన్యులే అతిథులు

1,800 మందికి ఆహ్వానం

- రైతులు, కార్మికులు, టీచర్లు, నర్సులు, సర్పంచ్‌లే అతిథులు
- స్వాతంత్య్ర దిన వేడుకలకు భారీగా ఏర్పాట్లు
- ఇంటింటా జెండా ఎగరాలి
- సామాజిక మాధ్యమాల్లో డీపీ మార్చండి
- ప్రధానమంత్రి మోదీ పిలుపు

న్యూఢిల్లీ: భారత 77వ స్వాతంత్య్ర దిన వేడుకలకు కేంద్ర ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. పంద్రాగస్టున ఢిల్లీలోని ఎర్రకోటలో అంబరాన్నంటే సంబరాల్లో సామాన్యుడికి పెద్దపీట వేసింది. దేశానికి వెన్నుముకలాంటి రైతులు, చెమటోడ్చి పని చేసే కార్మికులు, జీవనోపాధి కోసం ప్రాణాలనే పణంగా పెట్టే జాలర్లు, సేవాగుణం కలిగిన నర్సులు, గ్రామాల సర్పంచ్‌లను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించింది. ఢిల్లీలో ఎర్రకోటపై మంగళవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. 2047 స్వాతంత్య్ర దిన శతాబ్ది ఉత్సవాల నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్న లక్ష్యంతో ఈ ఏడాది ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగానే స్వాతంత్య్ర దిన వేడుకల్ని జరుపుతున్నారు. ఇక ఇంటింటిలోనూ త్రివర్ణ పతాకం ఎగరాలన్న ప్రచారం ఆదివారం నుంచే మొదలైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల్లో ప్రతీ ఒక్కరూ జాతీయ జెండాను డిస్‌ప్లే పిక్చర్ (డీపీ) గా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

చైతన్యవంత గ్రామాల నుంచీ..

స్వాతంత్ర దిన వేడుకలకు ప్రత్యేకంగా 1,800 మంది అతిథుల్ని ఆహ్వానించారు. దేశంలోని అత్యంత చైతన్యవంతమైన గ్రామాలుగా గుర్తింపు పొందిన 660కి పైగా గ్రామాల నుంచి 400 మందికి పైగా సర్పంచ్‌లు, 250 మంది రైతులు, పార్లమెంటు కొత్త భవనం, సరిహద్దుల్లో రోడ్ల నిర్మాణంలో భాగస్వామ్యులైన 50 మంది కార్మికులు, 50 మంది ఖాదీ పనివారుతో పాటు జాలర్లు, టీచర్లు, నర్సులు ఇలా సమాజంలో కీలకమైన వర్గాల వారందరికీ ఆహ్వానం పలికినట్టుగా కేంద్రం ఒక ప్రకటనలో వెల్లడించింది. సతీ సమేతంగా హాజరయ్యే ఈ అతిథులకి బస ఏర్పాట్లు చేస్తోంది.

సెల్ఫీ పాయింట్లు

స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా యువతీయువకులకు సెల్ఫీ పోటీలు నిర్వహిస్తోంది. ఇందు కోసం 12 ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లను వివిధ థీమ్‌లతో తీర్చిదిద్దింది. నేషనల్ వార్ మెమోరియల్, ఇండియా గేట్, విజయ్ చౌక్, రైల్వే స్టేషన్, ప్రగతి మైదాన్, రాజ్‌ఘాట్, జమా మసీదు మెట్రో స్టేషన్, రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్, ఢిల్లీ గేట్ మెట్రో స్టేషన్,, ఇలా 12 ప్రాంతాల్లో పెట్టిన సెల్ఫీ పాయింట్లలో సెల్ఫీలు తీసుకొని ఆగస్టు 15–20 మధ్య మైగవ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో సెల్ఫీ పాయింట్ నుంచి అత్యుత్తమమైన దానిని ఎంపిక చేసి 12 మంది విజేతలకు రూ.10 వేల చొప్పున బహుమానం అందిస్తారు.

డీపీలుగా జాతీయ జెండా

హర్‌ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా సోషల్ మీడియా వినియోగదారులందరూ తమ అకౌంట్లలో డీపీని జాతీయ జెండాతో మార్చాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మోదీ తన అకౌంట్లలో త్రివర్ణ పతాకాన్నే డీపీగా పెట్టుకున్నారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ఇదో ఉద్యమంగా చేయాలన్నారు. దేశానికి, ప్రజలకి మధ్య ఉండే ఉద్వేగభరితమైన సంబంధానికి ప్రతీకగా జాతీయ జెండాను డీపీగా ఉంచాలని ప్రధాని పిలుపునిచ్చారు. స్వేచ్ఛా స్వాతంత్య్రాలకు స్ఫూర్తిగా నిలిచే జాతీయ జెండాలతో ఫోటోలు దిగి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలన్నారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

ఎన్సీపీ అధినేత శరద్ పవార్ స్పష్టీకరణ



ముంబై: బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని కొందరు శ్రేయోభిలాషులు తనపై ఒత్తిడి తెస్తున్నారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ చెప్పారు. అయితే, ఆ పార్టీతో పొత్తు పెట్టుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బీజేపీతో స్నేహం చేయడం తమ పార్టీ రాజకీయ విధానంలో ఇమడదని తేల్చిచెప్పారు. పవార్ ఆదివారం షోలాపూర్ జిల్లా సాంగోలాలో మీడియాతో మాట్లాడారు. తమలో కొందరు(అజిత్ పవార్ వర్గం) భిన్నమైన వైఖరి అవలంబిస్తున్నారని ఆక్షేపించారు. తమ వైఖరిలో మార్పు వస్తుందని కొందరు ఆశిస్తున్నారని, అందుకే తమతో చర్చలు జరుపుతున్నారని వివరించారు. శనివారం ఉప ముఖ్యమంత్రి, సోదరుడి కుమారుడు అజిత్ పవార్‌తో జరిగిన భేటీపై విలేకరులు ప్రశ్నించగా.. అజిత్ తన కుటుంబ సభ్యుడని, ఆయనను కలవడంలో తప్పేముందని శరద్ పవార్ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులు కలుసుకోవాలంటే ఏదైనా కారణంగా ఉండాలా? అని ఎదురు ప్రశ్నించారు. మహారాష్ట్రలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కెనడాలో హిందూ ఆలయంపై ఖలిస్తానీ పోస్టర్లు

ఒంటారియో: కెనడాలో హిందూ దేవాలయాలయాలపై ఖలిస్తానీ అనుకూలవాదుల అనుచిత చర్యలకు అడ్డుకట్ట పడటం లేదు. శనివారం బ్రిటిష్ కొలంబియాలోని పురాతన లక్ష్మీ నారాయణ మందిరం ప్రధాన గేటుపై ఖలిస్తాన్ రిఫరెండం డిమాండ్‌తో పోస్టర్లు అంటించారు. ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ ఆర్గనైజేషన్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నజ్జర్ హత్య వెనుక భారత్ పాత్ర ఉందంటూ అందులో ఆరోపించారు. జనవరి 31న బ్రాంప్టన్‌లో ఒక మందిరం, ఒంటారియోలో ఏప్రిల్‌లో మరో మందిరాన్ని ఇలా ఖలిస్తానీ వాదులు అపవిత్రం చేశారు.

తర్వాత.. తూర్పు లద్దాఖ్‌లోకి 68వేల బలగాలు

న్యూఢిల్లీ: 2020 మే 15వ తేదీన గల్వాన్‌లో చైనా ఆర్మీతో ఘర్షణలు జరిగిన తర్వాత భారత్ తూర్పు లద్దాఖ్‌లోకి ముందు జాగ్రత్తగా 68 వేల బలగాలను తరలించింది. ఆర్మీతోపాటు 90 యుద్ధ ట్యాంకులు, 330 పోరాట వాహనాలు, రాడార్ వ్యవస్థలు, ఆర్టిలరీ గన్‌లను కూడా భారత వైమానిక దళం(ఐఏఎఫ్) విమానాలు తరలించాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. రఫేల్, మిగ్–29లతోపాటు సుఖోయ్–30 ఎంకెఐ, జగ్వార్ యుద్ధ విమానాలు ఆ ప్రాంతంపై నిరంతరాయంగా గస్తీ తిరుగుతూ శత్రు కదలికలపై కన్నేసి ఉంచాయి. ఇంకా పలు స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలను సిద్ధంగా ఉంచింది. చైనీయుల కార్యకలాపాలను పసిగట్టేందుకు పెద్ద సంఖ్యలో డ్రోన్లను కూడా మోహరించిందని ఆ వర్గాలు వివరించాయి. వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వెంబడి, పర్వతమయ ప్రాంతాల్లోకి అవసరమైన పక్షంలో బలగాలను సత్వరం మోహరించేందుకు అన్ని చర్యలూ ప్రభుత్వం తీసుకుందని వివరించాయి. సి–130జే సూపర్ హెర్క్యులస్, సి–17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానాలు మొత్తంగా 9 వేల టన్నుల బరువును సరిహద్దులకు మోసుకెళ్లి వాయుసేన వ్యూహాత్మక తరలింపు సామర్థ్యాన్ని చాటాయని ఆ వర్గాలు తెలిపాయి.

ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణ వ్యయం 14 రెట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: ఢిల్లీ–గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం అత్యంత ఖరీదైన వ్యవహారంగా కనిపిస్తోందని కాగ్(కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక వ్యాఖ్యానించింది. ఒక్కో కిలోమీటర్‌కు నిర్మాణ వ్యయం ప్రభుత్వ కేటాయింపులు రూ.18.20 కోట్లు కాగా వాస్తవ ఖర్చు రూ.250.77 కోట్లకు పెరిగిందని తెలిపింది. భారత్ మాల ప్రాజెక్టులో భాగంగా ఈ 48వ నంబర్ జాతీయ రహదారిని 14 లేన్లుగా నిర్మించేందుకు 2017లో కేంద్రం అనుమతులిచ్చింది. అయితే, 8 లేన్ల ఎలివేటెడ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్‌లో వాహనాల రాకపోకలు సులభంగా జరిగేందుకు గాను తక్కువ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ఇవ్వడమే నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమని రోడ్డు రవాణా హైవేల శాఖ చెబుతోందని వివరించింది. ఈ కారణం సహేతుకంగా లేదని కాగ్ పేర్కొంది. కేవలం ఆరు లేన్లకు మాత్రమే ప్రణాళిక రూపొందించి, నిర్మాణం పూర్తి చేశారని తెలిపింది. ఇదే కాకుండా, దేశవ్యాప్తంగా భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన హైవేల నిర్మాణంలో కేటాయింపుల కంటే 58% అధికంగా ఖర్చు చేశారని వివరించింది.

మహారాష్ట్ర ఆసుపత్రిలో ఘోరం

24 గంటల్లో 18 మంది రోగులు మృతి

థానే: మహారాష్ట్రలో థానే జిల్లాలోని కాల్వా పట్టణంలో ఘోరం జరిగింది. ఇక్కడి ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆసుపత్రిలో గత 24 గంటల వ్యవధిలో 18 మంది రోగులు మృతిచెందారు. వీరిలో 10 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు. మృతుల్లో 12 మంది 50 ఏళ్ల వయసు దాటినవారే. బాధితులు మూత్రపిండాల్లో రాళ్లు, పక్షవాతం, అల్సర్, న్యుమోనియా తదితర వ్యాధులతో బాధపడుతున్నారు. ఏ కారణంతో వారు చనిపోయారన్నది స్పష్టంగా తెలియరాలేదు. ఇలా ఉండగా, ఆసుపత్రిలో ఒక్క రోజు వ్యవధిలో 18 మంది రోగులు మృతిచెందడంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కోసం రాష్ట్ర ఆరోగ్య సేవల కమిషనర్ నేతృత్వంలో స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఆసుపత్రిలో సామర్థ్యానికి మించి రోగులు ఉన్నారని, వారికి వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని థానే మాజీ మేయర్ నరేశ్ మాస్కే చెప్పారు.

చావో రేవో తేల్చుకోవాలి

- ఆగస్టు 28న హరియాణా నూహ్‌లో బ్రజ్ మండల్ యాత్ర
- మహా పంచాయత్ ప్రకటన

గురుగ్రామ్: హరియాణా పల్వల్‌లో విశ్వ హిందూ పరిషత్ సహా పలు హిందూ సంస్థలు ఆదివారం నిర్వహించిన మహా పంచాయత్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రజ్ మండల్ జలాభిషేక యాత్రను ఆగస్టు 28న పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించారు. జులై 31న నూహ్‌లో దుండగుల దాడితో మత ఘర్షణలు చెలరేగి యాత్ర అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. యాత్ర నిర్వహించి తీరాలని, చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని మహాపంచాయత్‌లో హరియాణా గో రక్షక దళానికి చెందిన ఆచార్య ఆజాద్ శాస్త్రి అన్నారు. యాత్రలో అంతా ఆయుధాలు ధరించాలని పిలుపునిచ్చారు. మహాపంచాయత్‌లో విద్వేష ప్రసంగాలు చేయవద్దని పోలీసులు ఆంక్షలు విధించినప్పటికీ హిందూ నాయకులు పెడచెవిన పెట్టారు. కనీసం 100 రైఫిల్స్‌కు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముస్లింలతో చావో రేవో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందంటూ ఆజాద్ శాస్త్రి రెచ్చగొట్టేలా ప్రసంగించారు. మరి కొందరు వక్తలు కూడా ఇదే తరహాలో ప్రసంగించారు. మీరు ఎవరైనా వేలెత్తి చూపిస్తే మీ చెయ్యినే నరికేస్తాం అని హెచ్చరించారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న నూహ్ జిల్లానే రద్దు చేయాలని ఆ ప్రాంతంలో గోవధ ఉండకూడదని వక్తలు డిమాండ్ చేశారు. నూహ్‌లో హిందువుల యాత్రపై తీవ్ర వ్యతిరేకత నెలకొంది. దీంతో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొంటాయన్న ఆందోళనలున్నాయి.

ఆ మూడు బిల్లులపై విస్తృత చర్చ జరగాలి

కేంద్రం ప్రతిపాదించిన నేర బిల్లులపై కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: వలసపాలన నాటి నేర చట్టాల స్థానంలో కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో ప్రతిపాదించిన మూడు బిల్లులపై విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తాజా బిల్లులపై సంబంధిత వర్గాలు, నిపుణులు, ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు సంప్రదింపులు జరపాలని పిలుపునిచ్చింది. మూడు బిల్లులను హోం శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పరిశీలనకు పంపించాలని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలా ఒక ప్రకటన విడుదల చేశారు. 'ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రజలతో సంప్రదింపులు జరపకుండా, న్యాయ నిపుణులు, నేర శాస్త్ర ప్రవీణులు, తదితరులతో చర్చించకుండానే ప్రభుత్వం తన 'మంత్రాల టోపీ' నుంచి తీసిన మూడు బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. పారదర్శకత పాటించకుండా, దొంగచాటుగా యావత్తు నేర చట్టాలను మార్చేందుకు ప్రయత్నిస్తోంది' అని ఆరోపించారు. బిల్లుల్లో ప్రతిపాదించిన చాలా మార్పులపై మంత్రి అమిత్ షా లోక్‌సభను పక్కదోవ పట్టించారని ఆరోపించారు..కాగా, భారతీయ న్యాయ సంహిత బిల్లు రాజ్యాంగ విరుద్ధమని మాజీ న్యాయ శాఖ మంత్రి కపిల్ సిబల్ అభివర్ణించారు. బ్రిటిష్ జమానా చట్టాలను తీసివేస్తున్నామని చెబుతూ దేశంలో నియంతృత్వాన్ని తీసుకువచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.


కార్చిచ్చు ధాటికి లహైనాలో కాలి బూడిదైన ఓ కాలనీ

93కు చేరిన 'హవాయి' మరణాలు

లహైనా: అమెరికాలోని హవాయి రాష్ట్రంలో సంభవించిన భీకర కార్చిచ్చులో మృతుల సంఖ్య 93కు చేరుకుంది. మౌయి దీవిలో 93 మంది మృతి చెందినట్లు ఇప్పటి వరకు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మౌయిలో అన్వేషణ కొనసాగుతోందని చెప్పారు. కార్చిచ్చు ప్రభావిత ప్రాంతం 5 చదరపు మైళ్లు కాగా కేవలం 3% మేర గాలింపు పూర్తయిందన్నారు. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. పశ్చిమ మౌయిలోని నివాసాల్లో 86% అంటే 2,200భవనాలు ధ్వంసమైనట్లు తేల్చారు. నష్టం 6 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా. హవాయి కార్చిచ్చును ఈ శతాబ్దంలోనే అతిపెద్ద విపత్తుగా అమెరికా ప్రభుత్వం ప్రకటించింది.



క్రీడా ప్రాంగణాలకు కిట్లు

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఔత్సాహిక క్రీడాకారులను క్రీడల్లో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. 8లో▸



థాంక్యూ సార్..

కరీంనగర్: గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేసి అభ్యర్థుల భవిష్యత్తుకు సహకరించేలా కృషి చేసిన సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌కు జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం 32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

దిగివచ్చిన టమాట



విద్యానగర్(కరీంనగర్): మొన్నటి వరకు చుక్కల్ని చూపిస్తూ రూ.200 వరకు చేరిన టమాట ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఐదు రోజుల క్రితం రూ.150, మూడు రోజుల క్రితం 120, 100 రూపాయలకు చేరుకోగా ఆదివారం కిలో రూ.60 కావడంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హోల్‌సెల్ వ్యాపారులు 10కిలోల ట్రే రూ.400 రిటైల్ వ్యాపారులకు ఇస్తుండగా రిటైల్‌లో రూ.60 కిలో అమ్మకాలు సాగిస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో ఎప్పటిలా సాధారణ ధరలకు టమాట చేరుకుంటుందని వ్యాపారులు తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడం, టమాట సాగు పెరుగుతుండడంతో ధరలు అందుబాటులోకి వస్తున్నాయని వ్యాపారులు వివరించారు.

అమరుల ఆశయాలను నెరవేర్చాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



బైక్ ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నాయకులు

హుజూరాబాద్/జమ్మికుంట: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరుల ఆశయాలను నెరవేర్చడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం హుజూరాబాద్ చౌరస్తా నుంచి జమ్మికుంట గాంధీ చౌరస్తా వరకు బీజేపీ నాయకులతో కలిసి, బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విదేశీ పాలన కింద నలిగిన భారతీయులకు కొన్నేళ్లపాటు జరిగిన ఉద్యమాలు, అమరుల త్యాగాల ఫలితంగా స్వాతంత్య్రం వచ్చిందన్నారు. దేశ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ఈనెల 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19న తపస్ ధర్నాకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే తపస్ ధర్నాకు తరలిరావాలని సంఘం జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణారావు పిలుపునిచ్చారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే పీఆర్‌సీ వేసి, ఐఆర్ ప్రకటించాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, పే స్కేల్‌లో స్కూల్ అసిస్టెంట్లకు, ఎస్‌జీటీలకు మధ్య వేతన వ్యత్యాసాన్ని తగ్గించాలని, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, పండిట్, పీఈటీ, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 10న ధర్నాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 19న హైదరాబాద్‌లో జరిగే భారీ ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా నాయకులు కట్ట రాజేశ్వర్, రంగారావు, సత్యం, సంపత్ కుమార్, సాయన్న, మల్లికార్జున్, ప్రభాకర్, లచ్చయ్య, అరుణ్‌కుమార్, సత్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోర్డింగ్స్ గోల్‌మాల్

- సైజుల్లో తిరకాసు • పట్టని నిబంధనలు • వ్యాపారుల ఇష్టారాజ్యం

‘నగరంలోని తెలంగాణ చౌక్‌లో ఓ బహుళ అంతస్తు భవనం టెర్రస్‌పైన ఒక భారీ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. హోర్డింగ్ వ్యాపారి సదరు భవన యజమానితో ఐదు సంవత్సరాల ఒప్పందం కూడా చేసుకున్నాడు. భవన యజమానితో చేసుకున్న అగ్రిమెంట్‌లో హోర్డింగ్ సైజ్‌ను 40 + 45గా పేర్కొన్నారు. అగ్రిమెంట్‌ను సదరు వ్యాపారి నగరపాలకసంస్థలో సమర్పించాడు. కానీ భవనంపై మాత్రం 70 + 20 సైజులో భారీ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు.’





నగరంలో ఓ కూడలిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు

కరీంనగర్‌కార్పొరేషన్: కరీంనగర్ నగర పాలక సంస్థ ఆదాయ వనరుల్లో ఒకటైన హోర్డింగ్స్ ఏర్పాటులో ఇష్టారాజ్యం నెలకొంది. బల్దియాకు ఆదాయం ఎగవేసేందుకు వ్యాపారులు వివిధ ఎత్తుగడలు వేస్తుండగా, నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వాణిజ్య ప్రకటనలకు అద్దెకిచ్చేందుకు వ్యాపారులు హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంలో నగరపాలక సంస్థ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ముందుగా భవన యజమానితో ఒప్పందం, ఆ భవనం సామర్థ్యం, హోర్డింగ్ సైజ్ తదితర వివరాలను నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అందజేయాల్సి ఉంటుంది. నగరంలో ఎక్కడైనా హోర్డింగ్ ఏర్పాటు చేసుకుంటే నగరపాలక సంస్థకు సైజ్‌లవారీగా క్రమం తప్పకుండా రుసుము చెల్లించాల్సి ఉంటుంది. కానీ కొందరు వ్యాపారులు అగ్రిమెంట్‌లో తక్కువ సైజ్ చూపుతూ, ఎక్కువ సైజ్‌లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తూ బల్దియా ఆదాయానికి గండికొడుతున్నారు.

నగరంలో..

హోర్డింగ్‌లు	280
క్యాంటిలివర్లు	70
యూనిపోల్స్	2
ట్రాఫిక్ పోల్స్	40

బల్దియా ఆదాయానికి గండి

- హోర్డింగ్‌లను రోజువారీగా వాణిజ్య ప్రకటనలకు, రాజకీయ పార్టీలకు అద్దెకు ఇవ్వడం ద్వారా సదరు వ్యాపారులు ఆర్జిస్తుంటారు.
- ఇదిలాఉంటే నగరపాలక సంస్థలో గుత్తాధిపత్యం చెలాయించే కొంతమంది హోర్డింగ్ వ్యాపారులు ఇష్టారీతిన ఏర్పాటు చేస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.
- భవనాలపై భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుండగా, కాగితాల్లో మాత్రం తక్కువ చూపుతూ నగరపాలకసంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు.
- అంతేకాకుండా ఆయా భవనాల సామర్థ్యానికి మించి హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తుండడంతో భవిష్యత్‌లో ప్రమాదాలు సంభవించే అవకాశమూ లేకపోలేదు.
- 15 నుంచి 20 టన్నుల బరువైన భారీ హోర్డింగ్‌లు కూడా పాత భవనాలపై ఏర్పాటు చేస్తున్నారు.
- వర్షాకాలం సీజన్‌లో బరువైన హోర్డింగ్‌లు పడిపోయే, భవనం కూలిపోయే ప్రమాదం ఉండడంతో సమీపంలో ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు.
- ఒక భవనంపై హోర్డింగ్ ఏర్పాటుకు అనుమతినిచ్చే ముందు పరిసర భవన యజమానుల ఎన్‌ఓసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇవేమి పట్టించుకోకుండానే హోర్డింగ్‌లకు అనుమతినిస్తున్నారనే విమర్శలున్నాయి.
- నగరపాలకసంస్థ ఆదాయానికి గండి కొట్టి, నిబంధనలకు పక్కనపెట్టి సంవత్సరాలుగా నగరంలో హోర్డింగ్ వ్యాపారం జరుగుతున్న తీరు అనుమానాలకు తావిస్తోంది.
- ఇప్పటికైనా నిబంధనలను మీరి ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల వ్యవహారంపై నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అక్రమ హోర్డింగ్‌లు తొలగించాలి



నగరంలో ఏర్పాటు చేసిన అక్రమ హోర్డింగ్‌లు తొలగించాలి. ఈ హోర్డింగ్‌లు ప్రజా జీవితానికి హాని కలిగించేవే. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ సిటీ హోర్డింగ్ ఫ్రీ సిటీ కావాలి.

– గొర్రె సంపత్‌కుమార్, తెలంగాణ బహుజన సేన అధ్యక్షుడు

నేటి నుంచి గాంధీ చిత్ర ప్రదర్శన

కరీంనగర్ అర్బన్: స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా మహాత్మ గాంధీ చలనచిత్రాన్ని సినిమా థియేటర్లలో ఉచితంగా ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ డా.బి.గోపి తెలిపారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రజలు ఉచితంగా వీక్షించొచ్చని పేర్కొన్నారు. ఈ నెల 25వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, విద్యార్థులను థియేటర్‌ల వద్దకు ఉచితంగా తీసుకెళ్లి క్షేమంగా తిరిగి గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు వివరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుందని, థియేటర్‌ల నిర్వాహకులు, విద్య, రవాణా, పోలీసు, సమాచారశాఖల అధికారులు గాంధీ చలన చిత్ర ప్రదర్శనకు ఏలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయం చేసుకోవాలని సూచించారు.

‘నైట్ విజిల్’ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: దేశ స్వాతంత్య్ర ఉద్యమానికి సంబంధం లేని కేంద్ర ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ కపట దేశభక్తిని ప్రదర్శించడాన్ని నిరసిస్తూ ఈనెల 14న రాత్రి సమయంలో నిర్వహించే నైట్ విజిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మాట్లాడారు. అనేకమంది బలిదానాలు, జైలు జీవితం, నిర్బంధాలు, అరెస్టులు, ఉద్యమాలతో దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందన్నారు. స్వాతంత్య్ర ఉద్యమానికి అణువంత సంబంధంలేని బీజేపీ నేడు కేంద్రంలో పరిపాలిస్తుందని, ఉద్యమకారుల ఆశయాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. నైట్ విజిల్ కార్యక్రమంలో సీఐటీయూ శ్రేణులు, కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, మరెళ్ల శ్రీలత, జిల్లా కమిటీ సభ్యులు కదిరే రమేశ్, ముల్కల శ్రీనివాస్, గంగాధర్, నాయకులు చల్ల లక్ష్మణ్, విజయలక్ష్మి, రాజమణి, శంకర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ చట్టం తీసుకురావాలి



హాజరైన ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

గంగాధర(చొప్పదండి): విద్యా సెస్ ద్వారా జమైన నిధులను వినియోగించి ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల కోసం కేంద్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ చట్టం తీసుకురావాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. గంగాధర మండలంలోని కురిక్యాల శుభమస్తు ఫంక్షన్‌హాలులో ఆదివారం ట్రస్మా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనానికి వినోద్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాలకు సంక్షేమ చట్టాలు ఉన్నట్టుగానే



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా చట్టాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 53 శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, ట్రస్మా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంద్రాగస్టున కేబుల్ బ్రిడ్జిపై సాంస్కృతిక ప్రదర్శనలు

- ప్రతి శని, ఆదివారాల్లో వీకెండ్ మస్తీ కార్యక్రమాలు
- మంత్రి గంగుల కమలాకర్



వీకెండ్ మస్తీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు తదితరులు

కరీంనగర్‌కల్చరల్: ప్రజలకు ఆనందం, ఆహ్లాదం అందించేలా ఈనెల 15న సాయంత్రం కేబుల్ బ్రిడ్జిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. వీకెండ్ మస్తీ కార్యక్రమాల ఏర్పాట్లపై ఆదివారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జి వేదికగా పంద్రాగస్టున సాయంత్రం 6 నుంచి రాత్రి 1 గంట వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, స్ట్రీట్ ఫుడ్, క్రాకర్ షో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రివర్ ఫ్రంట్ పనులు పురోగతిలో ఉన్నాయని, రాబోయే సెప్టెంబర్ చివరినాటికి రివర్‌ఫ్రంట్‌లో గేట్లు ఏర్పాటు చేసి నీటిని నిలుపుకోవడం జరుగుతుందన్నారు. డైనమిక్ లైటింగ్ సిస్టం, ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటుతో కేబుల్ బ్రిడ్జి వద్ద ప్రజలు పెద్దసంఖ్యలో చేరుకొని బ్రిడ్జి అందాలను వీక్షిస్తున్నారన్నారని, మరింత ఆహ్లాదం పంచేలా ప్రతీ శని, ఆదివారాల్లో ‘వీకెండ్ మస్తీ’ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సందర్శకుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా భారీ వాహనాలను దారి మళ్లించడం జరుగుతుందన్నారు. అనంతరం వీకెండ్ మస్తీ పోస్టర్ ఆవిష్కరించారు. మేయర్ సునీల్‌రావు, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

కరీంనగర్: రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్ 90 సీట్లు గెలుచుకొని అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. దశాబ్దాలుగా కరీంనగర్ జిల్లాను గత ప్రభుత్వాలు విస్మరించాయని, సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో జిల్లా గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. తాజాగా పంచాయతీరాజ్ శాఖ నుంచి శుక్రవారం రూ.16.10కోట్లు మంజూరయ్యాయని వీటితో కరీంనగర్ నియోజకవర్గంలో మిగిలిన అంతర్గత రోడ్ల పూర్తవుతుందన్నారు. బీసీ బంధుపై రాజకీయం చేయడం మానుకోవాలని ప్రతిపక్షాలకు హితవు పలికారు. ప్రతి ఎన్నికల సమయంలో వక్ఫ్ బోర్డు భూముల విషయమై తనపై ఆరోపణలు చేస్తున్నారని, తాను ఎమ్మెల్యే కాకముందు 2008లోనే అన్ని రికార్డులు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకున్న తర్వాతే భూములు కొనుగోలు చేశానన్నారు. మరోసారి వక్ఫ్‌బోర్డు భూముల విషయమై విమర్శలు చేస్తే పరువునష్టం దావా వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో మేయర్ వై.సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, ఎంపీపీలు పిల్లి శ్రీలత మహేశ్, లక్ష్మయ్య, జెడ్పీటీసీలు పురమల్ల లలిత శ్రీనివాస్, పిట్టల కరుణ రవీందర్, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, బోనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ వీక్షణం

- కేంద్రాల గుర్తింపునకు జియోట్యాగింగ్
- ఏరోనెట్ సాఫ్ట్‌వేర్‌తో ఓటరు జాబితా రూపకల్పన • తొలగిన బోగస్ ఓట్లు

జిల్లా ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	పోలింగ్ కేంద్రాలు
9,96,454	4,93,728	5,02,695	31	1,338

కరీంనగర్ అర్బన్: వచ్చే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేసి ఓటరు జాబితా రూపొందిస్తుండగా పోలింగ్ స్టేషన్ల జియోట్యాగింగ్‌కు చర్యలు చేపట్టింది. 2018 శాసనసభ ఎన్నికల్లోనే సదరు ప్రక్రియ చేపట్టగా మళ్లీ పరిశీలన చేపట్టారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపునకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి ఘటనలకు తావులేకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నెట్‌వర్క్(ఏరోనెట్) విధానంలో బోగస్ ఓట్లను ఏరివేయగా నివాస ప్రాతిపదికన ఓటు హక్కు కల్పిస్తున్నారు.

నాలుగు నియోజకవర్గాల్లో..

జిల్లాలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ నియోజకవర్గాలుండగా వీటి పరిధిలో 20మండలాలున్నాయి. జిల్లాలో 1,338 పోలింగ్ కేంద్రాలుండగా పోలింగ్ జియోట్యాగింగ్ పరిధిలోకి తీసుకొస్తున్నారు. ఇప్పటికే కేంద్రాల మార్పు, పేర్ల మార్పు ప్రక్రియ పూర్తయింది. కరీంనగర్ నియోజకవర్గంలో 11 కేంద్రాలను మార్పు చేయగా, 19 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు



పోలింగ్ కేంద్రం

చేశారు. చొప్పదండి 25 పోలింగ్ కేంద్రాల మార్పు, 18 పేర్లు మార్పుచేశారు. మానకొండూర్ 6 కేంద్రాల మార్పు, ఒకటి పేరు మార్పు, హుజూరాబాద్‌లో ఒకకేంద్రాన్ని మార్పు చేయగా 6 పేర్లు మార్చారు. ఆధునిక సాంకేతికతను వాడి టీఎస్ సీవోపీ ప్రత్యేక యాప్ ద్వారా గుగూల్ మ్యాపును అనుసరించి పోలింగ్ కేంద్రం చిత్రాలు సహా ఇతర విషయాల్ని పొందుపరుస్తున్నారు.

జియోట్యాగ్‌తో ప్రయోజనం

రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు నేరుగా గూగుల్ మ్యాప్ ఆధారంగా ఆయా కేంద్రాలకు చేరుకోవచ్చు. ఎంత సమయంలో అక్కడికి చేరుకోవచ్చు. ఆయా కేంద్రాలకు మధ్య ఉన్న దూరం తదితర విషయాల్ని ఇట్టే తెలుసుకోవచ్చు. జిల్లాకేంద్రంతో పాటు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానంగా ఇవి ఉండటంతో పర్యవేక్షణ మరింతగా పెరగనుంది. ఏవైనా గొడవలు జరిగినా వెనువెంటనే అక్కడికి చేరుకునేందుకు సులువవనుంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు
కరీంనగర్	3,21,758	1,61,765	1,59,970	23
చొప్పదండి	2,27,615	1,11,605	1,16,006	4
మానకొండూరు	2,11,599	1,04,510	1,07,087	2
హుజూరాబాద్	2,35,482	1,15,848	1,19,632	2

నియోజకవర్గాల వారీగా కేంద్రాలు

కరీంనగర్	390
హుజూరాబాద్	305
చొప్పదండి	327
మానకొండూరు	316

ఏరోనెట్‌తో బోగస్‌కు చెక్

కుటుంబం మొత్తానికి ఒకేచోట ఓటుహక్కు కల్పించేందుకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నెట్వర్క్ (ఎరోనెట్) విధానాన్ని అనుసరించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రూపొందించిన ఈ విధానం ద్వారా ఒక వ్యక్తికి ఎక్కడెక్కడ ఓటుహక్కు ఉందో తేలనుంది. సదరు వివరాలు ఆధారంగా అధికారులు విచారణ చేసి ఎక్కడ నివాసం ఉంటారో అక్కడనే ఓటుహక్కు కల్పిస్తారు. ముసాయిదా ఓటరు జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా బూత్‌లెవల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ తుది దశకు చేరింది.

క్లుప్తంగా

'ఉమ్మడి' షూటింగ్ బాల్ పోటీలకు స్పందన


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన 42వ అండర్–19 ఉమ్మడి జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్పందన లభించింది. 250 మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు సంఘం కార్యదర్శి ఎండీ.ముఫాజిల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 20న జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పీడీ, పీఈటీలు ఇనాక్, శ్రీధర్, మహేశ్, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మల్లాపూర్(కోరుట్ల) : తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని ముత్యంపేటలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నిమ్మల లక్ష్మారెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధి కోసం లక్ష్మారెడ్డి గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో భార్య పద్మ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. గుర్తు తెలియని తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 8 గ్రాముల బంగారం, 10 తు లాల వెండి, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం పద్మ ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు భావించి పోలీసుల కు సమాచారం అందించింది. ఎస్సై నవీన్‌కుమా ర్, సిబ్బంది చేరుకొని క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాలక్రైం : జిల్లా కేంద్రంలోని ఉస్మాన్‌పూర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కొద్దిరోజులుగా ఉస్మాన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఇంట్లో నిల్వ ఉంచగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఇంట్లోని 12 బస్తాల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతల అరెస్టు


అరెస్టు చూపుతున్న సీఐ కరుణాకర్

వేములవాడ : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఆర్‌బీఎం బేకరి వద్ద పోలీసులు తనిఖీలు చేయగా గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్లకు చెందిన భూరాణి నరసింహ (38), వేములవాడలోని రాం మందిరం వీధికి చెందిన పర్రె శివకుమార్ (38)ను ఆదివారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వీరి నుంచి వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే 100కు సమాచారం అందించాలని సీఐ పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు కిట్లు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 1,549 మంజూరు
- త్వరలో అందించనున్న అధికారులు


కరీంనగర్ సప్తగిరికాలనీలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం


జగిత్యాల చేరిన కిట్లు

కరీంనగర్ స్పోర్ట్స్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఔత్సాహిక క్రీడాకారులను క్రీడల్లో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు శ్రీకారం చుట్టింది. గ్రామం, మున్సిపాలిటీ వార్డుల్లో ఎకరం స్థలంలో దాదాపు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేసి, వీటిని తీర్చిదిద్దారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు లాంగ్ జంప్ పిట్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్‌లను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 312 గ్రామాల్లో ఈ ప్రాంగణాలు అందుబాటులోకి వచ్చాయి.

12 రకాల సామగ్రి..

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు త్వరలో పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు కిట్లు రాగా కరీంనగర్‌కు రేపోమాపో రానున్నాయి. కిట్‌లో క్రికెట్‌కు సంబంధించి 12 రకాల సామగ్రి, వాలీబాల్ కిట్‌లో నెట్, బాల్స్, పుట్ పంప్, టేప్‌తోపాటు జిమ్‌కు సంబంధించి 30 కిలోల మూడు సెట్ల డంబెల్స్, 1, 2 కేజీల డిస్కస్‌త్రోలు, 6 టెన్నికాయిట్ రింగ్స్, 4 స్కిప్పింగ్ రోప్, 3 విజిల్స్, ఒక స్టాప్‌వాచ్, కిట్ బ్యాగ్ తోపాటు క్రీడాకారులకు 75 టీషర్టులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా	మంజూరైన కిట్లు
జగిత్యాల	553
కరీంనగర్	434
రాజన్న సిరిసిల్ల	307
పెద్దపల్లి	255

సద్వినియోగం చేసుకోవాలి



తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు అందనుండటంతో గ్రామీణ క్రీడాకారులు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసుకునే అవకాశం ఏర్పడింది. దీంతో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతారు. క్రీడా కిట్లను సద్వినియోగం చేసుకోవాలి.

– కీర్తి రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్

ఔత్సాహిక క్రీడాకారులకు వేదిక



క్రీడా ప్రాంగణాలు ఔత్సాహిక క్రీడాకారులకు ఒక వేదికలా ఉపయోగపడనున్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా క్రీడా ప్రాంగణాలకు క్రీడా కిట్లు వచ్చాయి. త్వరలో పంపిణీ చేస్తాం. క్రీడాకారులు క్రీడా ప్రాంగణాల్లో ప్రాక్టీస్ చేయాలి.

– రవి, డీవైఎస్‌వో, జగిత్యాల

బాలికకు వేధింపులు

మెట్‌పల్లి(కోరుట్ల): ఓ మైనర్ బాలికను వేధించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆరపేటకు చెందిన ఓ మైనర్ బాలిక (17)కు తమ బంధువైన ఫరీదా అనే మహిళ పని చూపిస్తానని నమ్మించి ఆదివారం ఆటోలో వెంకట్రావుపేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత ఫరీదా చౌలమద్దికి చెందిన గడ్డం హన్మాండ్లుకు ఫోన్ చేసి రప్పించి బాలికను అతనికి అప్పగించింది. హన్మాండ్లు లైంగికంగా వేధించడమే కాకుండా చంపుతానని బెదిరించి అక్కడి నుంచి పంపించేశాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. వారి ఫిర్యాదు మేరకు ఫరీదా, హన్మాండ్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని లింగాపూర్‌కు చెందిన గజ్జి మౌనిక (29) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం..మౌనిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 6న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

గద్దర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం
- జమ్మికుంటలో గద్దర్ యాది సభ


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

జమ్మికుంట: శ్రమజీవుల జీవితాన్ని ఆవిష్కరిస్తూ, దేశ ముఖచిత్రం ఎలా ఉండాలో పాట రూపంలో సామాన్యులకు వివరించిన గొప్ప వ్యక్తి గద్దర్ అని ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం కొనియాడారు. ఆదివారం రాత్రి జమ్మికుంట పట్టణంలోని స్వామి వివేకానంద జంక్షన్ వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక, ద్రవిడ సాహిత్య సాంస్కృతిక కళా మండలి ఆధ్వర్యంలో డీటీఎఫ్ నాయకుడు నరహరి అధ్యక్షతన ప్రజా యుద్ధ నౌక గద్దర్ యాది సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సమాజంలో లింగ భేదం, వివక్ష, దోపిడీ, అంటరానితనంపై జీవితకాలం పోరాటం చేసిన మహనీయుడు గద్దర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1997లోనే భువనగిరిలో మలి దశ ఉద్యమ జెండా ఎత్తుకున్నాడని తెలిపారు. జమ్మికుంటలో ఆనాటి ఆదర్శ కళాశాలతో గద్దర్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకుడు అవాల హరిబాబు, వాగ్గేయకారుడు డాక్టర్ నల్లగంటి శరత్ చమార్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, తెలంగాణ హమాలీ వర్కర్స్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాజ్యం, ద్రవిడ సాహిత్య సాంస్కృతిక కళా మండలి అధ్యక్షుడు రామంచ భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలు


విజేతలుగా నిలిచిన చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భగవతి పాఠశాలల సౌజన్యంతో ఆదివారం కరీంనగర్‌లోని భగవతి ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–7, 11 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 18 నుండి 20 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉదయం పోటీలను కరీంనగర్ ఎంఈవో మధుసూదనాచారి, భగవతి విద్యాసంస్థల అధినేత రమణారావు ప్రారంభించగా సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో చదరంగ సమాఖ్య బాధ్యులు చెరుకు ప్రద్యుమ్న కుమార్, రాజేంద్రప్రసాద్, శ్రీయ, శివయ్య, శంకర్ పాల్గొన్నారు.

జగిత్యాల ఎస్పీకి డీజీపీ అభినందన


కుమారుడి ఫొటోతో అవగాహన కల్పిస్తున్న ఓ తల్లి



ట్రాఫిక్ రూల్స్‌పై లోగో

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం.. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం... త్రిబుల్ రైడింగ్‌తో ప్రమాదాలకు గురై మృతిచెందితే ఆ కుటుంబం పడే బాధలను ప్రజలకు వివరిస్తూ ఎస్పీ భాస్కర్ 'చేజారిన కొడుకు'..అనే పాటను రాశారు. ఈ సీడీని శుక్రవారం సాయంత్రం డీజీపీ అంజన్ కుమార్ విడుదల చేయడంతోపాటు ఎస్పీ భాస్కర్‌ను ట్విట్టర్‌లో ప్రత్యేకంగా అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాల క్రైం: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని అమీనాబాద్ ప్రాంతానికి చెందిన గంగాధర్ ఇంట్లో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్ తోపాటు విలువైన సామగ్రి దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.2లక్షల విలువైన ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

గోదావరిలో రిటైర్డ్ కార్మికుడి మృతదేహం


శంకరయ్య (ఫైల్)


యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన చెల్పూరి శంకరయ్య(64) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మూడు రోజుల క్రితం గోదావరి నదిలో దూకగా ఆయన మృతదేహం లభ్యమైంది. గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. మూడు సార్లు ఆపరేషన్ చేయించుకున్నా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 10న మందుల దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, వెళ్లాడు. తర్వాత గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకొని తన చెప్పులు, టవల్ అక్కడే వదిలేసి, నదిలో దూకాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆయన ఆచూకీ లభించలేదు. చివరకు ఆదివారం జాలర్ల సాయంతో గోదావరి నదిలో వెతకగా బ్రిడ్జి కింద శంకరయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. మృతుడి కుమారుడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్సై ప్రసాద్‌రావు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు



మల్లాపూర్(కోరుట్ల) : ఈతచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేగుంటకు చెందిన మూడంపల్లి రమేశ్ (42) రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు ఈతచెట్టుకు ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు రామాగౌడ్ రమేశ్‌ను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలి


నినాదాలు చేస్తున్న మాజీ సర్పంచులు

- మాజీ సర్పంచుల సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య
- సిరిసిల్లలో ఆరు రోజులుగా రిలే దీక్షలు

సిరిసిల్ల: గ్రామాల్లో ప్రజలకు గతంలో ఐదేళ్లు సేవలందించిన మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలని మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య కోరారు. సిరిసిల్లలో ఆరు రోజులుగా నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ సర్పంచులుగా పనిచేసిన కాలంలో చేసిన అభివృద్ధి పనులకు సరిగ్గా బిల్లులు రాక అప్పులపాలయ్యామన్నారు. మాజీ సర్పంచులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. మాజీ సర్పంచులు సంపునూరి మల్లేశం గౌడ్, గుమ్మడి కాంతయ్య, దేవుని సుజాత, నర్సయ్య, రాజమల్లయ్య, బొల్లు ఎల్లయ్య, బొమ్మగారి పర్శరాములు, మారెపల్లి లచ్చిరెడ్డి, గాజె భూలక్ష్మి, కనగండ్ల శంకరయ్య పాల్గొన్నారు.

సీఎం పెద్దపల్లి నుంచి పోటీ చేయాలి


మాట్లాడుతున్న సురేందర్ సన్నీ

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ పెద్దపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని కోరుతూ ఈ నెల 26న భీమ్ గర్జన ర్యాలీ నిర్వహిస్తున్నామని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. ఆదివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో కౌన్సిలర్లు బొంకూరి భాగ్యలక్ష్మి, ఈరబోయిన శ్రీనివాస్‌లతో కలిసి, మాట్లాడారు. సహజ వనరులు, పారిశ్రామిక ప్రాంతం కలిగి ఉన్న పెద్దపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించారని అన్నారు. ర్యాలీని విజయవంతం చేసి, సీఎం కేసీఆర్ పెద్దపల్లి నుంచి పోటీ చేసేందుకు ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి జెండా కూడలిలోని కాన్షీరాం విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. సీఎం పెద్దపల్లికి ప్రాతినిధ్యం వహిస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి దుర్మరణం


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

మానకొండూర్: ఓ వ్యక్తి బావిలో పడి మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని ఎలబాకకు చెందిన కోట శ్రీనివాస్‌రెడ్డి(42) సీడ్ ఆర్గనైజర్‌గా పని చేస్తున్నాడు. మానకొండూర్ మండలానికి చెందిన ఓ రైతుకు వరి విత్తనాలు ఇచ్చాడు. ఆదివారం వరి ఎదుగుదలను పరిశీలించేందుకు కొండపల్కల శివారులోని పొలం వద్దకు వెళ్లి, పరిశీలించాడు. అనంతరం అక్కడే బావి పక్కనున్న నీటి పైపుపై కూర్చున్నాడు. ఆ పైపు విరగడంతో బావిలో పడి, మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు కున్నారు. కుటుంబసభ్యుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, ద ర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కామ్రేడ్ మహేందర్‌కు నివాళి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కార్మికుల హక్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించిన నాయకుడు కామ్రేడ్ కేఎల్ మహేందర్ 16వ వర్ధంతిని ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, బ్రాంచి కార్యదర్శి రాజారత్నం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కామ్రేడ్ మహేందర్ ఏఐటీయూసీకి, కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు. నాయకులు అన్నారావు, శ్యాంసన్, తిరుపతి, కృష్ణ, వెంకటేశ్, దుర్గయ్య, రాములు పాల్గొన్నారు.





పరమేశ్వరా.. పాహిమాం

వేములవాడ: వరుస సెలవులు రావడంతో రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి తడి బట్టలతో కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో కల్యాణాలు, సత్యనారాయణవ్రతాల మొక్కులు చెల్లించుకున్నారు. ఆరుద్ర నక్షత్రోత్సవ పూజలు, మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, సదస్యం నిర్వహించారు. రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బొడ్డ శైలజ స్వామిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవాలి


జీకే పుస్తకాలతో విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగాల సాధనకు అవసరమైన జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవాలని తాండ్ర అంజన్న చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తాండ్ర మధూకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ట్రస్టు ఆధ్వర్యంలో క్విజ్, జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతిరోజూ దినపత్రికలు, జీకే పుస్తకాలను చదవాలని సూచించారు. అంబేడ్కర్ ఆలోచన విధానమైన పే బ్యాక్ టు ద సొసైటీలో భాగంగా బహుజన సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు జీకే పుస్తకాలు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుమన్, రాజేశ్, నరేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాతలను అభినందిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌టౌన్: అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం ఎస్సారార్ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎంజీఆర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు, అనుకిరణ్, అరవింద్, వెంకటరమణ యువకులు ఆర్గాన్ డొనర్స్‌గా రిజిస్టర్ చేసుకున్నారు. రక్తదానం, ఆర్గాన్ డొనేట్‌గా రిజిస్టర్ చేసుకున్న వారికి ఎస్సారార్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ వెంకటరమణ, అఖిల్ కుమార్, ఎంజీఆర్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు వినయ్‌లు సన్మానం చేశారు. అవయవదానం, రక్తదానానికి ముందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనేయులు, ఎస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'బోగస్ కుల సర్టిఫికెట్లను గుర్తించాలి'

విద్యానగర్(కరీంనగర్): బోగస్ బీసీ కుల సర్టిఫికెట్లు పొంది లబ్ధిపొందుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని బీసీ రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన సమితి జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బోగస్ సర్టిఫికెట్లతో అనేక మంది ఉద్యోగాలు పొందుతున్నారని, మరెంతో మంది ఉద్యోగాలు చేస్తున్నారని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో యాసం శ్రీనివాస్ కర్రె శ్రీనివాస్, పెగడ రమేశ్, సుధాకర్ పోచయ్య, శ్రీనివాస్ చారి, యుగేందర్, శంకర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ ఉపకులాల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న నీర్ల ప్రభాకర్

విద్యానగర్(కరీంనగర్): గోసంగి కులంతో పాటు ఎస్సీ ఉపకులాల సమస్యలు పరిష్కరించాలని గోసంగి కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీర్ల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో గోసంగి కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమ కులాల వారికి రావడం లేదన్నారు. ప్రభుత్వం తమ కులాలను గుర్తించి సంక్షేమ ఫలాలు తమకు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ 57 ఉపకులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, నాయకులు సంజయ్, పశుపతి, సంపత్, రవీందర్, రమేశ్, వెంకటేష్, రాజయ్య, ఉపేందర్, సురేష్, చైతన్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా అజీజ్


అజీజ్ హుస్సేన్

కరీంనగర్‌టౌన్: యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన అజీజ్ హుస్సేన్‌ను నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ తెలిపారు. తన నియమాకానికి సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు అజీజ్ కృతజ్ఞతలు తెలిపారు.


సండే.. సరదాగా..

నగరపాలక సంస్థ ఆయా డివిజన్ కేంద్రాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. నగరవాసులు ఉదయం, సాయంత్రం వేళలో ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న విషయం కూడా తెలిసిందే. కాగా ఇక్కడ కనిపిస్తున్నది సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ జిమ్. ఆదివారం సెలవు కావడంతో చిన్నారులు ఇలా ఓపెన్ జిమ్‌లో సరదాగా ఆడుతూ కనిపించారు. ఓపెన్ జిమ్‌లోని పలు భాగాలు పిల్లలు ఆడుకునేలా ఉండడంతో.. వాటిని పార్క్‌లలో ఆటలు ఆడుకునే వస్తువులు అనుకొని ఎంజాయ్ చేశారు. పిల్లలకు అటు ఆటవిడుపుతో పాటు ఇటు ఎక్సర్‌సైజ్ అవుతుందంటూ పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - సప్తగిరికాలనీ(కరీంనగర్)

నీటి బిల్లుల చెల్లింపులో జాప్యం

- ఐదునెలలుగా హరితహారం బిల్లులు పెండింగ్
- ట్రాక్టర్లలో డీజిల్‌కు సర్పంచుల తిప్పలు


చామనపల్లిలో మొక్కలకు నీళ్లుపడుతున్న కూలీలు

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం పథకంలో భాగంగా మొక్కల పెంపకానికి ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. అయితే మొక్కలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా పోస్తున్న నీటి బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తోంది. ఐదు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో సర్పంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్యాంకర్లకు అవసరమైన డీజిల్‌ను సొంతంగా కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.12.60లక్షల బిల్లు పెండింగ్

కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు వాటర్ ట్యాంకర్ల బిల్లు రూ.12,60,954 చెల్లించాల్సి ఉంది. వీటిలో రూ.8,73,138 బిల్లుల వివరాలను ఆన్‌లైన్ చేసి ఎఫ్‌టీవో జనరేట్ చేయగా ఇంకా డబ్బులు జమ కాలేదు. ప్రతీ గ్రామంలో కమ్యూనిటీ, అవెన్యూ ప్లాంటేషన్ పేరిట అధికారులు మొక్కలు నాటారు. చిన్న గ్రామపంచాయతీల్లో 500 నుంచి 1000, పెద్ద గ్రామపంచాయతీల్లో 1200నుంచి 1500 మొక్కలకు ప్రతీ వారం ట్యాంకర్ల ద్వారా ఉపాధి హామీ కూలీలు నీళ్లు పడుతున్నారు. ఒక్కో మొక్కకు రూ.1.80 చొప్పున ప్రభుత్వం గ్రామపంచాయతీల ఉపాధి హామీ ఖాతాల్లో జమచేస్తోంది. కూలీలకు డబ్బులు జమవుతున్నప్పటికీ ట్యాంకర్లకు మాత్రం బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. అన్ని గ్రామాల్లో ఎంబీ రికార్డులు పూర్తయినప్పటికీ మార్చి నెల నుంచి బిల్లులు రాకపోవడంతో ట్రాక్టర్లలో డీజిల్ పోసేందుకు సర్పంచులు ఇబ్బంది పడుతున్నారు. పలువురు సర్పంచులు విధిలేని పరిస్థితుల్లో సొంత డబ్బులతో డీజిల్ కొనుగోలు చేస్తుండగా మరికొందరు పెట్రోల్‌బంకుల్లో ఉద్దెర పెడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ట్యాంకర్ల బిల్లులను అధికారులు వెంటనే చెల్లించాలని పలువురు సర్పంచులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరగా బిల్లులు చెల్లించాలి



హరితహారంలో మొక్కలకు నీళ్లు పట్టిన బిల్లులు ఐదునెలల నుంచి చెల్లించడం లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ట్రాక్టర్ డీజిల్ కొనుగోలుకు ఇబ్బందవుతోంది. త్వరగా ట్యాంకర్ల బకాయి బిల్లులను చెల్లించాలి.
- దబ్బెట రమణారెడ్డి, సర్పంచ్, చెర్లభూత్కూర్

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు



గ్రామాల్లోని హరితహారం మొక్కలకు నీళ్లు పోసిన ట్యాంకర్ల బిల్లుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. వేసవికాలంలో మార్చి నెల నుంచి నీటి బిల్లులను చెల్లించాల్సి ఉంది. త్వరలో బిల్లులు మంజూరవుతాయి.
- సీహెచ్. జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్

ఆధ్యాత్మికం – భక్తి భజన విభావరి



కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆదివారం శ్రీరామ భక్త భజన మండలి అధ్యక్షుడు దేవిశెట్టి హన్మండ్లు ఆధ్వర్యంలో సాగిన భక్తి, భజన విభావరి భక్తులను భక్తి సాగరంలో ముంచెత్తింది. ఈ భజన కార్యక్రమంలో పంజాల శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌తో పాటు అమ్మవారి భక్తులు కూడా పాల్గొని శృతి కలిపారు. - విద్యానగర్(కరీంనగర్)

కేసీఆర్ హయాంలోనే బీసీలకు ఆత్మగౌరవం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, పెరిక కుల సంఘం నాయకులు

కరీంనగర్: సీఎం కేసీఆర్ హయాంలోనే బీసీలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం నగరంలో ఆర్‌బీవీఆర్ కళాశాలలో నిర్వహించిన పెరిక కుల ఆత్మగౌరవ సభకు హాజరై మాట్లాడారు. కోకాపేటలో నిర్మించే రాష్ట్ర పెరిక కుల ఆత్మగౌరవ భవనానికి రూ.2 కోట్లకు బదులు రూ.5 కోట్లు నిధులు ఇప్పించే బాధ్యతను తానే తీసుకుంటానని అన్నారు. ఈనెల 27న జరిగే భూమిపూజలో పాల్గొంటానని తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో కలిసి భవన నిర్మాణం అయ్యే వరకు అన్ని విధాల సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎకరం రూ.100 కోట్ల విలువ చేసే కోకాపేటలో బీసీ కులానికి స్థలం కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పెరిక కుల ఆత్మ గౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గటిక విజయ్‌కుమార్ సమస్యలు వివరించి కోకాపేటలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించిన సీఎంకేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్‌లో కూడా పెరిక కులస్తులకు భవనం కోసం స్థలం కేటాయించాలని మంత్రికి విన్నవించారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ మాట్లాడుతూ పెరిక కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమిపూజకు సంఘ సభ్యులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చలో కోకాపేట పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు సత్యనారాయణ, ఆనంద్, శ్రీనివాస్, మనోహర్, విజయ్‌కుమార్, శ్రీధర్‌బాబు, ఉషన్న, రాములు, శ్రీనివాస్, హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు


గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న దివ్యాంగ పట్టభద్రుల సంఘం బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: ప్రజా గాయకుడు గద్దర్ మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని తెలంగాణ దివ్యాంగ పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం నగరంలోని తెలంగాణ చౌక్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. అణగారిన వర్గాలు, పీడిత ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చేందుకు గద్దర్ తన ఆటపాటలతో అలుపెరగని పోరాటం చేశారన్నారు. తన పోరాట ప్రస్థానంలో ఏనాడు వ్యక్తిగత ఆర్భాటాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సాధారణ జీవితాన్ని గడిపి భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ పట్టభద్రుల సంఘం బాధ్యులు నందగిరి జగదీశ్వర చారి, కీర్తికుమార్, కాసారపు పర్శరాములు, జక్కుల రాజన్న, కొట్టె తిరుపతి, బి.పోచమల్లు, జి.కుమార స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కరీంనగర్ దిశగా చర్యలు


వావిలాలపల్లిలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ఆరోగ్య కరీంనగర్ దిశగా నగరపాలక సంస్థ చర్యలు చేపడుతోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. ఆదివారం నగరంలోని 41వ డివిజన్ వావిలాలపల్లిలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ బండారి వేణుతో కలిసి ప్రారంభించారు. జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించి పరిసరాల్లో మొక్కను నాటారు. ప్రజలను ఫిట్‌నెస్‌గా, ఆరోగ్యంగా ఉంచగలిగితేనే కరీంనగర్ ఆరోగ్యవంత నగరంగా మారుతుందని అన్నారు. ప్రతి డివిజన్‌లో ఒక ఓపెన్ జిమ్ ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రూ.8 కోట్ల వ్యయంతో నగరంలో 64 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా 35 జిమ్‌లు ప్రారంభించామని, మిగితావి త్వరలో ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వాసులు మీస అర్జున్‌రావు, అరవింద్, అనంతరెడ్డి, నగరపాలకసంస్థ అధికారులు పాల్గొన్నారు.

చిత్ర కథ – ప్రమాదకరంగా గేట్‌వాల్వ్ చాంబర్



మిషన్ భగీరథ పథకం గేట్‌వాల్వ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధాన రహదారి పక్కనే ఉన్న గేట్‌వాల్వ్ చాంబర్లపై పైకప్పు వేయడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి గ్రామీణ ప్రజలకు శాపంగా మారింది. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ ప్రధాన రహదారిలోని వేణుగోపాలస్వామి ఆలయ సమీపంలో గేట్‌వాల్వ్‌కు ఐదు నెలలక్రితం చాంబర్ నిర్మించారు. అయితే చాంబర్‌పై పెట్టాల్సిన పైకప్పును పక్కనే ఉన్న సిమెంట్‌దిమ్మె మీద పెట్టారు. మూలమలుపు వద్ద పైకప్పు లేని చాంబర్ ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - కరీంనగర్‌రూరల్

'సౌభాగ్యపు సిరులు' పుస్తకం ఆవిష్కరణ


సౌభాగ్యపు సిరులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్: దూడపాక శ్రీధర్ సంపాదకత్వంలో వెలువడిన 'సౌభాగ్యపు సిరులు' కవితా సంకలనాన్ని ప్రముఖ సినీ గేయ రచయిత కవి వడ్డేపల్లి కృష్ణ ఆదివారం ఫిలింభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచ మాంగల్య విరులు సౌభాగ్యపు సిరులని, ప్రతీ హైందవ స్త్రీకి అత్యవసరమైన పంచమాంగల్యాల ప్రాశస్త్యాన్ని నేటి యువతీ యువకులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు, ధార్మిక, విజ్ఞాన వ్యాఖ్యాత కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కవిత్వాంశమేదైనా తాత్విక సామాజిక, సాంస్కృతిక అంశాలను స్పృశించాలని తెలిపారు. మరో విశిష్ట అతిథి వైరాగ్యం ప్రభాకర్ మాట్లాడుతూ వైవిధ్యమైన, విశిష్టమైన అంశాలతో సంకలనాలు వెలువరిస్తున్న దూడపాక శ్రీధర్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కవులు అసిస్టెంట్ ప్రొఫెసర్ నారోజు వెంకటరమణ, ఎం.ఎస్.బృంద, ఎస్వీఆర్ వెంకటేష్, రవిబాబు పిట్టల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు వేడుకలను పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ జాతీయ శాఖ పిలుపుమేరకు ఆదివారం కరీంనగర్‌లో బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూబల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తిరంగా ర్యాలీని ఎస్సారార్ కళాశాల మైదానంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నా మట్టి నా దేశం ప్రోగ్రాంలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతిఒక్కరూ తమ ఇంట్లో జాతీయ జెండా ఎగురవేయాలని అన్నారు. ప్రతిఒక్కరూ నా దేశం అని భావించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఆనంద్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, వాసుదేవారెడ్డి, రాజేంద్రప్రసాద్, లోకేష్, ప్రసాద్, రవి, రమణారెడ్డి, స్వామి, కళ్యాణ్‌చంద్ర, రమేష్, చైతన్య, సుధాకర్, మురళీ, రతన్ కుమార్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తపాలా ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్


క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులు

కరీంనగర్‌స్పోర్ట్స్: 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శివాజీ తపాలా ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగింది. కరీంనగర్ డివిజన్ తపాలా ఉద్యోగులు రెండు జట్లుగా బ్లూ, రెడ్‌గా మారి మ్యాచ్‌లో పాల్గొన్నారు. బ్లూ టీమ్‌పై రెడ్ టీమ్ 15 పరుగుల విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్‌కు అంపైర్‌గా కరీంనగర్ నార్త్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర మోహన్ వ్యవహరించారు.

కుండీలో పూసిన తామర పువ్వు



విద్యానగర్(కరీంనగర్): తామర మొక్కలు చెరువులు, కొలనుల్లో పెరుగుతాయి. కానీ కరీంనగర్‌లోని భాగ్యనగర్‌లో నివాసం ఉండే రజని ఇంటి ఆవరణలో కుండీలో పెరిగి పువ్వు పూసింది. రజని 20ఏళ్లుగా తన ఇంటి ఆవరణలో మొక్కలు పెంచుతున్నారు. ఈ క్రమంలో కుండీలో నాటిన తామర మొక్కలు పువ్వులు పూస్తుండటంతో అందరూ ఆసక్తిగా వచ్చి చూస్తూ అభినందిస్తున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

కొత్తపల్లి: కొత్తపల్లిలోని ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పురపాలక సంఘం, కరీంనగర్ సన్ షైన్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేశారు. అదేవిధంగా షుగర్ రక్త పరీక్షలు, రక్త గ్రూపు నిర్ధారణ, ఈసీజీ, 2డీ ఎకో, లుపిడ్ ప్రొఫైల్ వంటి తదితర పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు మాట్లాడుతూ అనేక రోగాలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇలాంటి వైద్య శిబిరాలు దోహదపడతాయన్నారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన సన్‌షైన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సన్‌షైన్ సీఈవో సురేష్, క్రిటికల్ కేర్ వైద్యులు కమలాకర్, గైనకాలజిస్ట్ అన్నపూర్ణ, ఆర్థోపెడిక్ వైద్యుడు రాజేందర్, న్యూరో సర్జన్ రాజేశ్, జనరల్ సర్జన్ షేక్‌లాల్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ యశస్విని, మేనేజర్ సతీష్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ కె.నాగరాజు, కౌన్సిలర్లు వాసాల రమేష్, గున్నాల విజయ రమేష్, ఎస్కే నజియాబాబా, స్వర్గం వజ్రాదేవి నర్సయ్య, చింతల సత్యనారాయణ రెడ్డి ,వేముల కవిత శేఖర్, కోఆప్షన్ సభ్యులు ఎండీ ఫక్రుద్దీన్, కట్ల మమత సుధాకర్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు.

ఫీజు విషయంలో గొడవ
లాయర్ దాడిలో క్లయింట్ మృతి

బాన్సువాడ రూరల్ : న్యాయసలహా కోసం వెళ్లిన క్లయింట్‌తో కలిసి మద్యం తాగిన ఓ లాయర్ ఫీజు విషయంలో ఘర్షణపడి దాడిచేయడంతో క్లయింట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడకు చెందిన షేక్ అహ్మద్ (45) ఆర్బాత్ కాలనీలో తన ఇంటిపై పై అంతస్తు నిర్మించేందుకు సాజిల్ అనే వ్యక్తికి రూ.18 లక్షలకు కాంట్రాక్టుకు ఇచ్చాడు. ఇందులో రూ.17 లక్షలు చెల్లించినా పనిమాత్రం ఇంకా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ తప్పించుకు తిరుగుతుండటంతో అతనిపై చట్టరీత్యా చర్యల కోసం షేక్ అహ్మద్ శనివారం సాయంత్రం పట్టణానికి చెందిన ఉబేద్ అనే లాయర్ వద్దకు న్యాయసలహా కోసం వెళ్లాడు.

వాటర్ ప్లాంట్‌లో మద్యం తాగుతూ...

లాయర్‌కు చెందిన వాటర్ ప్లాంట్‌లోనే ఉబేద్, క్లయింట్ షేక్ అహ్మద్, ఆ ప్లాంట్‌లో పనిచేసే మహమూద్, మరోవ్యక్తి అలీం కలిసి మద్యం తాగుతూ కేసు విషయమై చర్చిస్తుండగా లాయర్ ఫీజు విషయంలో గొడవ ప్రారంభమైంది. గొడవలో ఉబేద్, షేక్ అహ్మద్‌ను కిందికి తోసి తలపై కర్ర విసిరి, బండరాయితో తలపై కొట్టడంతో రక్తపుమడుగులో పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు షేక్ అహ్మద్‌ను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ షేక్ అహ్మద్ ఆదివారం ప్రైవేటు న్యూరో ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు షేక్ మహమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

భారీగా విద్యుత్ డిమాండ్

వర్షాభావంతో పెరిగిన ఉచిత విద్యుత్ వినియోగం • వేసవిని తలపిస్తున్న కరెంట్ వాడకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అనూహ్యంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. ఆగస్టు మొదటివారం నుంచి మళ్లీ వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండడమే ఇందుకు కారణం. రాష్ట్రంలోని 31లక్షలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వర్షాలు లేక బోరుబావుల కింద ఉచిత విద్యుత్ బాగా వాడేస్తున్నారు. పంటలను రక్షించుకోవడానికి రైతులు పెద్దఎత్తున విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో గతవారం రోజులుగా రాష్ట్రంలో రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 13వేల మెగావాట్లకు మించిపోయింది. ఈ నెల 11న అత్యధికంగా 13,829 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదేరోజు జాతీయస్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 2,28,963 మెగావాట్లకు చేరి కొత్త రికార్డు నెలకొల్పింది. సాధారణంగా వేసవిలో డిమాండ్ ఈ స్థాయిలో పెరుగుతూ ఉంటుంది. గత నెలాఖరులో ఎడతెరిపి లేకుండా భారీవర్షాలు కురవడంతో అప్పట్లో రోజువారీగా రాష్ట్రస్థాయిలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 8వేల మెగావాట్లలోపు మాత్రమే నమోదైంది. గత నెల 27న అయితే గరిష్ట డిమాండ్ ఏకంగా 6904 మెగావాట్లకు పడిపోయింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ త్వరలో 14వేల మెగావాట్లకు చేరే అవకాశాలున్నాయని ట్రాన్స్‌కో యాజమాన్యం అంచనా వేస్తోంది.



విద్యుత్ వినియోగం ఇలా (మెగావాట్లలో)	
జూలై 27న	6904
ఆగస్టు 11న	13,829

జల విద్యుదుత్పత్తిపై కరువు నీడలు

కృష్ణా బేసిన్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ఏడాది శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ప్రశ్నార్థకంగా మారింది. కనీసం 3000 మిలియన్ యూనిట్ల(ఎంయూ) జల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రతి ఏటా తెలంగాణ జెన్‌కో లక్ష్యంగా పెట్టుకుంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 1000 ఎంయూలు కూడా ఉత్పత్తి చేసే పరిస్థితి కనిపించడం లేదు. శ్రీశైలం, సాగర్ జలాశయాలు ఈ ఏడాది పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి లేదు. ఇంకా శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే 97 టీఎంసీలు, నాగార్జునసాగర్ నిండాలంటే 166 టీఎంసీల వరద ఎగువ నుంచి రావాలి. ఆదివారం నాటికి శ్రీశైలం జలాశయానికి కృష్ణానది ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది.

రోజూ రూ.30 కోట్ల విద్యుత్ కొనుగోళ్లు

ప్రస్తుతం జలవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం లేకపోవడంతో గరిష్ట డిమాండ్ నెలకొని ఉండే వేళల్లో నిరంతర విద్యుత్ కొనసాగించడానికి పవర్ ఎక్స్ఛేంజీల నుంచి రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు పెద్దఎత్తున విద్యుత్ కొనుగోళ్లు చేస్తున్నాయి. రోజూ రూ.30 కోట్ల వ్యయంతో 60 ఎంయూల విద్యుత్‌ను ఎక్స్ఛేంజీల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న డిస్కంలకు రోజువారీ విద్యుత్ కొనుగోళ్లు తీవ్ర భారంగా మారాయి.

తిరుమల కాలినడక..ఘాట్ మార్గాల్లో ఆంక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

కాలినడక మార్గంలో అనుమతిస్తారు. శ్రీవారి మెట్టు వైపు కాలినడక మార్గంలో మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే 15 సంవత్సరాలలోపు చిన్నారులను తల్లిదండ్రులు, బంధువులతో అనుమతిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెద్దలను మాత్రమే ఈ మార్గంలో అనుమతిస్తారు. శనివారం నుంచి రెండు ఘాట్ రోడ్లలో సాయంత్రం 6 గంటల తరువాత ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలిపివేసిన విషయం తెలిసిందే.

చిన్నారుల రక్షణకు ట్యాగ్‌లు

అలిపిరి నుంచి తిరుమల నడకదారిలోని అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం పెరగడం, దాడుల నేపథ్యంలో పోలీసులు రక్షణ చర్యలను చేపట్టారు. ఆదివారం నుంచి అలిపిరి నడక మార్గంలోని ఏడో మైలు వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు ట్యాగ్‌లు వేస్తున్నారు. ట్యాగ్‌లు వేయడం వల్ల తల్లిదండ్రుల నుంచి పిల్లలు తప్పిపోయి నా సులభంగా కనిపెట్టేందుకు వీలవుతుంది. ట్యాగ్ పై చిన్నారి పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నంబర్, పోలీస్ టోల్‌ఫ్రీ నంబర్ నమోదు చేసి ఉంటాయి.

ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం

నడక మార్గం, ఘాట్ రోడ్లలో ఐదు ప్రాంతాల్లో చిరుత సంచారం జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడ చిరుతలు పెరిగినట్టు అటవీ అధికారులకు సమాచారం అందుతోంది. శనివారం కూడా నడక మార్గం, ఘాట్ రోడ్లలోని చిరుతల సంచారం గుర్తించారు. అలిపిరి నుంచి గాలిగోపురం వరకు మూడు ప్రాంతాలు, గాలి గోపురం నుంచి ఏడో మైలు వద్ద చిరుత సంచారాన్ని గుర్తించారు. రెండో ఘాట్ రోడ్డులోని 38 మలుపు చిరుత తిరుగుతున్నట్టు గుర్తించారు. దీంతో భక్తులను అప్రమత్తం చేశారు.

ఆపదను తప్పించే 'ఆలోచన'

తిరుమల అలిపిరి నడక మార్గంలో ఓ భక్తుడు ఆదివారం అందరినీ ఆకట్టుకున్నాడు. నడక మార్గంలో వన్య ప్రాణులు సంచరిస్తోన్న నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ భక్తుడు తన కుమారుడి చేతికి రబ్బర్ ఎలాస్టిక్ తాడు తగిలించి..ఆ తాడును ఆయన చేతికి ఇలా కట్టుకున్నాడు. దీనిపై ఆ భక్తుడిని ప్రశ్నించగా తమ జాగ్రత్త కోసమే తాడు కట్టినట్లు చెప్పాడు.


– తిరుమల



'వైద్యం'లో తెలంగాణ నంబర్ వన్

- కేసీఆర్ హయాంలో ఎంతో ప్రగతి
- ప్రభుత్వ వైద్యులకు పీజీలో రిజర్వేషన్లు కల్పిస్తాం
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్): వైద్యం, వైద్య విద్యలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్యలో రాష్ట్రం ఎంతో వెనుకబడి ఉండేదని, నిజామ్, బ్రిటిషర్లు ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులే ఉండేవని గుర్తుచేశారు. కానీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో వైద్యరంగంలో ఎంతో ప్రగతి సాధించామని చెప్పారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో ఆదివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి జిల్లాకు ఓ వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని హరీశ్ అన్నారు. లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలోనే ప్రథమస్థానంలో ఉన్నామని, అలాగే పీజీలో 8 సీట్లతో రెండవ స్థానంలో ఉన్నామని తెలిపారు. ధాన్యం ఉత్పత్తితో పాటు వైద్యులను తయారు చేయడంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. ఎంబీబీఎస్ ఫీజులు రాష్ట్రంలోనే తక్కువని, వైద్య విద్యార్థులకు అందించే స్టైఫండ్ అన్ని రాష్ట్రాలకంటే ఇక్కడే ఎక్కువ అని చెప్పారు. ప్రభుత్వ వైద్యులకు పీజీలో రిజర్వేషన్ సదుపాయం కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. నగరం నలుదిక్కుల నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్ గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారిందని, ఇతర దేశాలకు చెందినవారంతా వైద్యసేవలు, చికిత్సల కోసం హైదరాబాద్‌కు క్యూ కడుతున్నారని తెలిపారు. త్వరలోనే గాంధీ ఆస్పత్రిలో అవయవ మార్పిడి, ఫెర్టిలిటీ, ఎంసీహెచ్ భవనాలు, అధునాతన ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు, సదుపాయాలు కల్పించామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందజేశారు. డీఎంఈ రమేష్ రెడ్డి, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, పలువురు హెచ్‌ఓడీలు, ఆర్ఎంఓలు, వైద్యులు, వైద్యవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీశ్

పర్యావరణ విధ్వంసంతోనే వాతావరణ మార్పులు

ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పర్యావరణ విధ్వంసం కారణంగానే వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా అతి తక్కువ సమయంలో భారీ వర్షాలు, తీవ్రమైన తుపానులు వంటి వాతావరణ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటి నుంచి రేయింబవళ్లు యుద్ధప్రాతిపదికన శ్రమిస్తే తప్ప పర్యావరణానికి జరిగిన నష్టాన్ని పూడ్చలేని పరిస్థితి ఉందని... తక్షణమే శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం పెరగాలని పురుషోత్తమ్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఢిల్లీలోని ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేపిటల్ ఫౌండేషన్ సంస్థ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్‌ను అందించింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్ డా. సీవీ ఆనందబోస్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, జస్టిస్ ఏకే పట్నాయక్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డితో పాటు సామాజికంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన పలువురికి అవార్డులు అందించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణం, సుస్థిరాభివృద్ధి రంగంలో గత 50 ఏళ్లుగా తాను చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. మన దేశంలో పర్యావరణ చట్టాలు బాగున్నప్పటికీ... వాటి అమలు మాత్రం సరిగా జరగడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక యంత్రాంగాలను నిర్వీర్యం చేస్తున్నాయని.. ఇసుక వంటి ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టాల్సింది స్థానిక యంత్రాంగాలేనని తెలిపారు. భారత్‌లో అంతులేని సౌరశక్తి ఉందని, దానిని ఉపయోగించుకోవడం ద్వారా సంప్రదాయ ఇంధన వినియోగాన్ని తగ్గించుకోవాలని ఆయన సూచించారు.



అవార్డు అందుకుంటున్న పురుషోత్తంరెడ్డి

ఆర్కే–1ఏ మూసివేతకు కారణాలెన్నో..!

- బొగ్గు నిక్షేపాలు ఉన్నా మూసివేయడంపై స్థానికుల ఆగ్రహం
- కార్మికుల్లో భిన్నాభిప్రాయాలు
- ఉపరితల గని కోసమేనని ప్రచారం..

రామకృష్ణాపూర్: మరో ఏడెనిమిది సంవత్సరాల పాటు వెలికితీసేంత బొగ్గు నిల్వలు ఉన్నా.. సింగరేణి యాజమాన్యం మందమర్రి ఏరియా పరిధిలోని ఆర్కే–1ఏ గనిని మూసివేసింది. సర్దుబాటు పేరుతో ఇప్పటికే కార్మికులను బదిలీ చేసిన యాజమాన్యం సడెన్‌గా గనిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. గని మూత ఇప్పుడు చర్చనీయాంశమైంది. కార్మికులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అధికారుల తప్పుడు నివేదికతో గనిని మూసివేశారా..? గని స్థితిగతులపై అధ్యయనం చేసిన అధికారులు యాజమాన్యానికి ఏమని నివేదిక సమర్పించారు..? అత్యంత నాణ్యమైన జీ–9 గ్రేడ్ బొగ్గు డిపాజిట్లు ఉన్నా మూసివేత వైపే ఎందుకని మొగ్గుచూపారనే ప్రశ్నలు కార్మికుల నుంచి వస్తున్నాయి.

అధికారులపై విమర్శలు..

సింగరేణి విధానాలను పరిశీలిస్తే సమీప భవిష్యత్తులో భూగర్భగనులను పూర్తిగా మూసివేసే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్‌లో ఉన్న ఏకైక భూగర్భ గని ఆర్కే–1ఏను మూసివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్న ఈ భూగర్భ గనిని అధికారుల తప్పుడు నివేదికలతోనే యాజమాన్యం మూసివేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎనిమిదేళ్లకు సరిపడా నిల్వలు..

వాస్తవానికి ఆర్కే–1ఏ గనిలో మరో ఎనిమిదేళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయి. కనీసం ఐదు సంవత్సరాలపాటు గని నడిచే అవకాశాలున్నాయి. కానీ, బొగ్గు ఉత్పత్తి వ్యయం ఎక్కువతుందనే సాకుతో గని మూసివేయాలని అధికారులు యాజమాన్యానికి నివేదించారని తెలిసింది. ఇటీవల గనిలో పర్యటించిన కొంతమంది ఇక్కడి ఏరియా అధికారులే సంస్థ ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వటంతో యాజమాన్యం మూసివేతకు నిర్ణయం తీసుకుందని కార్మికులు ఆరోపిస్తున్నారు. యాజమాన్యాన్ని తప్పుదోవ పట్టించేలా నివేదికలు ఇచ్చారని బాహాటంగానే విమర్శిస్తున్నారు.

మార్కెట్లో మంచి డిమాండ్..

ఆర్కే1ఏ గనిలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన బొగ్గుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. గని ద్వారా కార్మికులు ప్రస్తుతం జీ–9 గ్రేడ్ బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. దీనికి మార్కెట్లో టన్నుకు దాదాపు రూ.14 వేల ధర పలుకుతోంది. ఉత్పత్తి వ్యయం కేవలం రూ.8 వేలు మాత్రమే ఉంది. ఉత్పత్తి వ్యయంపై అదనంగా టన్నుకు రూ.6 వేలు సంస్థ లాభం వస్తున్నట్లు కార్మికులు తెలిపారు. అయినా స్థానిక అధికారుల తప్పుడు రిపోర్టులే గని మూతకు ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. మరి కొన్నాళ్లు నడవాల్సిన గనిని కాలగర్భంలో కలిపేయడంపై కార్మికులు, వారి కుటుంబీకులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గని మూసివేతతో బోసిపోయిన ఆర్‌కే1ఏ గని

ఓసీపీ కోసమే మూత..

ప్రస్తుతం ఆర్‌కేపీలోని ఓపన్‌కాస్ట్ గని ఎక్స్‌టెన్షన్ కోసమే ఆర్కే–1ఏ భూగర్భగనిని యాజమాన్యం కాలగర్భంలో కలిపేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను నెలకొల్పాలనే సంకల్పంతో ఉన్న సింగరేణి యాజమాన్యం భూగర్భ గనులను మూసివేస్తోందని ఆరోపిస్తున్నారు. ఆర్కే–1ఏ గనిలో పనిచేస్తున్న కార్మికులను ఇప్పటికే మందమర్రి ఏరియాలోని ఆయా గనుల్లో సర్దుబాటు చేశారు. గనిలోపల ఉండిపోయిన బొగ్గు నిల్వలను తీయటానికి, మెటీరియల్ రికవరీ కోసం ప్రస్తుతం 75 మంది కార్మికులతో జనరల్ షిఫ్టులో పనులు చేయిస్తున్నారు. ఏదేమైన బొగ్గు నిక్షేపాలున్న ఈ గనిని మూసివేయడంపై స్థానికులు తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఇప్పటికే గనుల మూసివేతతో కళావిహీనంగా మారిన రామకృష్ణాపూర్ పట్టణం .. ఉన్న ఏకైక గని మూసివేతతో మరింత కళ తప్పుతుందని పేర్కొంటున్నారు. అర్ధంతరంగా గనిని మూసివేస్తున్నా కార్మిక సంఘాలు ప్రేక్షక పాత్ర వహించటంపై కార్మికులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



గని ఆవరణలో కనిపించని కార్మికులు

'మానేరు'లో రాష్ట్రస్థాయి జూడో పోటీలు

- 19, 20 తేదీల్లో నిర్వహణ
- 380 మంది క్రీడాకారులు, 50 మంది రెఫరీలు రాక
- రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో 8వ తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో పురుషుల, మహిళల చాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 19, 20 తేదీల్లో అట్టహాసంగా నిర్వహిస్తామని మానేరు విద్యాసంస్థల అధినేత, రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి అన్నారు. ఆదివారం మంకమ్మతోటలోని సాయిమానేరు పాఠశాలలో పోటీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి జూడో క్రీడ పెట్టింది పేరని, జూడోలో రాణించినవారు అన్ని రంగాల్లో రాణిస్తారని వివరించారు. మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 10కి పైగా రాష్ట్రస్థాయి, ఒకసారి 64వ జాతీయస్థాయి పాఠశాలల అండర్‌– 17 జూడో పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఏకైక జూడో అకాడమీ కేవలం మానేరులోనే ఉందన్నారు. 38 ఏళ్ల విద్యారంగంలో మానేరులో పిల్లలకు విద్యతో పాటు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగించే క్రీడలపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని, అందులో భాగంగానే ఏటా రాష్ట్రస్థాయి పోటీలను పాఠశాలలోనే ఘనంగా నిర్వహిస్తూ పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ, రెండురోజుల పాటు జరగనున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 380 మంది క్రీడాకారులు, 50 మంది కోచ్‌లు, మేనేజర్‌లు, రెఫరీలు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాన్ని మానేరు విద్యాసంస్థలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ జట్టుకు ఎంపిక చేయనున్నట్లు, బంగారు పతకం సాధించినవారిని ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వెల్లడించారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు మాట్లాడుతూ, జూడో పోటీలను మానేరు విద్యాసంస్థలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు క్రీడా శాఖ తరుపున సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జూడో సంఘం బాధ్యులు ఎల్వీ రమణ, మహేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతరెడ్డి, తదితరులు

రామాయణం భారతీయ ఆత్మకు ప్రతీక



గండ్ర లక్ష్మణరావుకు బిరుదు ప్రదానం చేస్తున్న కవులు



శ్రీరామ పట్టాభిషేకం

- జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
- డాక్టర్ గండ్ర లక్ష్మణరావుకు వ్యాఖ్యాన ప్రవర బిరుదు ప్రదానం

కరీంనగర్‌కల్చరల్: రామాయణం భారతీయ ఆత్మకు ప్రతీకగా నిలుస్తుందని జాతీయ సాహిత్య పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ కోదండ రామాలయంలో జాతీయ సాహిత్య పరిషత్, ఎస్సారార్ కళాశాల తెలుగు విభాగం, తెలంగాణ పద్య కవితా సదస్సు కరీంనగర్ శాఖల ఆధ్వర్యంలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ రచించిన రామాయణ కల్పవృక్ష కావ్యాధ్యయన సమాపనోత్సవంలో భాగంగా శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు రెండున్నరేళ్లపాటు కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రామాయణ కల్పవృక్ష కావ్యానికి సమగ్రంగా వ్యాఖ్యానం చేయడం సాహిత్య చరిత్రలోనే గొప్ప విషయమన్నారు. వాల్మీకి రచించిన రామాయణాన్ని ఆధారంగా చేసుకొని వందలాది రామాయణ కావ్యాలు వెలువడ్డాయని, వాటిలో విశ్వనాథ కల్పవృక్షం అగ్రస్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ.. గండ్ర లక్ష్మణరావు సాహిత్యపరంగా వర్తమాన సాహితీవేత్తలకు నిత్య స్ఫూర్తిని కలిగిస్తుంటారని, సుదీర్ఘ కాలంపాటు రామాయణ కల్పవృక్షానికి వ్యాఖ్యానం చెప్పి, ముగింపు కార్యక్రమంలో శ్రీరామ పట్టాభిషేకం జరిపించడం రాముని పట్ల ఆయనకు గల భక్తికి నిదర్శనమని కొనియాడారు. అనంతరం లక్ష్మణరావుకు వ్యాఖ్యాన ప్రవర బిరుదు ప్రదానం చేశారు. అంతకుముందు వేదపండితుల వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీరామ పట్టాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్, కవులు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్, వడ్డేపల్లి కృష్ణ, కేఎస్.అనంతాచార్య, రాజా రామ్మోహన్ శర్మ, మాదాడి నారాయణరెడ్డి, జీవీ కృష్ణమూర్తి, నాగిళ్ల రామశాస్త్రి, పాలకుర్తి రామ్మూర్తి, భైరవభట్ల కామేశ్వరరావు, డాక్టర్ గిరిజా మనోహర్ బాబు, ఆచ్చి నరహరి, జంగ మనోహర్ రెడ్డి, మండల నగేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్కేరావు మృతి తీరని లోటు

- ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్మన్ జనార్దన్, ఎమ్మెల్యేలు రామన్న, సక్కు
- ఉట్నూర్‌లో లక్కేరావు సంతాప సభ



మౌనం పాటిస్తున్న ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్, ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు

ఉట్నూర్‌రూరల్: లక్కేరావు మృతి ఆదివాసీ సమాజానికి తీరని లోటని ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, ఆత్రం సక్కు అన్నారు. ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్, ఉద్యమనేత కనక లక్కేరావు సంతాప సభ ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై లక్కేరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుడిగానే కాకుండా ఆదివాసీల అభివృద్ధికి లక్కేరావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గోడం నగేశ్, రాష్ట్ర మహిళా కమిషన్‌సభ్యురాలు ఈశ్వరీ బాయి, పద్మశ్రీ అవార్డుగ్రహీత కనకరాజు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు, జెడ్పీటీసీ చారులత రాథోడ్, రాజు, తిరుపతి, ఆదివాసీ సంఘాల నాయకులు, జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, లక్కేరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచిమాట



స్ఫూర్తిదాయకం స్వాతంత్య్రం

ఏ దేశానికైనా ప్రధానంగా ఉండాల్సింది స్వాతంత్య్రం. ప్రపంచంలో పలుదేశాలు ఏదో సందర్భంలో ఇతర దేశాల పాలనకు లోబడి అటుపైన స్వాతంత్య్రాన్ని సాధించు కున్నవే. స్వాతంత్య్రాన్ని సాధించుకున్న దినాన్ని ఉత్సవ దినంగా ప్రతి దేశమూ జరుపుకుంటూ ఉంటుంది. స్వాతంత్య్ర దినోత్సవం ప్రతి దేశానికి స్ఫూర్తిదాయకమే.

‘దేశానికి రూపకల్పన చేసేది ఏది? ఎత్తైన నిర్మాణాలు, భవనాల గోపురాలతో ఉండే గొప్ప నగరాలు కాదు; విశాలమైన ఓడరేవులు కాదు, కాదు; మనుషులు, గొప్ప మనుషులు’ అని ఒక గ్రీక్ చాటువు ను ఆధారంగా తీసుకుని ఇంగ్లిష్ కవి విలిఅమ్ జోన్స్ చెప్పారు. ఆ మాటల్ని తీసుకుని గురజాడ అప్పారావు ‘దేశమంటే మట్టికాదోయ్ /దేశమంటే మనుషులోయ్’ అని చెప్పారు. ఔను, దేశం అంటే మనుషులే.

‘నువ్వు నీ దేశాన్ని ప్రేమించు’ అని ఇంగ్లిష్ కవి ఆల్ఫెడ్ టెన్నిసన్ అన్నారు. ఆ మాటల్ని తీసుకునే గురజాడ అప్పారావు ‘దేశమును ప్రేమించుమన్నా’ అని అన్నారు. దేశాన్ని ప్రేమించడం దేశ ప్రజల్ని ప్రేమించడం ఔతుంది; దేశప్రజల్ని ప్రేమించడం దేశాన్ని ప్రేమించడం ఔతుంది. దేశాన్ని ప్రేమించలేనివాళ్లు దేశ పౌరులుగా ఉండేందుకు ఎంతమాత్రమూ అర్హులు అవరు; వాళ్లు దేశానికి హానికరం ఔతారు.

‘నితాంత స్వాతంత్య్రమ్ము వెల్లి విరియు స్వర్గాన/నా మాతృదేశమును మేలుకొన నిమ్ము ప్రభూ’ ఈ మాటల్లో పలికిన రవీంద్రనాథ్ ఠాగూర్ భావం మాతృదేశం, దేశ స్వాతంత్య్రం ఆవశ్యకతనూ, ప్రాముఖ్యతనూ ఘోషిస్తూ ఉంది. విదేశీ ఆక్రమణ దారుల క్రూరమైన, భయానకమైన పాలనలో పెనుబాధను అనుభవించి, లెక్కలేనంత సంపదను కోల్పోయి, ఎన్నిటినో వదులుకున్న మనదేశం వందల సంవత్సరాల పరపీడన నుండి విముక్తమై 75 యేళ్లుగా స్వాతంత్య్రాన్ని శ్వాసిస్తోంది. మనం ఇవాళ స్వతంత్ర దేశంలో ఉన్నాం;

> ‘దేశవాసులు అందరికీ జాతీయతా భావం ఉండాలి. జాతీయతా భావం లేకపోవడం క్షంతవ్యం కాదు. జాతీయతా వ్యతిరేకత, దేశ వ్యతిరేకత అనేవి భయంకరమైన మానసికవ్యాధులు. అవి ఉండ కూడదు. జాతీయత–దేశ విద్వేషవాదం నుండి మనల్ని, మనదేశాన్ని మనం కాపాడుకుంటూ ఉండాలి’

మన దేశంలో మనం మనదేశ పౌరులుగా ఉన్నాం. ఈ దేశం మనది; ఈ మనదేశం మన సంతతికి పదిలంగా అందాలి. ఈ చింతన మనల్ని నడిపించే ఆశయమై మనలో, మనతో సర్వదా, సర్వథా ఉండాలి.

‘నువ్వు, నీ దేశం నీకు ఏం చేస్తుంది అని అడిగే రాజకీయవాదివా? లేకపోతే నువ్వు, నీ దేశానికి ఏం చెయ్యగలను అని అడిగే పట్టుదల ఉన్నవాడివా? మొదటి ప్రశ్న అడిగేవాడివి ఐతే నువ్వు పరాన్నజీవివైన పురుగువి, రెండవ ప్రశ్న అడిగే వాడివి ఐతే నువ్వు ఎడారిలో ఉద్యానవనంవి’ అని ఖలీల్ జిబ్రాన్ మాటలు మన మెదళ్లను కదిలించాలి; మనదేశానికి మనం ఉద్యానవనాలం అవ్వాలి.

‘జంబూద్వీపే వైవస్వత మన్వంతరే భరతఖండే... ‘ఇలా ఆలయాల్లో సంకల్పం చెప్పడం మనకు తెలిసిందే. ఈ సంకల్పం చెప్పడం కాశ్మీర్ నుండీ కన్యాకుమారి వరకూ ఉండే ఆలయాల్లో ఉంది. ఇప్పటి పాకిస్తాన్ ప్రాంతంలోనూ, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోనూ ఉండే ఆలయాల్లోనూ ఉండేది. దీని ద్వారా భరత ఖండం సాంస్కృతికంగా ఒకటే అన్న సత్యం విశదం ఔతోంది. 2,000 ఏళ్లకు పూర్వందైన తమిళ్ సాహిత్యం పుఱనానూఱులో ఉత్తరాన హిమాలయాల నుండీ దక్షిణాన కన్యాకుమారి వరకు ఉన్న దేశం ఇది అని చెప్పబడింది. దీని ద్వారా ఎప్పటి నుండో భారతం భౌగోళికంగా ఒకటే అన్న సత్యం అవగతం ఔతోంది.

> ‘భారత(ప్ర) దేశం... ‘భా’ అంటే ‘కాంతి’ లేదా ‘ప్రకాశం’ అనీ, ‘రత’ అంటే అంకితమైన, ఆసక్తి కల అనీ అర్థాలు. భగవంతుడు కాంతిరూపుడు. ‘భారతం’ అంటే ‘భగవంతుడికి అంకితమైంది’ లేదా ‘భగవంతుడిపై ఆసక్తి కలది’ అని అర్థం. ఈ అర్థాన్ని మనం ఆకళింపు చేసుకుందాం‘

2,300 యేళ్ల క్రితం నాటి గ్రీక్ చరిత్రకారుడు మెగస్తనీస్ హిమాలయం నుండీ దక్షిణాన కడలి వరకు ‘ఇండికా’ అని గుర్తించాడు. అవగాహనా రాహిత్యంతో కొందరు మన దేశం అసలు ఒక దేశమే కాదని, మరొకటని మనలో దేశవ్యతిరేక భావ అనలాన్ని రగిలిస్తూ ఉంటారు. ఆ అనలాన్ని చదువుతోనూ, విజ్ఞతతోనూ మనం ఆర్పేసుకోవాలి.

‘నా తల్లీ, తండ్రీ సంతోషంగా ఉన్నది ఈ దేశంలోనే’ అనీ, ‘తియ్యనైన ఊపిరినిచ్చి కని, పెంచి అనుగ్రహించింది ఈ దేశమే’ అని అన్నారు తమిళ్ మహాకవి సుబ్రమణియ బారతి. ఆయన జాతీయతా సమైక్యతను కాంక్షిస్తూ ‘కాశి నగర పండితుల ప్రసంగాన్ని కంచిలో వినడానికి ఒక పరికరాన్ని చేద్దాం’ అనీ అన్నారు. జాతీయతా సమైక్యత ఆపై సమగ్రత దేశానికి ముమ్మాటికీ ముఖ్యం.

‘వందేమాతరం జయ వందేమాతరం; ఆర్య భూమిలో నారీమణులూ, నర సూర్యులూ చేసే వీరనినాదం వందే మాతరం’ అనీ, ‘వందేమాతరం అందాం; మా దేశమాతను పూజిస్తాం అందాం’ అనీ నినదించారు సుబ్రమణియ బారతి. మనదేశాన్ని ప్రేమిస్తూ ఉందాం, మనదేశాన్ని పూజిస్తూ ఉందాం, మనం దేశభక్తులుగా మసలుతూ ఉందాం. దేశభక్తితో, భారతీయతతో బతుకుతూ ఉందాం. భారతీయులమై మనసారా, నోరారా అందాం, అంటూ ఉందాం ‘వందేమాతరం’.

– రోచిష్మాన్

బౌద్ధవాణి

మిత్రధర్మం



బుద్ధుడు ధర్మ ప్రబోధం చేస్తూ, సుబాహుడనే ఓ రైతు కథ చెప్పాడు.

పూర్వం ఒక గ్రామంలో సుబాహుడు అనే రైతు ఉండేవాడు. అతనికి అడవిని ఆనుకుని పంటపొలం ఉంది. ఒక రోజున పొలం దున్ని నాగలి విప్పాడు. ఎద్దుల్ని పచ్చికలో తోలాడు. తాను పొలం పనుల్లో మునిగిపోయాడు. చాలాసేపటికి గమనిస్తే ఎద్దులు కన్పించలేదు. వాటిని వెతుక్కుంటూ అడవిలోకి పోయాడు. అడవి మధ్యకు చేరాడు. దారి తప్పాడు. ఆకలి వేసింది. అక్కడ కొండ అంచున తిందుక వృక్షం కనిపించింది. మెల్లగా చెట్టెక్కాడు. ఒక కొమ్మ మీదికి చేరి పండ్ల గుత్తిని అందుకోబోయాడు. కొమ్మ విరిగి బావి లాంటి పెద్ద గుంటలో పడ్డాడు. బయటకు రాలేకపోయాడు. అలా రోజులు గడిచాయి. నీరసించి శక్తి సన్నగిల్లి మూలుగుతూ పడి ఉన్నాడు.

ఆ మరునాడు ఉదయం తిందుక ఫలాల కోసం ఒక పెద్ద తోక వానరం అక్కడికి వచ్చింది. గుంటలోంచి వచ్చే మూలుగును వింది. జాలి పడింది. అరచి పిలిచింది. వాడు కళ్ళు తెరచి చూశాడు. ‘‘మానవా! భయపడకు నిన్ను కాపాడుతాను’’ అంది. ఆ పక్కనే ఉన్న రాతిబండలు గోతిలోకి జారవిడిచి మెట్లుగా పేర్చింది. గోతిలోకి దిగి, అతణ్ణి భుజాన ఎత్తుకుని పైకి చేర్చింది. ఆకు దొన్నెలో నీరు తెచ్చింది. తిందుక ఫలాలు తినిపించింది. వాడు నెమ్మదిగా శక్తి తెచ్చుకున్నాడు. తన వివరాలు చెప్పాడు. ‘‘సుబాహూ.. చింతిల్లకు.. నా వీపున ఎక్కి భుజాలు పట్టుకో’’ అంది. సుబాహుని తీసుకుని అతని గ్రామంవైపు సాగింది.

కొంతసేపటికి అలసిపోయింది. ‘‘సుబాహూ... అలసటగా ఉంది. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటాను. ఈ ప్రాంతంలో సింహాలు, పులులు, ఎలుగుబంట్లు, చిరుతలు తిరుగుతూ ఉంటాయి. నీవు జాగ్రత్తగా చూస్తూ ఉండు. అవసరమైతే నన్ను లేపు’’ అని, ఆ ప్రక్కనే ఉన్న చెట్టుకి ఆనుకుని కునుకు తీసింది వానరం. ‘ఈ వానరం బలంగా ఉంది. దీని మాంసం చాలా రుచిగానూ ఉంటుంది. దీన్ని చంపి తిన్నంత తిని మిగిలినది దార్లో తింటూ పోవచ్చు.’ అనే దురాలోచన కలిగింది సుబాహుకు. వెంటనే పక్కనే ఉన్న రాయి ఎత్తి తలమీద కొట్టబోయాడు. కానీ శక్తి లేకపోవడం వల్ల చేయి వణికింది. గురి తప్పింది. వానరం లేచింది. సుబాహు వైపు చూసింది. వాడు గడగడ వణికిపోతున్నాడు. దానికి జాలి వేసింది.

‘‘మానవా! అన్నిటి కంటే పెద్దనేరం మిత్ర ద్రోహం. అయినా, నేను ధర్మాన్ని తప్పను. నిన్ను నమ్మను. నేను చెట్లకొమ్మల మీదినుండి వెళ్తా ఉంటాను. నీవు నేలమీద ఆ వెనుకే రా.. నీ గ్రామానికి చేరుస్తాను’’ అంది. అలా అడవి చివరకు చేర్చి తిరిగి తన నివాసానికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత వాడు ఆ నీటిలో దిగి దాహం తీర్చుకున్నాడు. స్నానం చేశాడు. ఆ తరువాత వాడి శరీరంలో మార్పులు వచ్చాయి. ఒళ్ళంతా బొబ్బలు లేచాయి. అవి మానని గాయాలుగా మారాయి. సుబాహు కుష్ఠువ్యాధి పీడితుడయ్యాడు’’ అని చెప్పి–

‘‘భిక్షువులారా! కుష్ఠువ్యాధి కంటే భయంకరమైంది మేలు చేసిన వారికి కీడు చేయడం. మిత్ర ద్రోహిని, చేసిన మేలు మరిచే వారిని చూసి అసహ్యించుకోవాలి. వ్యాధిగ్రస్తుల్ని, రోగాల్ని చూసి కాదు’’ అన్నాడు.

– బొర్రా గోవర్ధన్

వాగ్గేయకార వైభవం

మనసుకు హత్తుకునేలా...



గొప్ప వాక్కును కొందరు మహాత్ములు పద్యరూపంలో చెప్పారు. మరి కొందరు గద్యరూపంలో చెప్పారు, ఇంకొందరు గీతం రూపంలో చెప్పారు. పోతన భాగవతాన్ని పద్య, గద్య రూపంలో చెప్పారు. ప్రధానంగా పద్య రూపంలో చెప్పారు. పద్యానికి ఉన్న లక్షణం –అది ఛందోబద్ధం. నాలుగుసార్లు చదివితే అది నోటికొచ్చేస్తుంది. జ్ఞాపకంలో ఉండిపోతుంది. జీవితంలో ఏది ప్రధానంగా జ్ఞాపకం ఉంచుకోవాలో, అలా ఉంచుకుని సందర్భాన్నిబట్టి గుర్తు తెచ్చుకుని సానుకూలంగా ఆచరణలో పెట్టుకోగలిగిన వాటిని ఛందోబద్ధంగా ఇస్తే అవి మనసుకు హత్తుకుని మనకు అవసరాన్నిబట్టి ప్రయోజనం కలిగిస్తాయి. కానీ అంత జ్ఞాపకం పెట్టుకోవలసిన అవసరం లేని వాటిని గద్య రూపంలో(వచనంగా) అందించాడు పోతన, పద్యం, గద్యం కలిసి రాసినప్పుడు. తెలుగులో పద్యరూపంలో చెప్పినట్టుగానే, సంస్కృతంలో శ్లోకరూపంలో చెప్పారు. ఒక పద్యాన్ని చదవడంకన్నా, ఒక శ్లోకాన్ని చదవడంకన్నా, మేము వాక్యరూపంలో ఉన్న వచనాన్ని (గద్యాన్ని) చదువుకుని ప్రయోజనం పొందుతామని ఇష్టపడేవారికి గద్యంలో కూడా అందుబాటులో ఉంచారు. మరి కొందరు చాలా తేలికగా అవతలివారికి బోధ చేయడానికి గీతం రూపంలో అందించారు. గీతం అంటే పాట. పాట మనసును రంజింప చేస్తుంది. సహజంగా పుట్టుకచేత క్రౌర్యం ఉన్నవి కూడా సంగీతం వినబడేటప్పటికి అవి వాటి క్రూరత్వాన్ని ఆ కాసేపు పక్కనబెట్టేస్తాయి. అలాగే గాఢమైన అజ్ఞానంతో ఏమీ తెలియనివారు కూడా సంగీతంతో కూడిన గీతం వినేటప్పటికి గొప్ప శాంతిని పొందుతారు. పశువులు కావచ్చు, పసి బిడ్డలు కావచ్చు .. పాటవినేటప్పటికి ఒక తన్మయావస్థకు లోనుకావడం జరుగుతుంది. ఏడుస్తున్న వాళ్ళు కూడా ఆ కాసేపు ఏడుపు ఆపేస్తారు. మనసు శాంతిని పొందుతుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సమాజ హితం కోసం పద్యరూపంలోగానీ, గద్య, గీత రూపాల్లో కానీ ఎవరు ఏమీ ఆశించకుండా వాక్కులుగా వెచ్చించారో వారు శాశ్వతాన్ని పొందారు. ‘ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురంబులు వాహనంబులున్/ సొమ్ములు? గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము? బాసి కాలుచే/ సమ్మెట పోటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ/ బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.’ అంటాడు పోతన. నేను సమాజహితాన్ని కోరి పలుకుతున్నాను తప్ప నేనేమీ ఆశించడంలేదన్నాడు.. అదే శాశ్వతమైనది.

సినిమా

యాక్షన్.. ఎమోషన్


వెంకటేశ్

వెంకటేష్ హీరోగా నటిస్తున్న ‘సైంధవ్’ సినిమా క్లైమాక్స్ షెడ్యూల్ పూర్తయింది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, సారా కీలక పాత్రలు చేస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా క్లైమాక్స్ షెడ్యూల్ కంప్లీట్ అయింది. ఈ సందర్భంగా యూనిట్ వెంకటేష్ లుక్‌ని రిలీజ్ చేసింది. ‘‘వెంకటేష్ కెరీర్‌లో 75వ చిత్రంగా ‘సైంధవ్’ రూపొందుతోంది. హీరోతో పాటు ఎనిమిది మంది ముఖ్య నటీనటులపై 16 రోజుల్లో కీలకమైన హై యాక్షన్–ఎమోషనల్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. యాక్షన్ ఎపిసోడ్‌ను రామ్–లక్ష్మణ్ మాస్టర్స్ సూపర్‌వైజ్ చేశారు. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 22న ఈ మూవీ రిలీజ్ కానుంది’’ అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, కెమెరా: ఎస్.మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్).

సెప్టెంబరులో స్టార్ట్?


రవితేజ

‘**డా**న్‌శీను’, ‘బలుపు’, ‘క్రాక్’ చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో కొత్త సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను సెప్టెంబరులో స్టార్ట్ చేసేలా చిత్రయూనిట్ సన్నాహాలు చేస్తోందనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రంలో హీరోయిన్స్ పాత్రల కోసం మృణాల్ ఠాకూర్, పూజాహెగ్డే వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. మరి ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు ఫైనల్‌గా ఫిక్స్ అవుతారా? లేకుంటే వేరే హీరోయిన్ ఈ ప్రాజెక్టులో యాడ్ అవుతారా? అన్నది తెలియాలి. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు రవితేజ ప్రస్తుతం ‘టైగర్ నాగేశ్వరరావు’, ‘ఈగిల్’ సినిమాలతో బిజీగా ఉన్నారు. ‘టైగర్ నాగేశ్వరరావు’ చిత్రం అక్టోబరు 20న విడుదల కానున్న సంగతి తెలిసిందే.

యాక్షన్ ప్లాన్ రెడీ

కెరీర్‌ను పక్కా ప్లాన్‌తో డిజైన్ చేసుకుంటున్నట్లున్నారు హీరో సూర్య. ప్రస్తుతం ‘కంగువా’ సినిమాతో బిజీగా ఉన్నారాయన. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ కానుందని తెలిసింది. అయితే ఈ చిత్రం తర్వాత ‘సూరారై పోట్రు’ (తెలుగులో ‘ఆకాశం నీ హద్దురా’) వంటి హిట్ ఇచ్చిన సుధా కొంగర దర్శకత్వంలో మరో సినిమా చేస్తారు సూర్య. అక్టోబరులో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. అలాగే వెట్రిమారన్ దర్శకత్వంలో సూర్య ఆల్రెడీ కమిటైన ‘వాడి వాసల్’ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ప్రారంభం కానుంది. ప్రస్తుతం వెట్రిమారన్ ‘విడుదలై 2’తో బిజీగా ఉన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికాగానే ‘వాడి వాసల్’ ప్రారంభమవుతుందట. ఇక లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన కమల్‌హాసన్ ‘విక్రమ్’ క్లైమాక్స్‌లో రోలెక్స్ పాత్రలో సూర్య అదరగొట్టారు. ఈ రోలెక్స్ క్యారెక్టర్‌తోనే ఓ కంప్లీట్ సినిమా ఉంటుందని, సూర్య ఇప్పటికే కమిటైన ప్రాజెక్ట్స్ షూటింగ్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ సెట్స్‌కి వెళుతుందట. కాగా సూర్య ఆదివారం తన ఫ్యాన్స్‌ని కలుసుకున్నారట. ఈ క్రమంలోనే తన తర్వాతి సినిమాలపై అప్‌డేట్స్ ఇచ్చారని, అవే ప్రస్తుతం కోలీవుడ్‌లో తెరపైకి వచ్చాయని తెలుస్తోంది.


సూర్య

ఆ పదం నాకు పెద్దగా నచ్చదు

– నాని

‘‘**మ**నందరం ఇప్పుడు పాన్ ఇండియా మూవీస్ అంటున్నాం. ఆ పదం నాకు పెద్దగా నచ్చదు. కానీ, నాకు తెలిసిన యాక్టర్స్‌లో పాన్ ఇండియా యాక్టర్ ఎవరైనా ఉన్నారంటే అది దుల్కర్ మాత్రమే. ఎందుకంటే ఓ హిందీ దర్శకుడు దుల్కర్ కోసం కథ రాసుకుంటాడు. ఓ తెలుగు దర్శకుడు తన కోసం కథ రాసుకుంటాడు. ఓ తమిళ దర్శకుడు కూడా దుల్కర్ కోసం స్క్రిప్ట్ రాసుకుంటాడు. ఓ మలయాళ దర్శకుడూ అతని కోసం కథ రాస్తాడు. ఓ పాన్ ఇండియా యాక్టర్‌కు నిజమైన నిర్వచనం ఇదే’’ అన్నారు నాని. దుల్కర్ సల్మాన్, ఐశ్వర్యా లక్ష్మి జంటగా నటించిన చిత్రం ‘కింగ్ ఆఫ్ కోత’. అభిలాష్ జోషి దర్శకత్వంలో జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ‘‘దుల్కర్ ‘ఓకే బంగారం’ సినిమాలో నా వాయిస్ ఉంది. తన జర్నీలో నా భాగస్వామ్యం కూడా ఉన్నట్లు నేను ఫీలవుతున్నాను. ‘సీతారామం’తో తను తెలుగు ప్రేక్షకుల మనసు గెల్చుకున్నాడు. ఈ సినిమాతో ఆ ప్రేమ నెక్ట్స్ లెవల్‌కు వెళ్లాలని కోరుకుంటున్నాను. ‘కింగ్ ఆఫ్ కోత’ పెద్ద విజయం సాధించాలి. ’’ అన్నారు. హీరో రానా మాట్లాడుతూ–‘‘దుల్కర్ ఓ వైల్డ్ యాక్షన్ ఫిల్మ్ చేశాడంటే నాకు చాలా ఎగ్జయిటింగ్‌గా ఉంది’’ అన్నారు. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ–‘‘ నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫిల్మ్ ‘కింగ్ ఆఫ్ కోత’. నాలుగు భాషల్లోనూ నేనే డబ్బింగ్ చెప్పాను’’ అన్నారు. ‘‘ఈ సినిమాలో దుల్కర్ కొత్తగా కనిపిస్తారు’’ అన్నారు జీ స్టూడియోస్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరోయిన్స్ ఐశ్వర్యా లక్ష్మి, అనిఖా సురేంద్రన్, నటుడు షబ్బీర్, నిర్మాత ‘స్రవంతి’ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



నిమ్మకాయల ప్రసాద్, రానా, దుల్కర్ సల్మాన్, నాని, ఐశ్వర్యా లక్ష్మి


తమన్నా

షాక్ అయ్యాను!

తమన్నా నటించిన తాజా వెబ్‌సిరీస్ ‘ఆఖరి సచ్’. 2018లో ఢిల్లీలో బూరారి ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన పదకొండుమంది ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనలతో ‘ఆఖరి సచ్’ రూపొందింది. తమన్నా, అభిషేక్ బెనర్జీ, శివిన్ నారంగ్, రాహుల్ బగ్గా లీడ్ రోల్స్‌లో రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా తమన్నా మాట్లాడుతూ– ‘‘ఇందులో అన్య అనే ఇన్వెస్టిగేటివ్ పోలీసాఫీసర్ పాత్రలో నటించాను. ‘ఆఖరి సచ్’ కథ విన్నప్పుడు నేను షాక్ అయ్యాను. ఈ సిరీస్ నాకు చాలా స్పెషల్. ఎందుకంటే నా కెరీర్‌లో తొలిసారిగా ఓ పోలీసాఫీసర్ పాత్రలో నటించాను. అలాగే నా కంఫర్ట్‌జోన్ దాటి చాలా ఎమోషన్స్‌తో కూడు కున్న అన్య పాత్రలో నటించాను’’ అని చెప్పుకొచ్చారు తమన్నా.

కుటుంబంతో కలిసి చూడొచ్చు

– దర్శకుడు అభిషేక్ మహర్షి

‘‘ప్రేమ్ కుమార్’ చిత్రం ఆద్యంతం వినోద భరితంగా కుటుంబ సమేతంగా చూసేలా ఉంటుంది. ఈ మూవీలో నేను, నా వైఫ్ అతిథి పాత్రల్లో కనిపిస్తాం’’ అని దర్శకుడు అభిషేక్ మహర్షి అన్నారు. సంతోష్ శోభన్ హీరోగా, రాశీ సింగ్, రుచిత సాధినేని హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘ప్రేమ్ కుమార్’. శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు అభిషేక్ మహర్షి మాట్లాడుతూ–‘‘కొన్ని సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా పని చేశాను. నా దగ్గర ఉన్న ముప్పై కథల్లో ‘ప్రేమ్ కుమార్’ కథ సెట్ అయింది. ‘కుచ్ కుచ్ హోతా హై, నువ్వే నువ్వే’ సినిమాల స్ఫూర్తితో ఈ కథను రాశాను. సినిమాల్లో పెళ్లి సీన్‌లో చివర్లో హీరో వచ్చి.. హీరోయిన్ పెళ్లి ఆపుతాడు. తర్వాత హీరో, హీరోయిన్లు కలిసిపోతారు. అప్పుడు ఆ పెళ్లి కొడుకు పరిస్థితి ఏంటి? చెప్పేందుకే ‘ప్రేమ్ కుమార్’ తీశాం. శివ ప్రసాద్‌గారికి సినిమాలపై ఎంతో ప్యాషన్ ఉంది’’ అన్నారు.



థాయ్‌లాండ్‌లో డబుల్

‘ఇస్మార్ట్ శంకర్’ (2019) వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం ‘డబుల్ ఇస్మార్ట్’. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండో షెడ్యూల్ థాయిలాండ్‌లో ప్రారంభమైంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు మేకర్స్. ‘‘హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ‘డబుల్ ఇస్మార్ట్’. రెండో షెడ్యూల్ థాయిలాండ్‌లో ప్రారంభించాం. ఈ షెడ్యూల్‌లో రామ్, నటుడు సంజయ్ దత్‌పై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. ‘ఇస్మార్ట్ శంకర్’ కి సీక్వెల్‌గా రూపొందుతున్న ‘డబుల్ ఇస్మార్ట్’ తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 2024 మార్చి 8న మహాశివరాత్రికి విడుదలవుతుంది’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి, కెమెరా: జియాని గియాన్నెల్లి.


షూటింగ్‌లో ‘డబుల్ ఇస్మార్ట్’ యూనిట్

నవ్వులే నవ్వులు

అభినవ్ మణికంఠ, గోల్డీ నిస్సీ, మ్యాడీ వీజే, పవన్ రమేష్, భరత్ రెడ్డి కీలక పాత్రల్లో అశోక్ కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం ‘మహానటులు’. ఏబీఆర్ ప్రొడక్షన్స్ అండ్ ఏబీఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అనిల్ బోధిరెడ్డి, తిరుపతి ఆర్. యర్రంరెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ– ‘‘నేను ఇప్పటి వరకూ కామెడీ జానర్ టచ్ చేయలేదు. ‘జాతిరత్నాలు’ సినిమా తరహాలో పూర్తి ఫన్, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో తీసిన మూవీ ‘మహానటులు’. నలుగురు టీమ్‌గా మారి మహానటులు అనే యూట్యూబ్ చానల్‌ను ఎలా అభివృద్ధి చేశారు? అనేది ఈ చిత్ర కథ’’ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సిద్ధం నరేష్, సంగీతం: మార్కస్ ఎం.


మహానటులు సినిమా పోస్టర్



టాప్ సీడ్ స్వియాటెక్‌కు చుక్కెదురు

నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) పోరాటం ముగిసింది. కెనడాలోని మాంట్రియల్‌లో జరుగుతున్న ఈ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో స్వియాటెక్ 2-6, 7-6 (7/4), 4-6తో ప్రపంచ మూడో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 30 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పెగూలా ఆరు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను ఎనిమిదిసార్లు కోల్పోయిన పెగూలా ప్రత్యర్థి సర్వీస్‌ను 11 సార్లు బ్రేక్ చేసింది.

రొనాల్డో ఖాతాలో మరో ట్రోఫీ

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో రెండేళ్ల తర్వాత తన ప్రొఫెషనల్ కెరీర్‌లో మరో ట్రోఫీని అందుకున్నాడు. తొలిసారి ఆసియాకు చెందిన అల్ నాసర్ క్లబ్ (సౌదీ అరేబియా) తరఫున బరిలోకి దిగిన రొనాల్డో తన జట్టును అరబ్ క్లబ్ చాంపియన్స్ కప్‌లో విజేతగా నిలిపాడు. అల్ హిలాల్ క్లబ్‌తో జరిగిన ఫైనల్లో రొనాల్డో కెప్టెన్సీలోని అల్ నాసర్ జట్టు 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. రొనాల్డో రెండు గోల్స్ (74వ, 98వ ని.లో) చేశాడు.









క్వార్టర్స్‌లో అర్జున్, గుకేశ్, ప్రజ్ఞానంద

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద తమ ప్రత్యర్థులపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అర్జున్ 1.5-0.5తో నిల్స్ గ్రాండెలియస్ (స్వీడన్)పై, ప్రజ్ఞానంద 1.5-0.5తో ఫెరెంక్ బెర్కెస్ (హంగేరి)పై, గుకేశ్ 1.5-0.5తో హావో వాంగ్ (చైనా)పై గెలుపొందారు. క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో గుకేశ్; ప్రజ్ఞానందతో అర్జున్ తలపడతారు. శనివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్ తొలి గేముల్లో నెగ్గిన అర్జున్, గుకేశ్ ఆదివారం జరిగిన రెండో గేమ్‌లను 'డ్రా' చేసుకొని... ప్రజ్ఞానంద 49 ఎత్తుల్లో గెలుపొంది క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. నిపోమ్‌నిషి (రష్యా)తో జరుగుతున్న మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో గేమ్‌ను కూడా విదిత్ (భారత్) 'డ్రా' చేసుకోవడంతో ఇద్దరూ 1-1తో సమఉజ్జీగా ఉన్నారు. వీరిద్దరి మధ్య నేడు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ నిర్వహించి విజేతను నిర్ణయిస్తారు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక కూడా నేడు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు ఆడనుంది. హారిక-అలెగ్జాండ్రా గోర్యాచ్‌కినా (రష్యా)తో క్వార్టర్ ఫైనల్లో రెండు గేమ్‌లు ముగిశాక ఇద్దరూ 1-1తో సమంగా నిలిచారు. దాంతో నేడు టైబ్రేక్ అనివార్యమైంది.

మూడో ర్యాంక్‌లో భారత హాకీ జట్టు



ఎఫ్‌ఐహెచ్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: స్వదేశంలో తొలిసారి జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన భారత పురుషుల జట్టు ర్యాంక్ కూడా మెరుగైంది. ఆదివారం విడుదల చేసిన అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) తాజా ర్యాంకింగ్స్‌లో భారత జట్టు ఒక స్థానం పురోగతి సాధించి నాలుగు నుంచి మూడో ర్యాంక్‌కు ఎగబాకింది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు ఖాతాలో 2771.35 పాయింట్లు ఉన్నాయి. 2021 తర్వాత భారత జట్టు మరోసారి మూడో ర్యాంక్‌లో నిలిచింది. 2021లో టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత భారత జట్టు మూడో ర్యాంక్‌కు చేరింది. నెదర్లాండ్స్ జట్టు 3095.90 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, 2917.87 పాయింట్లతో బెల్జియం రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. ఇంగ్లండ్ మూడు నుంచి నాలుగో స్థానానికి చేరగా... జర్మనీ, ఆస్ట్రేలియా వరుసగా ఐదు, ఆరో ర్యాంక్‌ల్లో ఉన్నాయి. తొలిసారి ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో రన్నరప్‌గా నిలిచిన మలేసియా జట్టు తొమ్మిదో స్థానంలో ఉంది.

హాకీ ఇండియా నజరానా

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ విజేత భారత జట్టుకు హాకీ ఇండియా నజరానా ప్రకటించింది. జట్టులోని ప్రతి సభ్యుడికి రూ. 3 లక్షల చొప్పున... శిక్షణ బృందంలోని ప్రతి సభ్యుడికి రూ. లక్షా 50 వేల చొప్పున నగదు పురస్కారం అందజేస్తారు.

సిరీస్ సమర్పయామి

- చివరి టి20 మ్యాచ్‌లో భారత్ పరాజయం
- 8 వికెట్లతో నెగ్గిన వెస్టిండీస్
- సిరీస్‌ను 3-2తో సొంతం చేసుకున్న కరీబియన్ జట్టు

లాడెర్‌హిల్ (ఫ్లోరిడా): బ్యాటింగ్‌కు స్వర్గధామమైన పిచ్‌పై బ్యాటర్ల నిర్లక్ష్యం, పసలేని బౌలింగ్‌తో భారత్ కరీబియన్ పర్యటనను నిరాశతో ముగించింది. టెస్టు, వన్డే సిరీస్‌లను సొంతం చేసుకున్న భారత జట్టు టి20 సిరీస్‌ను మాత్రం కోల్పోయింది. చివరిదైన ఐదో టి20 మ్యాచ్‌లో టీమిండియా ఎనిమిది వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఈ గెలుపుతో వెస్టిండీస్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2తో చేజిక్కించుకుంది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. తిలక్ వర్మ (18 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కాసేపు మెరిపిస్తే... సూర్యకుమార్ (45 బంతుల్లో 61; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) నడిపించాడు. విండీస్ సీమర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (4/31) భారత్ జోరుకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన వెస్టిండీస్ 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసి గెలిచింది. బ్రాండన్ కింగ్ (55 బంతుల్లో 85 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (35 బంతుల్లో 47; 1 ఫోర్, 4 సిక్సర్లు) చెలరేగారు.

ఆదుకున్న సూర్య

టాస్ నెగ్గిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ తీరా బ్యాటింగ్‌కు దిగగానే కష్టాలు ఎదురయ్యాయి. హొసీన్ వరుస ఓవర్లలో ఓపెనర్లు యశస్వి (5), గిల్ (9) వికెట్లను పడేశాడు. ఈ దశలో సూర్యకుమార్‌కు జతయిన తిలక్ వర్మ ధనాధన్ ఆటాడాడు. కానీ కాసేపట్లోనే చేజ్ అతని మెరుపులకు రిటర్న్ క్యాచ్‌తో ముగింపు పలికాడు. సంజూ సామ్సన్ (13) నిరాశపరచగా, తనశైలి షాట్లతో సూర్యకుమార్ జట్టును ఆదుకున్నాడు. భారీ సిక్సర్‌తో సూర్య ఫిఫ్టీ 38 బంతుల్లో పూర్తయ్యింది. అయితే వానొచ్చి కాసేపు ఆటను ఆపేసింది. తర్వాత ఆట మొదలవగానే కెప్టెన్ హార్దిక్ పాండ్యా (18 బంతుల్లో 14; 1 సిక్స్) షెఫర్డ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాన్‌లో హోల్డర్ చేతికి చిక్కాడు. తర్వాత సూర్యకుమార్‌ను హోల్డర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. యార్కర్ లెంత్ బాల్ నేరుగా వికెట్ల ముందున్న అతని ప్యాడ్లకు తగిలినా... ఫీల్డ్ అంపైర్ అప్పీల్‌ను తోసిపుచ్చాడు. బంతి గమనం ఇన్‌లైన్‌లో ఉండటంతో విండీస్ డీఆర్‌ఎస్‌కు వెళ్లి ఫలితాన్ని రాబట్టింది. సరిగ్గా ఇలాగే మరో రివ్యూ (డీఆర్‌ఎస్)తో కుల్దీప్ (0) వికెట్‌ను షెఫర్డ్ దక్కించుకున్నాడు. భారత్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఇంకో రెండు బంతులు ఉండగా మళ్లీ వర్షమొచ్చి ఆగినా... వెంటనే మొదలైంది. కానీ అక్షర్ పటేల్ (10 బంతుల్లో 13; 1 సిక్స్) అవుట్ కాగా ఆఖరి బంతిని ముకేశ్ కీపర్ తలపైనుంచి బౌండరీకి తరలించాడు.



భారత కెప్టెన్ హార్దిక్ పాండ్యా

కింగ్, పూరన్‌ల జోరుతో

లక్ష్యఛేదనకు దిగగానే అర్ష్‌దీప్ సింగ్ ఓపెనర్ మేయర్స్ వికెట్‌ను పడగొట్టడంతో భారత్ సంబరమైతే చేసుకుంది. కానీ ఈ ఆనందం అంతటితోనే ఆవిరైంది. మరో ఓపెనర్ బ్రాండన్ కింగ్, నికోలస్ పూరన్ స్కోరు బోర్డును భారీ సిక్సర్లు, బౌండరీలతో పరుగు పెట్టించారు. పేస్, స్పిన్ ఇలా ఎవరు వేసినా రన్‌రేట్ మాత్రం ఓవర్‌కు 9 పరుగుల చొప్పున దూసుకెళ్లింది. హిట్టర్లు ఇద్దరూ పాతుకుపోవడంతో వికెట్ పడగొట్టడం భారత బౌలర్ల వల్ల కాలేకపోయింది. వర్షం మళ్లీ చికాకు పెట్టినా విరామం తర్వాత మొదలైంది. పూరన్‌ను తిలక్ వర్మ బోల్తా కొట్టించాడు. కానీ మిగతా లాంఛనాన్ని 38 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్న కింగ్, షై హోప్ (13 బంతుల్లో 22 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) పూర్తి చేశారు. పాండ్యా ఏకంగా 8 మందిని బౌలింగ్‌కు దించినా 2 వికెట్లనే పడగొట్టగలిగాడు.



షెఫర్డ్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి అండ్ బి) హొసీన్ 5; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హొసీన్ 9; సూర్యకుమార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హోల్డర్ 61; తిలక్‌వర్మ (సి అండ్ బి) చేజ్ 27; సామ్సన్ (సి) పూరన్ (బి) షెఫర్డ్ 13; పాండ్యా (సి) హోల్డర్ (బి) షెఫర్డ్ 14; అక్షర్ (సి) షెఫర్డ్ (బి) హోల్డర్ 13; అర్ష్‌దీప్ (బి) షెఫర్డ్ 8; కుల్దీప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షెఫర్డ్ 0; చహల్ (నాటౌట్) 0; ముకేశ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 165. వికెట్ల పతనం: 1-6, 2-17, 3-66, 4-87, 5-130, 6-140, 7-149, 8-149, 9-161. బౌలింగ్: అకిల్ హొసీన్ 4-0-24-2, మేయర్స్ 1-0-4-0, హోల్డర్ 4-0-36-2, జోసెఫ్ 3-0-41-0, చేజ్ 4-0-25-1, షెఫర్డ్ 4-0-31-4.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (నాటౌట్) 85; మేయర్స్ (సి) యశస్వి (బి) అర్ష్‌దీప్ 10; పూరన్ (సి) పాండ్యా (బి) తిలక్ వర్మ 47; షై హోప్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 7. మొత్తం (18 ఓవర్లలో 2 వికెట్లకు) 171. వికెట్ల పతనం: 1-12, 2-119. బౌలింగ్: పాండ్యా 3-0-32-0, అర్ష్‌దీప్ 2-0-20-1, కుల్దీప్ 4-0-18-0, చహల్ 4-0-51-0, ముకేశ్ 1-0-10-0, తిలక్ వర్మ 2-0-17-1, అక్షర్ 1-0-8-0, యశస్వి 1-0-11-0



పృథ్వీ షా మెరుపు శతకం

76 బంతుల్లో 15 ఫోర్లు, 7 సిక్స్‌లతో 125 నాటౌట్

చెస్టర్ లీ స్ట్రీట్: ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో నార్తంప్టన్‌షైర్ క్లబ్ తరఫున భారత యువ క్రికెటర్ పృథ్వీ షా విధ్వంసకర ప్రదర్శన కొనసాగుతోంది. వన్-డే కప్ టోర్నీలో గతవారం సోమర్‌సెట్‌తో జరిగిన మ్యాచ్‌లో డబుల్ సెంచరీ (244) సాధించిన 23 ఏళ్ల పృథ్వీ షా... డర్హమ్ క్లబ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మెరుపు శతకం చేశాడు. 76 బంతులు ఆడిన పృథ్వీ షా 15 ఫోర్లు, 7 సిక్స్‌లతో 125 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. పృథ్వీ షా సెంచరీతో నార్తంప్టన్‌షైర్ జట్టు 146 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా డర్హమ్ జట్టు 43.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. అనంతరం నార్తంప్టన్‌షైర్ 25.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి విజయం సాధించింది.



శ్రీవారి సేవలో రోహిత్ శర్మ

సాక్షి, తిరుమల: భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఆదివారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నాడు. రోహిత్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

హైదరాబాద్‌లోని ఏపీ కాలేజ్ ఆఫ్ జర్నలిజం.. ప్రభుత్వ గుర్తింపు పొందిన వివిధ జర్నలిజం కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తోంది.

కోర్సుల వివరాలు

- **పీజీ డిప్లొమా ఇన్ జర్నలిజం (పీజీడీజే):** కోర్సు వ్యవధి 12 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
- **డిప్లొమా ఇన్ జర్నలిజం(డీజే):** కోర్సు వ్యవధి 6 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
- **డిప్లొమా ఇన్ టీవీ జర్నలిజం(డీటీవీజే):** కోర్సు వ్యవధి 6 నెలలు. కనీస విద్యార్హత డిగ్రీ.
- **సర్టిఫికెట్ కోర్సు ఆఫ్ జర్నలిజం(సీజే):** కోర్సు వ్యవధి 3 నెలలు. కనీస విద్యార్హత ఎస్ఎస్‌సీ.

ప్రవేశం ఇలా

ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ కోర్సుల్ని రెగ్యులర్‌గానూ, కరస్పాండెన్స్(దూరవిద్య విధానం)లోనూ చేయవచ్చు. ఆన్‌లైన్ తరగతుల సౌకర్యం ఉంది. ఇంటి దగ్గర నుంచే పాఠ్యాంశాలను లైవ్‌లో వినవచ్చు. తెలుగు లేదా ఇంగ్లిష్ బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- ప్రాస్పెక్టస్, దరఖాస్తు ఫారం పొందటానికి చివరి తేది: 21.08.2023
- అడ్మిషన్లు పొందటానికి చివరి తేది: 02.09.2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apcj.in

సదరన్ రైల్వేలో 790 పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) సదరన్ రైల్వేలో పనిచేసేందుకు జనరల్ డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 790
- **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్, అసిస్టెంట్ లోకో పైలట్, టెక్నీషియన్ గ్రేడ్-1, గ్రేడ్-3-గార్డ్/ట్రైన్ మేనేజర్.
- **విభాగాలు:** డీజిల్, సిగ్నల్, వెల్డర్, కార్పెంటర్, మాసన్, ప్లంబర్,ఎలక్ట్రికల్ పవర్ తదితరాలు.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో మెట్రిక్యులేషన్ /ఎస్ఎస్ఎల్‌సీ/ఐటీఐ/ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 42 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** జనరల్ డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.08.2023
- **వెబ్‌సైట్:** www.rrcmas.in

టీచర్ కెరీర్‌కు మార్గం.. టెట్!

- టీఎస్ టెట్-2023 ప్రక్రియ ప్రారంభం
- పేపర్-1, 2లుగా టెట్ నిర్వహణ
- డీఈడీ, బీఈడీ అర్హతగా పోటీ పడే అవకాశం
- ఈ నెల 16వరకు దరఖాస్తు అవకాశం

టీచర్ ఎలిజిబిటీ టెస్ట్..సంక్షిప్తంగా టెట్! ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టాలనుకునే అభ్యర్థులకు ఈ పరీక్ష ఎంతో కీలకం. ఇందులో అర్హత సాధిస్తేనే.. సర్కారీ స్కూల్స్‌లో టీచర్ కొలువు లభిస్తుంది. అందుకే టెట్‌లో రాణించేందుకు బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు కృషి చేస్తుంటారు. వీరంతా ఇప్పుడు తమ కసరత్తును మరింత ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. తెలంగాణలో ఇటీవల టెట్ నోటిఫికేషన్ వెలువడడమే!! ఈ నేపథ్యంలో.. టెట్‌తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టాలనుకుంటే.. టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. టెట్ నోటిఫికేషన్ వెలువడిందంటే..రానున్న రోజుల్లో డీఎస్సీ నియామకాలు ఉంటాయని అంచనా. బీఈడీ,డీఈడీ అభ్యర్థులు టెట్‌లో రాణించేందుకు కృషి చేస్తే..అదే ప్రిపరేషన్‌తో భవిష్యత్తులో నిర్వహించే టీచర్ నియామక పరీక్షల్లోనూ విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు.

రెండు పేపర్లుగా టెట్

- తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం-టెట్ పరీక్షను పేపర్-1, పేపర్-2 పేరిట రెండు పేపర్లుగా నిర్వహించనున్నారు.
- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు టెట్ పేపర్-1కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించడానికి టెట్ పేపర్-2లో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది.

టెట్ పేపర్-1 అర్హతలు

- ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణత సాధించాలి.
- 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు బీఈడీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణులవ్వాలి.
- డిసెంబర్ 23, 2015లోపు డీఈడీ, బీఈడీ, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసుకుంటే.. ఇంటర్మీడియెట్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సరిపోతుంది.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు ఉత్తీర్ణత మార్కుల్లో అయిదు శాతం మినహాయింపు ఇస్తారు.

టెట్ పేపర్-2 అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు బీఈడీ లేదా బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పాసవ్వాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.
- లాంగ్వేజ్ పండిట్ కోర్సులకు సంబంధించి నిర్దేశిత లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా సంబంధిత లాంగ్వేజ్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉత్తీర్ణులవ్వాలి. లేదా సంబంధిత సబ్జెక్ట్ సాహిత్యంలో బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీ పాసవ్వాలి. వీటితోపాటు నిర్దేశిత లాంగ్వేజ్‌లో లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్/సంబంధిత లాంగ్వేజ్ మెథడాలజీలో బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.



టీఎస్ టెట్ 2023

పేపర్-1.. 150 మార్కులు

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించేందుకు అర్హతగా పేర్కొన్న టెట్ పేపర్-1ను 150 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో ప్రశ్నలు అడుగుతారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్ 2(ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30 మార్కులు, గణితం 30 ప్రశ్నలు-30 మార్కులు, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు-30 మార్కులకు.. ఇలా మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- పరీక్షలో రెండో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్-1 సబ్జెక్ట్ విషయంలో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠి, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు. అభ్యర్థులు ఎంచుకున్న లాంగ్వేజ్‌ను పదో తరగతిలో ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి.
- మూడో విభాగంగా పేర్కొన్న లాంగ్వేజ్-2(ఇంగ్లిష్)కు సంబంధించి అభ్యర్థులందరికీ ఈ విభాగం ఉంటుంది.

పేపర్-2 కూడా 150 మార్కులు

- సంబంధిత సబ్జెక్ట్‌లలో స్కూల్ అసిస్టెంట్ పోస్ట్‌లకు అర్హతగా నిర్దేశించిన టెట్ పేపర్-2ను కూడా 150 మార్కులకు నిర్వహిస్తారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు-30 మార్కులు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు-30మార్కులు, సంబంధిత సబ్జెక్ట్ 60 ప్రశ్నలు-60 మార్కులకు.. ఇలా మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- రెండో విభాగం లాంగ్వేజ్-1లో అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం, సంస్కృతం సబ్జెక్ట్‌లను పదో తరగతి వరకు ఫస్ట్ లాంగ్వేజ్‌గా చదివుండాలి.
- నాలుగో విభాగంగా ఉన్న సంబంధిత సబ్జెక్ట్‌లో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాలి.
- సబ్జెక్ట్ పేపర్‌కు సంబంధించి కంటెంట్ నుంచి 24 ప్రశ్నలు, పెడగాజీ నుంచి ఆరు ప్రశ్నలు చొప్పున ప్రతి సబ్జెక్ట్ విభాగం నుంచి అడుగుతారు.
- సైన్స్ సబ్జెక్ట్‌లో ఫిజికల్ సైన్స్ నుంచి 12, బయలాజికల్ సైన్స్ నుంచి 12 చొప్పున కంటెంట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. మిగతా ఆరు ప్రశ్నలు సైన్స్ పెడగాజీ నుంచి అడుగుతారు.
- సోషల్ విభాగంలో హిస్టరీ, జాగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్‌ల నుంచి 48 కంటెంట్ ప్రశ్నలు, 12 పెడగాజి ప్రశ్నలు అడుగుతారు.
- ఈ సబ్జెక్ట్ విభాగం విషయంలో.. రెండు అర్హతలు ఉన్న వారు తమకు ఆసక్తి ఉన్న విభాగంలో పరీక్ష రాసే అవకాశం అందుబాటులో ఉంది.
- రెండు పేపర్లలో ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్షకు లభించే సమయం రెండున్నర గంటలు.

60 శాతం మార్కులు సాధిస్తేనే

టెట్ పేపర్-1, పేపర్-2లలో కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులు(90 మార్కులు) సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో(70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో (60 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. ఈ మార్కులు సాధించిన వారికే టెట్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 16.08.2023
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** సెప్టెంబర్ 9 నుంచి
- **టెట్ తేదీ:** సెప్టెంబర్ 15 (పేపర్-1 : ఉదయం 9:30 నుంచి 12:00 వరకు; పేపర్-2: మధ్యాహ్నం 2:30 నుంచి 5:00 వరకు)
- **ఫలితాల వెల్లడి:** సెప్టెంబర్ 27, 2023
- **వెబ్‌సైట్:** https://tstet.cgg.gov.in

మంచి మార్కులకు మార్గాలివే

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ

రెండు పేపర్లలోనూ మొదటి విభాగం చైల్డ్ డెవలప్‌మెంట్, పెడగాజీ. ఇందులో బోధన, అభ్యసనానికి సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. ప్రధానంగా శిశువు సైకాలజీ సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. పెడగాజీలో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం -నాయకత్వం -గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి.

లాంగ్వేజ్-1, 2కు ఇలా

భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతోపాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సిద్ధం కావాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్,అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్-1లో ఉండే ఈ సబ్జెక్ట్‌లలో మంచి మార్కుల కోసం అభ్యర్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. 30 ప్రశ్నల్లో 24 ప్రశ్నలు కంటెంట్ నుంచి ఉంటే.. 6 ప్రశ్నలు పెడగాజిపై అడుగుతారు. ఇక పేపర్-2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు ఉంటాయి. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలోనే ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, తెలంగాణ నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు తెలంగాణ ప్రాధాన్యమున్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం లాభిస్తుంది.

- సైన్స్: టెట్ పేపర్-2లో సైన్స్ సబ్జెక్ట్ అభ్యర్థులు మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్.. సక్సెస్ ఇలా

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదవాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్‌ను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

మెథడాలజీ

ఇందులో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్-1, పేపర్-2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

ఇప్పటి నుంచి అడుగులు వేస్తే

- టెట్-2023ను సెప్టెంబర్ 15న నిర్వహించనున్నారు. అంటే.. నెల రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. ప్రస్తుత సమయంలో అభ్యర్థులు గత ప్రశ్నపత్రాల ఆధారంగా ఇంగ్లిష్, తెలుగు, పెడగాజి విభాగాన్ని అధ్యయనం చేసి బిట్స్ ప్రాక్టీస్ చేయాలి. కంటెంట్ విభాగంలో పేపర్-1 రాసే అభ్యర్థులు మూడు నుంచి అయిదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలను రివిజన్ చేయాలి.
- పేపర్-2 అభ్యర్థులు 6, 7, 8 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని కీలకాంశాలను చదవాలి. కంటెంట్‌కు సంబంధించి ఎక్కువగా సమాచార ఆధారిత ప్రశ్నలే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతోపాటు ప్రస్తుతం అభ్యర్థులు వీలైనన్ని మోడల్ పేపర్లను సేకరించి, సాధన చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	366	65,323
నిఫ్టీ ▽	115	19,428

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,645	▽	76
డోజోన్స్	35,281	△	105
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,524	▽	94
డాక్స్	15,832	▽	124
షాంఘై	3,189	▽	65
నికాయ్ (గురువారం ముగింపు)	32,474	▽	269

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఖరీదైనా.. రెండు గజాలు!



- నచ్చిన ప్రాపర్టీ తక్కువ ధరకే..
- కోరుకున్న చోట సొంతం చేసుకోవచ్చు
- స్వల్ప వాటాకు యజమాని కావచ్చు
- ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌కు ఆదరణ
- వీటి కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు
- సులభంగా కొనుగోలు, విక్రయాలు

అదొక మెట్రోపాలిటన్ సిటీ. ప్రముఖ వాణిజ్య ప్రాంతం. అక్కడ ప్రాపర్టీ కొనాలంటే కనీసం రూ.20 కోట్లు అయినా ఉండాల్సిందే. కానీ అంత ఖరీదైన ప్రాపర్టీని సొంతం చేసుకోవాలంటే ఎగువ మధ్య తరగతి వారి వల్ల కూడా అయ్యే పని కాదు. అయినా సరే ఆ ప్రాపర్టీకి యజమాని కావాలనే కోరిక బలంగా ఉంది. ఇందుకు ఉన్న మార్గం ఏంటి..? నిజమే అంత భారీ పెట్టుబడి లేకపోవచ్చు. చేతిలో కొద్ది మొత్తమే ఉన్నా, అదే ప్రాపర్టీకి యజమానిగా మారిపోగల అవకాశం ఉంది. అదే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్. తమకు బాగా నచ్చిన ప్రాపర్టీలో ఒక శాతం వాటాను తక్కువకే సొంతం చేసుకోవచ్చు. మధ్యతరగతి వాసులను సైతం ప్రాపర్టీ యజమానులను మార్చేదే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్. ఈ సాధనం గురించి తెలియజేసే కథనమే ఇది.

అసలు ఏంటి ఇది..? పాక్షిక అని పేరులోనే ఉంది. రియల్ ఎస్టేట్‌లో స్వల్ప వాటా. ఈ విధానంలో మీరు పెట్టుబడి పెట్టే మొత్తానికి తగ్గ వాటా మీ సొంతం అవుతుంది. అంటే ఒక ప్రాపర్టీకి అచ్చమైన యజమాని కాలేరు. ఆ ప్రాపర్టీకి ఎంతో మంది యజమానుల్లో మీరు కూడా ఒకరు అవుతారు. ఈక్విటీల గురించి తెలిసే ఉంటుంది. లిస్టెడ్ కంపెనీ మూలధనంలో ప్రమోటర్ల వాటా గరిష్ఠంగా 75 శాతమే ఉంటుంది. మిగిలినది పబ్లిక్ షేర్ హోల్డర్ల చేతుల్లో ఉంటుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లు. ఒక్క షేరు ధర సుమారు రూ.2,500. కేవలం రూ.2,500 పెట్టి ఒక్క షేరు కొనుగోలు చేసినా ఆ కంపెనీ వాటాదారుగా మారతారు. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ కూడా ఇదే మాదిరి ఉంటుంది. పాక్షిక రియల్ ఎస్టేట్‌కు ఇప్పుడు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. స్వల్ప వాటాలు తీసుకునేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి ప్రధాన ప్రేరణ టికెట్ సైజు (పెట్టుబడి పరిమాణం) చిన్నగా ఉండడమే అని చెప్పుకోవాలి. పైగా కొద్ది మొత్తానికే నాణ్యమైన రియల్ ఎస్టేట్ వాటా వస్తుండడం ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ ఆదరణ పెరుగుతుండటం గమనార్హం.

హైదరాబాద్‌లో ఎక్కడ..?

దేశవ్యాప్తంగా ఎన్నో పట్టణాలకు సంబంధించి ఫ్రాక్షనల్ ప్రాపర్టీ లావాదేవీలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలో ఓ ప్రాపర్టీ ఆఫర్ విలువ రూ.46,60,00,000.



దీని ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్/ఐఆర్ఆర్ (యాజమాన్య నిర్వహణ సమయంలో అంతర్గత రాబడి రేటు) 13.5 శాతంగా ఉంది. స్థూల ఈల్డ్ (వార్షిక అద్దె రాబడి) 8.9 శాతంగా ఉంది. అలాగే మహారాష్ట్రలోని గోరేగావ్‌లో (ఈజోన్ అపార్చునిటీ) రూ.33,60,00,000 విలువ చేసే ప్రాపర్టీకి సంబంధించి డీల్‌లో.. ఐఆర్ఆర్ 13.4 శాతంగా ఉంటే, గ్రాస్ ఎంట్రీ ఈల్డ్ 9.6 శాతంగా ఉంది. సాధారణంగా రియల్ ఎస్టేట్‌లో 10 శాతానికి పైన ఐఆర్ఆర్ ఉంటే దాన్ని మెరుగైనదిగా పరిగణిస్తారు. 18–20 శాతంగా ఉంటే అత్యుత్తమంగా భావిస్తారు. ఐఆర్ఆర్ 5% కంటే తక్కువ ఉంటే అది లాభసాటి కాదు.

నిర్వహణ సులభతరం

ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లో ఉన్న సౌలభ్యం నిర్వహణ అని చెప్పుకోవాలి. అద్దె వసూలు, ప్రాపర్టీ నిర్మాణం, విక్రయం, పన్నుల చెల్లింపుల ఇవన్నీ ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లే చూస్తాయి. దీంతో ఇన్వెస్టర్‌పై నిర్వహణ భారం పడదు. ప్రాపర్టీ డాక్యుమెంట్లు పట్టుకుని ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం ఏర్పడదు.

సెబీ నియంత్రణ లేదు

గత కొన్నేళ్లలో ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ పరిశ్రమలోకి ఎన్నో ప్లాట్‌ఫామ్‌లు వచ్చాయి. ఈ ప్లాట్‌ఫామ్‌ల లావాదేవీల పరంగా ఓ ప్రామాణిక విధానం, ప్రక్రియ, మార్గదర్శకాలు, నియంత్రణలు అంటూ లేవు.



ఇన్వెస్టర్లకు సమగ్రంగా అన్ని వివరాలు వెల్లడిస్తున్నాయా? లావాదేవీల నిర్వహణ చట్టబద్ధంగానే ఉందా? అని చూసే వారు లేరు. అందుకే ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణకు సంబంధించి చర్చా పత్రాన్ని సెబీ విడుదల చేసింది. రానున్న రోజుల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్) నియంత్రణల పరిధిలోకి తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే ఈ మార్కెట్లో లావాదేవీలకు రక్షణలు ఏర్పడతాయి. ఇన్వెస్టర్ల హక్కులు, ప్రయోజనాలకు భరోసా ఉంటుంది. అయితే ఇందుకు ఎంత కాలం పడుతుంది? అన్నది ఇప్పటికైతే స్పష్టత లేదు.

ఎలా పనిచేస్తుంది..?

సాంకేతికంగా చెప్పుకోవాలంటే.. మీరు, మీ స్నేహితులతో కలిసి 5–10 మంది ఒక గ్రూప్‌గా ఏర్పడి ప్రాపర్టీని కొనుగోలు చేసుకోవచ్చు. కానీ ఆచరణలో ఇది అందరికీ సాధ్యం కాదు. అందరి మధ్య సఖ్యత లేదా ఏకాభిప్రాయం ఉండకపోవచ్చు.



న్యాయపరమైన చిక్కులు ఏర్పడితే ప్రాపర్టీ సంగతేమో కానీ, తమ హక్కుల కోసం కోర్టు చుట్టూ తిరగాల్సి రావచ్చు. అందుకే ఈ పాక్షిక రియల్ ఎస్టేట్‌ను సాకారం చేసేందుకు పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇన్వెస్టర్లు స్వల్ప పెట్టుబడితో ప్రాపర్టీలో పాక్షిక వాటా కొనుగోలుకు ఇవి అవకాశం కల్పిస్తాయి. ఇలా ఒకరితో ఒకరు పొత్తు లేకపోయినా, అందరూ కలసి ఒక ప్రాపర్టీకి ఉమ్మడి యజమానులుగా మారిపోయేందుకు పలు ప్లాట్‌ఫామ్‌లు వేదికగా నిలుస్తున్నాయి. ఈ తరహా సేవలు అందించే పోర్టళ్లను 'ఎఫ్‌వోపీ' లేదా ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్ అని పిలుస్తారు. గడిచిన కొన్నేళ్ల కాలంలో ఇలాంటివి పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. ఇన్వెస్టర్ల తరఫున క్లిష్టమైన ప్రాపర్టీ కొనుగోలు, దానికి సంబంధించిన ఇతర పనులను ఇవి చక్కబెడతాయి. దాంతో కొనుగోలు, విక్రయం ఎంతో సులభంగా, సౌకర్యంగా ఉంటుంది. ప్రాపర్టీ పరిశోధన, కొనుగోలు, అమ్మకం, డాక్యుమెంటేషన్, న్యాయపరమైన అంశాలు, అద్దె వసూలు, ఆ అద్దెను యజమానులకు పంపిణీ చేయడం తదితర సేవలను ఈ ప్లాట్‌ఫామ్‌లు అందిస్తాయి. వీటి సాయం లేకుండా ఇన్వెస్టర్లు ఒక సమూహంగా ఏర్పడి ఇలాంటి కార్యకలాపాలు అన్నింటినీ సొంతంగా నిర్వహించుకోవడం సులభం కాదు. అందుకే ఈ ప్లాట్‌ఫామ్ సేవలకు ఆదరణ పెరుగుతోంది.

ఎలాంటి ప్రాపర్టీలు..?

ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లో అధిక శాతం లావాదేవీలు వాణిజ్య రియల్ ఎస్టేట్‌లోనే ఉన్నాయి. ఎందుకంటే వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో వృద్ధి ఎక్కువగా ఉంటుంది. పైగా పెట్టుబడి వృద్ధికి తోడు, వాణిజ్య రియల్ ఎస్టేట్ నుంచి రెంటల్ రూపంలో ఆదాయం క్రమం తప్పకుండా వస్తుండడం మరో ఆకర్షణగా చెప్పుకోవచ్చు. అందుకే వాణిజ్య ప్రాపర్టీల ధరలు చాలా ఖరీదుగా ఉంటాయి. వీటి విలువ సాధారణంగా రూ.20 కోట్ల నుంచి రూ.500 కోట్ల మధ్య ఉంటుంది. అందుకే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. పైగా వాణిజ్య ప్రాపర్టీల్లో రిటైల్ ఇన్వెస్టర్ నేరుగా పెట్టుబడి పెట్టడం సాధ్యపడదు. ఈ ప్లాట్‌ఫామ్‌లు దీన్ని సాధ్యం చేస్తున్నాయి. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లో కనీసంగా ఒక టికెట్ సైజు (పెట్టుబడి పరిమాణం) విలువ రూ.10–25 లక్షల మధ్య ఉంటుంది. అందుకే రిటైల్ ఇన్వెస్టర్లు సైతం ఇందులో పెట్టుబడులకు ముందుకు వస్తున్నారు. ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ ప్లాట్‌ఫామ్‌లపై ప్రాపర్టీ వారీగా రాబడి రేటు, ధర తదితర వివరాలు అన్నీ ఉంటాయి.




లిక్విడిటీ మాటేమిటి?

రియల్ ఎస్టేట్‌లో ఉండే ప్రధాన సమస్య లిక్విడిటీయే. అవసరం వచ్చినప్పుడు విక్రయిద్దామంటే ఎక్కువ సందర్భాల్లో వెంటనే సాధ్యపడదు. విక్రయించే ప్రాపర్టీ, దాని ధర ఇతర అంశాలన్నింటినీ కొనుగోలుదారులు లోతుగా చూస్తారు. బేరసారాలు, విచారణలు అన్నీ అంగీకారం అయితేనే ప్రాపర్టీ లావాదేవీ పూర్తవుతుంది. కనుక కావాల్సినప్పుడు వెంటనే నగదుగా మార్చుకునే సౌలభ్యం సహజంగా రియల్టీలో తక్కువ. మీరు ఆశించే ధరకే విక్రయించాలని అనుకుంటే నెలల నుంచి సంవత్సరాల పాటు వేచి చూడాల్సి వస్తుంది. ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్‌లోనూ ఇదే అమలవుతుంది. కాకపోతే విడిగా ఓ ప్రాపర్టీ లావాదేవీతో పోలిస్తే ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్ టికెట్ సైజు తక్కువగా ఉంటుంది. కనుక లిక్విడిటీ కాస్తంత మెరుగు అని భావించొచ్చు. పాక్షిక ప్రాపర్టీ అయినా సరే, దాని అద్దె రాబడి ఏ మేరకు? ప్రాపర్టీ నాణ్యత మాటేమిటి? అనేది కొనుగోలు దారులు చూస్తారు. నాణ్యమైన ప్రాపర్టీ, అద్దె రాబడి మెరుగ్గా ఉంటే వేగంగా అమ్ముడుపోతుంది. లేదంటే చాలా కాలం పాటు అందులో పెట్టుబడి చిక్కుకుపోవచ్చు. పైగా ఇందులో కొనుగోలు చేసే ప్రాపర్టీ పెట్టుబడి దృష్ట్యానే తప్ప వినియోగం కోణంలో ఉండదు. అందుకని విక్రయించుకునేందుకు కొంత సమయం పట్టొచ్చు. టికెట్ సైజు తక్కువగా ఉండడం ఇందులో కాస్త అనుకూలతగా చెప్పుకోవచ్చు.

వైరుధ్యం ఇదీ..



	రీట్	ఫ్రాక్షనల్ రియల్ ఎస్టేట్
సెబీ నియంత్రణ	ఉంది	ప్రతిపాదన దశలో ఉంది
లిక్విడిటీ రిస్క్	లేదు	ఎక్కువ
వేదికలు	స్టాక్ ఎక్స్ఛేంజీలు	ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు
అందుబాటు	తక్కువ సాధనాలు	ఎక్కువ డీల్స్
వైవిధ్యం	చాలా ఎక్కువ. ఒక రీట్ ఎన్నో ప్రాపర్టీల్లో పెట్టుబడులు కలిగి ఉంటుంది.	వైవిధ్యం ఉండదు. ఒకే ప్రాపర్టీలో కొంత వాటాకు యజమాని అవుతారు.
కనీస టికెట్ సైజు	రీట్ స్టాక్ ఎక్ఛేంజ్‌ల్లో షేర్ల మాదిరి ట్రేడ్ అవుతాయి. రూ.100 నుంచి పెట్టుబడి పెట్టుకోవచ్చు.	కనీస టికెట్‌సైజు రూ.10 లక్షలు
ఎలాంటి ప్రాపర్టీలు	రీట్ నిర్వహణలో 80 శాతం పెట్టుబడులు రాబడి వచ్చే ప్రాపర్టీల్లోనే ఉంటాయి.	నిర్మాణంలో ఉన్నవి లేదా నిర్మాణం పూర్తయినవి ఉండొచ్చు.



జోయాలుక్కాస్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్

హైదరాబాద్: భారతదేశ 76వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జోయాలుక్కాస్ గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్ ప్రకటించింది. పాత బంగారం మార్పిడి ద్వారా ప్రస్తుత బంగారం రేటు కంటే రూ.76 ఎక్కువగా ప్రతి గ్రాముపై గ్యారెంటీగా పొందవచ్చు. వజ్రాలపై 25% తగ్గింపు అందిస్తుంది. అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌లలో ఈ ఎక్స్ఛేంజ్ ఆఫర్ ఆగస్ట్ 15 వరకు అందుబాటులో ఉంటుంది. కస్టమర్లందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను వినియోగించుకోవాలని సంస్థ ఎండీ జాయ్ ఆలుక్కాస్ కోరారు.

మరోసారి రిలయన్స్ 'డిజిటల్ ఇండియా సేల్'



హైదరాబాద్: రిలయన్స్ డిజిటల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరోసారి 'డిజిటల్ ఇండియా సేల్' ఆఫర్‌ను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌ఫోన్లు, యాపిల్ ఎయిర్‌ప్యాడ్స్, వాషింగ్ మెషీన్లు, ఇతర గాడ్జెట్లను తక్కువ ధరకు విక్రయిస్తుంది. ఈ ఆగస్టు 15 వరకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ఆఫర్ అన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు వర్తిస్తుంది. రూ.5 వేల వరకు తక్షణ డిస్కౌంట్‌తో పాటు అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులపై పది శాతం రాయితీ వోచర్లు ఇస్తుంది. ఈ ఆఫర్లు రిలయన్స్ డిజిటల్ స్టోర్, మై జియో స్టోర్‌లో లభిస్తున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)


14-8-2023	
విశాఖ	470–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455–00
విజయవాడ	455–00
రిటైల్ ధర (డజను)	72.00
13-8-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

శ్రీరామ్ ఫైనాన్స్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

సాక్షి ప్లస్

ప్రస్తుత ధర: రూ. 1,807 టార్గెట్: రూ. 2,130

ఎందుకంటే: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం శ్రీరామ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. నిర్వహణలోని ఆస్తుల విలువ(ఏయూఎం) త్రైమాసికవారీగా 4 శాతం వృద్ధితో రూ. 1.93 లక్షల కోట్లను తాకింది. రుణ విడుదల వార్షికంగా 21 శాతం ఎగసి రూ. 30,500 కోట్లకు చేరడం ఇందుకు దోహదపడింది. ఈ కాలంలో అంచనాలకు మించి రూ. 4,440 కోట్ల నికర వడ్డీ ఆదాయం(ఎన్ఐఐ) ఆర్జించింది. త్రైమాసికవారీగా నికర వడ్డీ మార్జిన్లు మాత్రం 0.23 శాతం నీరసించి 8.3 శాతాన్ని తాకగా.. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) 1.5 శాతం మెరుగుపడి రూ. 3,130 కోట్లకు చేరింది. నిర్వహణ వ్యయాలు 4 శాతం తగ్గడం ఇందుకు సహకరించింది. రుణ వ్యయాలు(ఏయూఎంలో దాదాపు 2 శాతానికి సమానం) రూ. 880 కోట్లకు పరిమితంకావడం నికర లాభాల్లో 28 శాతం వృద్ధికి తోడ్పాటునిచ్చింది. వెరసి రూ. 1,680 కోట్ల నికర లాభం ఆర్జించింది. త్రైమాసికంవారీగా ఆస్తుల(రుణాలు) నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 0.17 శాతం తగ్గి 6.03 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.23 శాతం తగ్గి 2.96 శాతానికి చేరాయి. కంపెనీ వృద్ధిపై యాజమాన్యం ఇటీవల విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. జూలై–సెప్టెంబర్(క్యూ2) పనితీరు వెల్లడి తదుపరి మరోసారి కంపెనీ పనితీరు అంచనాలపై సమీక్షను చేపట్టనున్నట్లు తెలియజేసింది. డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో మిక్స్, దేశవ్యాప్త కార్యకలాపాలు వంటి అంశాలు కంపెనీకి ఆకర్షణను పెంచుతున్నాయి.



నజారా టెక్నాలజీస్ | ప్రభుదాస్ లీలాధర్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 674 టార్గెట్: రూ. 834

ఎందుకంటే: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీ నజారా టెక్ నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలను రెండేళ్ల కాలం(2023–24–2024–25)లో వరుసగా 8 శాతం, 4 శాతం చొప్పున హెచ్చిస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో కిడోపియా, యానిమల్ జామ్ విభాగాలు పటిష్ట పనితీరు చూపాయి. దీంతో వీటి మార్జిన్లపై అంచనాలు బలపడ్డాయి. ఏఅండ్‌పీ వ్యయాల అంచనాలను సవరిస్తున్నాం. ఈ ఏడాది క్యూ1లో నిర్వహణ నష్టాలు ప్రకటించినప్పటికీ పలు ఐపీలను ప్రవేశపెట్టనుండటం.. ఈస్పోర్ట్స్ అనుబంధ సంస్థ నాడ్విన్ బిజినెస్ రికవరీపై విశ్వాసాన్ని పెంచుతోంది. మొత్తంగా క్యూ1లో నజారా మిశ్రమ ఫలితాలను వెలువరించింది. ఆదాయం అంచనాలకంటే 10 శాతం తగ్గినప్పటికీ ఇబిటా మార్జిన్లు అంచనాలను మించుతూ 12 శాతానికి చేరాయి. పెద్ద క్లయింట్ చేజారడంతో యాడ్‌టెక్‌లో ఎదురవుతున్న సవాళ్లు, కిడోపియా సబ్‌స్క్రయిబర్ల సంఖ్య మందగించడం, రియల్ మనీ గేమింగ్‌లో పూర్తి బెట్ విలువపై 28 శాతం వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) విధింపు తదితర ప్రతికూలతల నేపథ్యంలోనూ బీజీఎంఐకు తిరిగి తెరతీయడం, స్పోర్ట్స్‌కీడా విభాగం జోరందుకోవడం సానుకూల అంశాలుగా పరిగణించవచ్చు. వెరసి రెండేళ్ల కాలంలో అమ్మకాలు వార్షికంగా 20 శాతం, నిర్వహణ లాభం మరింత అధికంగా 39 శాతం చొప్పున పురోగమించే అవకాశముంది. వీటికితోడు కంపెనీ వద్ద రూ. 620 కోట్ల నగదు నిల్వలున్నాయి. ఈ ఏడాది మే నెలలో నాడ్విన్ రూ. 230 కోట్లు సమకూర్చుకుంది. అంతేకాకుండా సమీప భవిష్యత్‌లో రూ. 750 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'ఎక్స్' ద్వారా వచ్చే ఆదాయానికి జీఎస్‌టీ వర్తింపు



న్యూఢిల్లీ: ప్రకటనల ఆదాయంలో వాటాల కింద సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్ (గతంలో ట్విట్టర్) నుంచి వ్యక్తులకు వచ్చే ఆదాయం కూడా జీఎస్‌టీ పరిధిలోకి వస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కంటెంట్ క్రియేషన్‌ను సర్వీసు కింద పరిగణిస్తారు, దాని ద్వారా వచ్చే ఆదాయంపై 18 శాతం ట్యాక్స్ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఒక సంవత్సరంలో అద్దె ఆదాయం, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఇతరత్రా ప్రొఫెషనల్ సర్వీసులు వంటి వివిధ సర్వీసుల నుంచి వచ్చే మొత్తం ఆదాయం రూ. 20 లక్షలు దాటిన పక్షంలో ఈ నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఎక్స్ ఇటీవల ప్రకటనలపై తనకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ప్రీమియం సబ్‌స్క్రైబర్స్‌కి కూడా అందించడం ప్రారంభించింది. ఇందుకోసం సదరు సబ్‌స్క్రయిబర్స్ పోస్టులకు గత మూడు నెలల్లో 1.5 కోట్ల ఇంప్రెషన్‌లు, కనీసం 500 మంది ఫాలోయర్లు ఉండాలి. ఎక్స్ నుంచి తమకు ఆదాయం వచ్చినట్లు పలువురు సోషల్ మీడియా యూజర్లు ఈమధ్య పోస్ట్ చేశారు.

పిల్లల భవిష్యత్తు కోసం పెట్టుబడి మార్గాలు?

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?

– భానుశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ముఖ్యంగా ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు. ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది.

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు ధర సగటుగా మారి, మార్కెట్లు గరిష్టాల వద్ద ఉన్నప్పుడు రిస్కును తగ్గిస్తుంది. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?

– శ్రవణ్ పెద్దింటి

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్‌లు నిజంగా మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోవడానికి వీలుంటుంది.




ఇదేంటి? చూడగానే.. ఏదో పెద్ద రాజభవంతో లేదా అంబానీ అదానీ లాంటి వాళ్ల ఇంట్లోని భాగమో అన్నట్లు కనిపిస్తోంది కదూ.. అయితే.. ఇది ఓ షాపింగ్‌మాల్‌లోని బాత్రూం అని మేం చెబితే.. షాకే కదా.. చైనాలోని నాన్‌జింగ్‌లోని దేజీ ప్లాజా షాపింగ్ మాల్‌లో ఈ బాత్రూం ఉంది. ప్రపంచంలోనే అత్యంత సుందరమైన పబ్లిక్ బాత్రూంగా చెబుతున్న దీన్ని షాంగాయ్‌కు చెందిన ఎక్స్ ప్లస్ లివింగ్ అర్కిటెక్చర్ సంస్థ డిజైన్ చేసింది. అదండీ సంగతి.. ఎప్పుడైనా చైనా వైపు పోయేటట్లు ఉంటే.. ప్రకృతి పిలవకపోయినా ఓసారి పోయిరండి.. బాత్రూం అందాలను తిలకించి రండి.



నాగును మింగిన వాలుగ

దంతాలపల్లి: నాగుపాము అంటేనే హడలిపోతారు.. అలాంటిది.. నాగుపామును చేప మింగేసింది. అవును.. మీరు చదివింది నిజమే.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల పరిధిలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. దంతాలపల్లి మండలం లక్ష్మీపురం గ్రామపరిధి పాలేరు వాగు చెక్‌డ్యామ్ పక్కన నీటిలో వాలుగ చేప.. నాగుపామును వెంటాడి మింగుతోంది. ఈ దృశ్యాన్ని చూసిన గ్రామ మొదటి వార్డు సభ్యుడు కొమ్మినేని ప్రశాంత్, మరోవ్యక్తి కుక్కల శ్రీకాంత్ చేపను బయటికి లాగారు. 3.5 కిలోల బరువున్న వాలుగ చేప నాగుపామును మింగేసింది. వారు విషయాన్ని ఉపసర్పంచ్ రాముకు తెలుపగా అక్కడికి చేరుకుని పామును, చేపను విడదీశారు.అప్పటికే పాము మృతి చెందింది.





● దుబాయ్ టు సిటీ.. గోల్డ్ స్మగ్లింగ్

13 కేసులు.. 15.79 కేజీలు

సాక్షి, హైదరాబాద్‌:ఆదివారం రూ.1.25 కోట్ల విలువైన 2 కేజీలు.. శనివారం రూ.4.86 కోట్ల విలువైన 8 కిలోలు.. గురువారం రూ.33.53 లక్షల విలువైన 553 గ్రాములు..మంగళవారం రూ.93.26 లక్షల విలువైన 1.52 కేజీలు.. ఈ నెల 6న రూ.1.18 కోట్ల విలువైన 1.92 కేజీలు.. 4న రూ.28 లక్షల విలువైన 461 గ్రాములు.. 2న రూ.82.42 లక్షల విలువైన 1.34 కిలోలు.. శంషాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో స్వాధీనం చేసుకున్న బంగారం లెక్కలు ఇవి. నగరానికి పెద్దయెత్తున బంగారం అక్రమ రవాణా అవుతుండటం కస్టమ్స్ అధికారులనే కలవరపరుస్తోంది. ఈ నెల 1 నుంచి ఆదివారం వరకు మొత్తం రూ.9.66 కోట్ల విలువైన 15.79 కేజీల బంగారం పట్టుబడగా..ఇందులో 95 శాతానికి పైగా దుబాయ్ నుంచి తెచ్చిందే కావడం గమనార్హం. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో అక్రమ రవాణా గణనీయంగా పెరుగుతోంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కిలోల కొద్దీ బంగారం పట్టివేత

- వ్యవస్థీకృతంగా సాగుతున్న అక్రమ రవాణా
- స్మగ్లింగ్‌కు సూత్రధారులుగా రియల్టర్లు, బడా వ్యాపారులు
- ప్రత్యేకంగా క్యారియర్లను ఏర్పాటు చేసుకుని దందా



కిలోకు రూ.5 లక్షల లాభం

విదేశాల నుంచి పసిడిని కొనుగోలు చేసిన వారు అధికారికంగా ఇక్కడకు తీసుకురావాలంటే పరోక్ష పన్ను విధానంతో లాభసాటి కావట్లేదు. గతంలో 10 గ్రాముల బంగారానికి దిగుమతి సుంకం రూ.350 మాత్రమే ఉండేది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడికి ఉన్న ప్రతి 15 రోజుల సరాసరి ధరను పరిగణనలోకి తీసుకుని ఆ మొత్తంపై 10 శాతం చెల్లించేలా కేంద్రం నిబంధనలు సవరించింది. ఈ కారణంగానే బంగారం స్మగ్లింగ్ పెరుగుతుండగా..దొంగ రవాణా విజయవంతమైతే అన్ని ఖర్చులూ పోనూ స్మగ్లర్లకు కిలోకు కనిష్టంగా రూ.5 లక్షల లాభం ఉంటున్నట్లు తెలుస్తోంది.

టికెట్లు కొనిచ్చి.. విదేశాలకు పంపి..

బడ్జెట్ ప్రవేశపెట్టే లోపు భారీగా అక్రమ రవాణాకు పాల్పడటం ద్వారా పెద్దయెత్తున లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో వ్యవస్థీకృత ముఠాలతో పాటు హైదరాబాద్‌కు చెందిన బడా బాబులు రంగంలోకి దిగినట్లు పోలీసుల అనుమానిస్తున్నారు. ప్రముఖ జ్యువెలరీ సంస్థల యజమానులు, రియల్ ఎస్టేట్ సంస్థల నిర్వాహకులతో పాటు పాత నేరగాళ్లు సైతం క్యారియర్లను ఏర్పాటు చేసుకుని ఈ దందా ప్రారంభించారు. మధ్యవర్తుల ద్వారా కేరళకు చెందిన వారితో పాటు పాతబస్తీకి యువకులు, యువతులు, మహిళలకు కమీషన్ ఇస్తామంటూ ఎర వేస్తున్నారు. వీరికి టికెట్లు కొనిచ్చి విదేశాలకు పంపడం ద్వారా తిరిగి వచ్చేటప్పుడు అక్కడి తమ ముఠా సభ్యుల సహకారంతో బంగారం ఇచ్చి పంపిస్తున్నారు. వీరినే సాంకేతిక పరిభాషలో క్యారియర్లుగా పిలుస్తున్నారు.

స్మగ్లర్లకు స్వర్గధామంగా దుబాయ్

దుబాయ్‌లో ఆదాయపుపన్ను అనేది లేకపోవడంతో మనీలాండరింగ్ అన్నదే ఉత్పన్నం కాదు. దీంతో ఇక్కడినుంచి హవాలా ద్వారా నల్లధనాన్ని అక్కడకు పంపి, దాన్ని బంగారంగా మార్చి ఇక్కడకు తీసుకువస్తున్నారు. దుబాయ్‌లో ఓ వ్యక్తి ఎంత భారీ మొత్తంలో అయినా బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. దాన్ని విమానంలోకి తీసుకువచ్చేటప్పుడు కూడా కేవలం చోరీసొత్తు కాదని ఆధారాలు చూపిస్తే చాలు. దీన్ని ఆసరాగా చేసుకునే స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారు.

జోరుగా రెక్టమ్ కన్సీల్‌మెంట్..

చాలామంది స్మగ్లర్లు ఈ బంగారాన్ని బ్యాగుల అడుగు భాగంలో ఉండే తొడుగులు, లోదుస్తులు, రహస్య జేబులు, బూట్ల సోల్, కార్టన్ బాక్సులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పౌడర్ డబ్బాలతో పాటు మైబైల్ చార్జర్స్ లోనూ దాచి తీసుకువచ్చేవారు. ఆ తర్వాత బ్యాగుల జిప్పులు, బెల్టుల రూపంలోకి బంగారాన్ని మార్చి పైన తాపడం పూసి తేవడం జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో రెక్టమ్ కన్సీల్‌మెంట్ కూడా జోరుగా జరుగుతోంది. సుదీర్ఘకాలం తమ వద్ద పని చేసే క్యారియర్లకు సూత్రధారులు ముంబై, కేరళల్లో ప్రత్యేక శస్త్రచికిత్సలు చేయించడం ద్వారా వారి మలద్వారాన్ని అవసరమైన మేర వెడల్పు చేయిస్తున్నారు. గరిష్టంగా కేజీ వరకు బంగారాన్ని అక్కడ దాచిపెట్టేలా ఏర్పాటు చేస్తున్నారు. బంగారానికి నల్ల కార్బన్ పేపర్ చుట్టడం ద్వారా స్కానర్‌కు చిక్కకుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.

క్లెయిమ్ చెయ్యకుంటే వేలం

కస్టమ్స్ అధికారులు స్మగ్లర్లను గుర్తించడానికి 95 శాతం ప్రొఫైలింగ్ పదర్ధతినే అనుసరిస్తారు. ప్రయాణికుడి ప్రవర్తన, నడవడికతో పాటు పాస్‌పోర్ట్‌లో ఉన్న వివిధ దేశాల ఎంట్రీ, ఎగ్జిట్ స్టాంపులు, విదేశంలో ఉన్న సమయం తదితరాలను పరిగణలోకి తీసుకుంటారు. బయటి రాష్ట్రాల పాస్‌పోర్టులు కలిగిన వారు ఇక్కడ లాండ్ అయినా అనుమానిస్తారు. బంగారం స్మగ్లింగ్ వెనుక భారీ కుట్ర లేకపోతే దాన్ని తిరిగి అప్పగించడానికే ప్రాధాన్యం ఇస్తారు. స్మగ్లర్ బంగారం తనదే అని క్లైమ్ చేసుకుంటే దాని విలువపై 50 నుంచి 60 శాతం కస్టమ్స్ డ్యూటీ వసూలు చేసి ఇచ్చేస్తారు. ఒకవేళ క్లెయిమ్ చేయకపోతే ఆ బంగారాన్ని చెన్నై, ముంబైల్లో కస్టమ్స్ కార్యాలయాలకు తరలించి అక్కడ వేలం వేయడం ద్వారా విక్రయించి ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు.

రియాద్ నుంచి వయా మస్కట్



శంషాబాద్ (హైదరాబాద్): రియాద్ నుంచి అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని ఎయిర్‌పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి రియాద్ నుంచి వయా మస్కట్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న షేక్‌ఖాజా, షేక్‌జాని అనే ఇద్దరు ప్రయాణికులు కస్టమ్స్ తనిఖీలు పూర్తి చేసుకుని లాంజ్‌లోని సిటీసైడ్ ఏరియాలోకి వచ్చారు. వారి కదలికలను అనుమానించిన సీఐఎస్ఎఫ్ అధికారులు మరోసారి లగేజీని ఈకో-5 యంత్రంలో తనిఖీ చేశారు. దీంతో డ్రైఫ్రూట్స్ ప్యాకెట్‌లో ఉంచిన కిలో బరువు కలిగిన బంగారు గొలుసులు బయటపడ్డాయి. దీంతో నిందితులను కస్టమ్స్ అధికారులకు అప్పగించారు.

- ఏకాకి నుంచి సమష్టి దాకా సాగిన ప్రస్థానం నాది
- ప్రముఖ కవి,రచయిత నిఖిలేశ్వర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నగ్నముని, శివారెడ్డి, నిఖిలేశ్వర్

ప్రజా ఉద్యమాలే తీర్చిదిద్దాయి

సాక్షి, హైదరాబాద్‌: 'ఒక ఒంటరిని, ఏకాకిని అయిన నన్ను సాహిత్య, ప్రజా ఉద్యమాలు సామూహికం చేశాయి. నల్లగొండ జిల్లా మారుమూల పల్లెటూరిలో పుట్టి పెరిగిన నన్ను ప్రజాఉద్యమాలు అక్కున చేర్చుకొని సమష్టి జీవితాన్ని అందించాయి.' అని ప్రముఖకవి, రచయిత నిఖిలేశ్వర్ అన్నారు. తన జీవన ప్రస్థానంపై రాసిన 'నిఖిలలోకం' (జీవితచరిత్ర)తోపాటు ఆయన రాసిన మరోగ్రంథం 'సాహిత్య సంగమం' పుస్తకాల ఆవిష్కరణ ఆదివారం హైదరాబాద్ శివం రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. ప్రముఖకవి కె.శివారెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, నగ్నముని రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిఖిలేశ్వర్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని అత్యంత గాఢంగా ప్రభావితం చేసిన దిగంబర సాహిత్యం మొదలుకొని విరసం, అరసం, తదితర సాహిత్య ఉద్యమాలతో తనకు ఉన్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీరవల్లి తన సొంత గ్రామమైనా, హైదరాబాద్‌లోనే తన జీవితం ఆరంభమైందన్నారు. నగ్నముని మాట్లాడుతూ సామాజిక వైరుధ్యాలు, సంక్లిష్టతలను అవగాహన చేసుకొనేందుకు జీవితచరిత్రలు దోహదం చేస్తాయన్నారు. అరవయ్యోదశకం నాటి ఆరుగురు దిగంబర కవుల్లో ప్రస్తుతం తాను, నిఖిలేశ్వర్ మాత్రమే ఉన్నట్టు గుర్తు చేశారు. శివారెడ్డి మాట్లాడుతూ దిగంబర కవుల సాహిత్యం నుంచి తాను గొప్ప స్ఫూర్తి, ప్రేరణ పొందినట్టు చెప్పారు. తెలుగుభాష, సాహిత్యాన్ని నవ్యపథంలో నడిపించిన ఘనత వారిదేనన్నారు. తన పదహారో ఏట మొట్టమొదటిసారి దిగంబర కవులను సంభ్రమాశ్చర్యాలతో చూసినట్టు ప్రముఖ రచయిత్రి ఓల్గా గుర్తు చేసుకున్నారు. నిఖిలేశ్వర్, శివారెడ్డి వంటి ప్రముఖుల జీవితాలను విద్యార్థిదశలో ఎంతో దగ్గరగా చూసే అవకాశం తనకు లభించిందని నందిని సిధారెడ్డి అన్నారు. సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్,తెలకపల్లి రవి, మానవహక్కుల వేదిక కార్యకర్త ఎస్.జీవన్‌కుమార్, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ చంద్రశేఖర్, జతిన్‌కుమార్, నిఖిలేశ్వర్ కుటుంబ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

● పాలమూరులో డ్రోన్ లేజర్ షో





మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ఆదివారం రాత్రి 7.40 నుంచి 7.50 గంటల వరకు 450 డ్రోన్లతో నిర్వహించిన మెగా లేజర్ షో ఆకట్టుకుంది. ఇందులో తెలంగాణ, మహబూబ్‌నగర్ జిల్లా మ్యాప్, కోహినూర్ వజ్రం, కేసీఆర్ అర్బన్ ఎకో పార్కు, పిల్లలమర్రి, ఐలాండ్‌లోని సస్పెన్షన్ కేబుల్ బ్రిడ్జి, శిల్పారామం, ఐటీటవర్, జోగుళాంబ ఆలయ గోపురం, సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జైభారత్.. జై తెలంగాణ, మన మహబూబ్‌నగర్ చిత్రాలను ప్రదర్శించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.